సోమవారం
22•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 27
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




దండాలమ్మా మాంకాలమ్మా..



ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ కూడా ఉన్నారు.

## బోనమెత్తిన లష్కర్

భక్తుల సందడితో ఉప్పొంగిన మహంకాళి ఆలయం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం కేసీఆర్, మంత్రులు అల్లోల, తలసాని

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

అమ్మవారికి బోనం సమర్పించిన కవిత

2



## నేడే చంద్రయాన్-2

### ప్రయోగానికి సర్వం సిద్ధం

- వాహకనౌక: జీఎస్ఎల్వీ మార్క్-3
- ఏమేం ఉంటాయి: ఆర్బిటార్, ల్యాండర్, రోవర్
- బరువు: 3.8 టన్నులు
- ఎత్తు: 43.43 మీటర్లు
- ప్రయోగ వ్యయం: రూ.978 కోట్లు
- ప్రధాన లక్ష్యం: చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్, నీరు, హీలియం-3 జాడలను గుర్తించడం
- చంద్రుడు, భూమి మధ్య దూరం: 3.844 లక్షల కి.మీ.

9

- మధ్యాహ్నం 2.43 గంటలకు నింగిలోకి జీఎస్ఎల్వీ మార్క్-3
- ఆదివారం సాయంత్రం 6.43 గంటలకు మొదలైన కౌంట్‌డౌన్

**వారం**క్రితం వాయిదాపడిన చంద్రయాన్-2 ప్రయోగానికి మరోసారి ఇస్రో సన్నద్ధమైంది. కోట్ల మంది కలలను చందమామ చెంతకు మోసుకెళ్లేందుకు బాహుబలి సిద్ధమైంది. జూలై 15న తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించిన ఇస్రో ఇప్పటికే జీఎస్ఎల్వీ ప్రయోగ రిహార్సల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు ఇస్రో చైర్మన్ కే శివన్ ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం 2.43 గంటలకు భారత్ చంద్రయానం ప్రారంభం కానున్నది.

## సొంతూరుకు సీఎం

### చింతమడకలో నేడు ఆత్మీయ సమావేశం.. సహపంక్తి భోజనాలు

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

'నేను మళ్లీ వస్తా.. అన్ని విషయాలను మాట్లాడుకుందాం.. మీతో రోజంతా గడుపుతా'.. శాసనసభ ఎన్నికల సందర్భంగా ఓటు వేయడానికి స్వగ్రామానికి వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ చింతమడక గ్రామస్థులతో అన్న మాటలివి. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం సొంతూరుకు రానుండటంతో గ్రామస్థులు మహా సంబురపడుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన అధికారులు దాని ప్రకారం ప్రతిపాదనలను రూపొందించారు. సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకడానికి చింతమడక గ్రామమంతా దసరా, దీపావళి, ఉగాది పండుగలు చేసుకున్నంత సంబురంతో ఎదురుచూస్తున్నది. గ్రామప్రజలు ఇండ్లను శుభ్రం చేసుకొని మామిడి తోరణాలు కట్టుకొని అలంకరించుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా హరిత హారం మొక్కలు నాటారు. మాజీమంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ పీ వెంకట్రామ్‌రెడ్డి, పోలీసు కమిషనర్ జోయల్ డెవిస్ ఆదివారం గ్రామంలో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించి గ్రామస్థులతో సమావేశమయ్యారు. సీఎం కేసీఆర్

మిగతా 5వ పేజీలో





సిద్దిపేట జిల్లాలోని చింతమడక గ్రామం

గ్రామంలో కలియదిరగనున్న ముఖ్యమంత్రి

డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవం.. బీసీ గురుకుల పాఠశాలకు శంకుస్థాపన

గ్రామస్థులతో మమేకమయ్యే పర్యటన.. ప్రజలకు ప్రత్యేకంగా ఐడీ కార్డులు

అంతటా పండుగ వాతావరణం.. గ్రామస్థుల సంబురం

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి



టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై

## నేడు కేటీఆర్ సమీక్ష

హాజరుకానున్న సభ్యత్వ నమోదు, డాటా ఎంట్రీ ఇంచార్జీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుపై అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణభవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జీలు, డాటా ఎంట్రీ ఇంచార్జీలు హాజరవుతారని పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు అయిన సభ్యత్వ నమోదు వివరాలు, డాటా ఎంట్రీ జరిగిన సభ్యత్వ నమోదు, ఇతర వివరాలన్నింటిని సమావేశంలో సమీక్షిస్తారని చెప్పారు.

## రైతుబీమా పొడిగింపు!

- 2019-20 ప్రీమియం చెల్లింపుపై ఎంఓయూ సిద్ధం చేయండి
- ఎల్ఐసీకి వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి లేఖ
- ఆగస్టు 13తో ముగియనున్న 2018-19 ప్రీమియం గడువు
- 13,172 మంది రైతుకుటుంబాలకు 658 కోట్ల చెల్లింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే.. ఆ కుటుంబాన్ని ఆదుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం మరో ఏడాది పొడిగింపునకు వ్యవసాయశాఖ కసరత్తు మొదలుపెట్టింది. 2019-20 సంవత్సరం ప్రీమియం చెల్లింపుపై ఎంవోయూను సిద్ధం చేసి పంపాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్‌కు లేఖ రాశారు. 2018-19 సంవత్సరం రైతు బీమా ప్రీమియానికి సంబంధించి ఎల్ఐసీతో వ్యవసాయ శాఖ చేసుకున్న ఒప్పందం ఆగస్టు 13వ తేదీతో ముగియనున్నది. మరో ఏడాది పొడిగింపునకు

మిగతా 12వ పేజీలో

## కన్నెపల్లిలో ఎత్తిపోత పునఃప్రారంభం

- నాలుగురోజుల విరామం తర్వాత మొదలు
- అన్ని మోటర్లు ఆటోమోడ్‌లోకి
- 3, 4 నంబర్ల మోటర్లతో ఎత్తిపోత
- మేడిగడ్డ బరాజ్ గేట్లు మూసివేత
- అన్నారం పంపుహౌస్‌లో 1వ మోటర్‌కు సింక్రనైజేషన్ ప్రక్రియ పూర్తి
- నేడు రెండు మోటర్ల ద్వారా సుందిల్లకు జలాల ఎత్తిపోత!
- ఎగువన గోదావరిలోకి వరద

3



ఆదివారం కన్నెపల్లి పంప్‌హౌస్‌లో 3వ, 4వ నంబర్ మోటర్లను ఆన్ చేయడంతో డెలివరీ సిస్టర్న్‌లోని పైపుల నుంచి గ్రావిటీ కెనాల్‌లోకి వెళ్తున్న ప్రాణహిత జలాలు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో ఆదివారం ఆసరా పింఛన్ల పంపు ప్రొసీడింగ్ పత్రాలను అందుకొని మురిసిపోతున్న లబ్ధిదారులు

7

## కొత్త పింఛన్‌దారులు 8,45,339

- గతేడాది నవంబర్ ఓటరు జాబితా ప్రకారం లెక్కతేల్చిన అధికారులు
- అర్హుల జాబితా రూపకల్పనకు కసరత్తు
- పంచాయతీలు, వార్డులవారీగా ముసాయిదా
- అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తర్వాతే తుదిజాబితా
- ఆమోదంపై తుది నిర్ణయం కలెక్టర్లదే
- నేటినుంచి లబ్ధిదారుల ఖాతాల్లో రెట్టింపు పింఛన్

2

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 76.00 | రిటైల్ లైవ్ | 98.00 |
| డ్రెస్డ్ | 142.00 | స్కిన్‌లెస్ | 162.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 325.00 | రంగారెడ్డి | 325.00 |
| మెదక్ | 325.00 | కరీంనగర్ | 328.00 |
| వరంగల్ | 328.00 | చిల్లర ధర | 3.85 |

## అసైన్డ్‌భూముల్లో చిచ్చు!

ధర్మగంట

- అక్రమార్కుల చెరలో వందల ఎకరాలు
- దళితుల పట్టాభూములూ దర్జాగా కబ్జా
- రెవెన్యూచట్టాలకు అధికారుల తూట్లు
- అసైన్డ్‌భూములకూ యథేచ్ఛగా థర్డ్‌పార్టీ రిజిస్ట్రేషన్లు
- బై నంబర్లు వేసి స్థానికేతరులకు కొత్త పాస్‌పుస్తకాలు
- జేసీ ఆదేశాలనూ ఖాతరుచేయని తాసిల్దార్
- భూముల కోసం పొడ్చన్‌పల్లి దళితుల ఆందోళన



జేసీ ఆదేశాల మేరకు తాసిల్దార్ సర్వేచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలోని అసైన్డ్‌భూముల్లో ధర్నా చేస్తున్న బాధిత దళిత రైతులు

**ఒక్క**గుంట కూడా భూమిలేని నిరుపేదలు వారు. ఎన్నో కష్టాలకు ఓర్చి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అసైన్డ్‌భూములను చదును చేసుకుని.. సాగుచేసుకుంటూ జీవనంసాగిస్తున్న దళితులు వారు. వారి కష్టాలను గుర్తించి ప్రభుత్వం వారికి పట్టాలు పంపిణీ చేసింది. అలాంటి భూముల్లో రెవెన్యూ అధికారులు చిచ్చుపెట్టారు. దళితులకు కేటాయించిన భూములనే బైనంబర్లు వేస్తూ.. ఆక్రమణదారులకు స్థానికేతరులకు పాస్‌పుస్తకాలు ఇచ్చి ఘర్షణలకు కారణమయ్యారు. రెవెన్యూ చట్టాలను తుంగలో తొక్కి అసైన్డ్ భూములను స్థానికేతరులకు పట్టాలు చేశారు. ఇటు దళితులు, అటు ఆక్రమణదారుల మధ్య చిచ్చు రాజేసి చోద్యం చూస్తున్నారు. రెవెన్యూశాఖలో కొందరు అధికారుల తప్పిదాలకు దాదాపు 170 దళిత కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి నెలకొన్నది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి గ్రామ దళితుల దీనగాథపై ప్రత్యేక కథనం..

4వ పేజీలో





ఆదివారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి మొక్కు చెల్లిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా ఉన్నారు.



సికింద్రాబాద్ టకార బస్తీలోని ముత్యాలమ్మ దేవాలయంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్ కూడా ఉన్నారు.

## మున్సిపల్ చట్టానికి గవర్నర్ ఆమోదం

గెజిట్ విడుదలచేసిన న్యాయశాఖ • అమలులోకొచ్చిన కొత్త చట్టం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన మున్సిపల్ చట్టానికి గవర్నర్ నరసింహన్ ఆదివారం ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో వేగవంతమవుతున్న పట్టణాభివృద్ధి ప్రణాళి కాబద్ధంగా కొనసాగేలా, ఎలాంటి అవినీతి అక్రమాలు లేకుండా పుర ప్రజలకు సేవలు అందించేలా చూసేందుకు రూపొందించిన కొత్త మున్సిపల్ బిల్లును ఈ నెల 18,19 తేదీల్లో ప్రత్యేకంగా సమావేశమైన అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఉభయసభలు ఆమోదించిన ఈ చట్టాన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. నూతన పురపాలక చట్టాన్ని పరిశీలించిన గవర్నర్ ఆదివారం ఆమోదించారు. ఈ చట్టాన్ని గవర్నర్ ఆమోదించిన వెంటనే న్యాయశాఖ గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో నూతన పురపాలక చట్టం ఆదివారం నుంచి అధికారికంగా అమలులోకి వచ్చింది. సోమవారం నుంచి పురపాలకశాఖ కార్యకలాపాలన్నీ కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం జరుగుతాయి.



# బోనమెత్తిన లష్కర్

## భక్తుల సందడితో ఉప్పొంగిన మహంకాళి ఆలయం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం కేసీఆర్, మంత్రులు అల్లోల, తలసాని

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

బోనాలమ్మ బోనాలు.. మహంకాళి బోనాలు.. ఆదివారం అన్ని తొవ్వలూ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం వైపే అన్నట్లు భక్తుల సందడితో లష్కర్ ఉప్పొంగిపోయింది. జాతర, బోనాల ఉత్సవాలు భక్తజన సందోహం నడుమ కన్నుల పండువగా జరిగాయి. సీఎం కేసీఆర్, మంత్రులు అల్లోల, తలసాని.. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకా పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆదివారం ఒగ్గుడోలు, కురుమ డప్పుల దరువులకు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో లష్కర్ పరిసరాలన్నీ మార్మోగిపోయాయి. జాతర స్వాగత తోరణాలు ఆకర్షణగా నిలిచాయి. భక్తుల రాకపోకలు, ఫలహార బండ్లు, ఘటాలు, ఊరేగింపులతో ఆలయ పరిసర వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఆలయాన్ని పూలతో.. విఘ్నేశ్వరుడు, డమరుకం, అమ్మవారి కండ్లు, శూలం కనిపించేలా ప్రత్యేకరీతిలో అలంకరించారు. లోపలిభాగాన్నంతా అమ్మవారికి ఇష్టమైన వేలాడే బోనాలు దర్శనమిచ్చేలా తీర్చిదిద్దారు. సికింద్రాబాద్ పరిధిలోని భక్తులంతా అమ్మవారికి బంగారు, వెండి, మట్టి కుండలలో బోనాలను సమర్పించారు. కొందరు భక్తులు బోనంపై బోనం (మూడు మెట్లు, రెండు మెట్ల బోనాల్ని) పెట్టుకొని నృత్యం చేసుకుంటూ వచ్చి అమ్మవారికి అత్యంత భక్తితో సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పిస్తూనే ఉన్నారు. ఆదివారం కావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. సికింద్రాబాద్‌లోని వ్యాపారులు తమ కార్యకలాపాలను బంద్ చేసి భక్తులకు అసౌకర్యం కలుగకుండా సహకరించారు.

### అమ్మవారిని దర్శించుకున్న సీఎం

ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్.. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఇంకా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, హైకోర్టు న్యాయమూర్తి అమర్‌నాథ్‌గౌడ్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ రాంచందర్, మాజీ ఎంపీలు బండారు దత్తాత్రేయ, కల్వకుంట్ల కవిత, మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, కాం గ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. దేవాదాయ కమిషనర్ వీ అనిల్‌కుమార్, డిప్యూటీ కమిషన్ ఎం రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఎండోమెంట్ అధికారి అన్నపూర్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడానికి వస్తున్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

### అమ్మవారికి బోనం సమర్పించిన మాజీ ఎంపీ కవిత

**సికింద్రాబాద్** ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆదివారం మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు. ఆమె సాయంత్రం నాలుగు గంటలకు మోండా డివిజన్ ఆదయ్యనగర్‌లోని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసం నుంచి మట్టి కుండతో తయారుచేసిన బోనాన్ని తీసుకెళ్ళారు. ఆదయ్యనగర్ గ్యాస్ మండి నుంచి మహంకాళి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి బోనం సమర్పించారు. ఈ బోనంతో పాటు 1008 బోనాలను కూడా అమ్మవారి ఆలయానికి తీసుకొని వెళ్లారు. మహిళలందరూ తలపై బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. ఆదయ్యనగర్ నుంచి బంగారు బోనాన్ని ఊరేగింపుగా తీసుకొనిరాగా కార్పొరేటర్ ఆకుల రూప ఆ బోనాన్ని తలపై ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు.



మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు

### డిప్యూటీ స్పీకర్ ఇంటికి సీఎం కేసీఆర్

**ఉజ్జయిని** మహంకాళికి పూజలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు గౌడ్ ఇంటికి వెళ్లారు. టకార బస్తీ పరిధిలోని స్థానిక ముత్యాలమ్మ దేవాలయంలో పద్మారావుగౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బోనాల పండుగను పురస్కరించుకొని సికింద్రాబాద్ టకార బస్తీలోని తన నివాసంలో పద్మారావుగౌడ్ ఏర్పాటుచేసిన విందులో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రులకు పద్మారావుగౌడ్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులు సాదర స్వాగతం పలికారు. పద్మారావు కుటుంబసభ్యులు, మనుమండ్లతో సీఎం కేసీఆర్ కొద్దిసేపు మాట్లాడారు. విందులో ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నిపోరుకు టీఆర్‌ఎస్ సన్నద్ధం

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా క్యాడర్

కొత్త చట్టంతో ఫలితాలు ఏకపక్షమేనని అంచనా

పార్టీ నేతలను సమన్వయపరుస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సన్నద్ధమైంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల మీద గులాబీ జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నది. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సిద్ధంచేశారు. కొత్తగా తీసుకొచ్చిన మున్సిపల్ చట్టంతో ప్రజల్లో టీఆర్‌ఎస్‌కు మరింత మద్దతు పెరిగిందని, ఎన్నికలు దాదాపుగా ఏకపక్షంగా సాగుతాయని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లో గులాబీ దళానికి ప్రజలు మద్దతు పలుకుతూ వస్తున్నారు. అదే ఊపు, ఉత్సాహాన్ని మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ చూపుతారని పార్టీ నాయకులు ఆశిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటుచేసింది. మున్సిపాలిటీల అభివృద్ధి, పారదర్శక నిర్వహణ, జవాబుదారీతనం, అవినీతిలేని పాలన, అనుమతులకు కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేకుండా చేయడానికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన మున్సిపల్ చట్టంపై ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తున్నది. కొత్త మున్సిపల్ చట్టంపై అసెంబ్లీలో సీఎం కేసీఆర్ సమగ్రంగా వివరించిన తీరుతో ప్రజలు చట్టానికి ఫిదా అవుతున్నారు. ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నారు. ఇన్నాళ్లుగా ప్రజలు కోరుకున్న చట్టాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ పార్టీకే మద్దతు పలుకాలని మధ్యతరగతి, తటస్థ ఓటర్లు సైతం సిద్ధమయ్యారు. సభ్యులు కొత్తచట్టం గురించి తెలుసుకొని పోటీచేయడానికి వీలుగా చట్టా న్ని తీసుకొచ్చారు. సభ్యత్వ నమోదుతోపాటుగా మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నేతలకు సీఎం కేసీఆర్ సూచించారు. మున్సిపాలిటీలు, నగరాల్లోని ప్రతి కాలనీని సందర్శించి పార్టీలో సభ్యత్వం తీసుకునేవిధంగా కాలనీ కమిటీల వారిని ప్రోత్సహించాలని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు మున్సిపాలిటీల్లో విస్తృతంగా పర్యటించారు.



**సమన్వయంతో సత్ఫలితాలు**

అభ్యర్థి ఎవరైనా టీఆర్‌ఎస్ గెలిచేలా అందరు కలిసి పనిచేయాలని నాయకులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సూచించారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇతర జిల్లాల ఎమ్మెల్యేలతోనూ సమావేశమై మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలువాల్సిన ఆవశ్యకతను వివరించారు. అత్యధిక మున్సిపాలిటీలతోపాటుగా కార్పొరేషన్లపైనా గులాబీ జెండా ఎగురడమే లక్ష్యంగా ఆయన నాయకులను సమన్వయం చేస్తున్నారు. మున్సిపాలిటీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచిస్తున్నారు. పార్టీలో కష్టపడినవారికి టిక్కెట్లు ఇవ్వనున్నట్లుగా.. అదే సమయంలో సామాజిక సమతూకంలో భాగంగా ఎవరికైనా సీట్లు రాకుంటే వారికి భవిష్యత్‌లో గుర్తింపు వచ్చేలా చూస్తామని భరోసా ఇస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాగానే అభ్యర్థుల ఎంపికపై దృష్టిపెట్టాలని నేతలకు సూచించారు. సభ్యత్వ నమోదు ఇంచార్జీలుగా ఉన్నవారు మున్సిపల్ ఎన్నికల వరకు కొనసాగనున్నారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.56 గంటలకు

సూర్యాస్తమయం: 6.49 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, పంచమి మధ్యాహ్నం 2.06 వరకు, తదుపరి షష్టి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉదయం 10.25 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, అమృత ఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 7.33 నుంచి 9.09 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.57 నుంచి మధ్యాహ్నం 12.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 4.14 వరకు, వర్జ్యం: రాత్రి 11.50 నుంచి 1.26 వరకు.

### లోకం పోకడ




బలం ప్రదర్శించడంలో ఏమాత్రం వెనకడుగు వేయొద్దు.. అన్నీ బలవర్ధకమైన వంటలే చేసిపెట్టాను.. మొహమాటం లేకుండా బాగా తిని వెళ్లండి!

# కొత్త పింఛన్‌దారులు 8,45,339

గతేడాది నవంబర్ ఓటరు జాబితా ప్రకారం లెక్కతేల్చిన అధికారులు

- అర్హుల జాబితా రూపకల్పనకు కసరత్తు
- పంచాయతీలు, వార్డులవారీగా ముసాయిదా
- అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తర్వాతే తుదిజాబితా
- ఆమోదముద్రపై తుది నిర్ణయం కలెక్టర్లదే
- నేటినుంచి లబ్ధిదారుల ఖాతాల్లో రెట్టింపు పింఛన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొత్త పింఛన్‌దారుల ఎంపికకు కసరత్తు మొదలైంది. గతేడాది నవంబర్ 19న విడుదలచేసిన జాబితాను అనుసరించి వృద్ధాప్య పింఛన్‌దారుల కొత్త జాబితాను రూపొందించనున్నారు. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలివ్వడంతో రాష్ట్రంలో 57 నుంచి 64 ఏండ్ల లోపువారు 8,45,339 మంది ఉన్నట్టు అధికారులు లెక్కతేల్చారు. ప్రస్తుతం 65 ఏండ్లు పైబడిన వారందరికీ పింఛన్లు ఇస్తున్నారు. ఇకపై 57 ఏండ్లు నిండిన వారికి కూడా పింఛన్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడంతో ఆ ప్రకారమే అర్హుల ఎంపిక మొదలుపెడుతున్నారు. మరోవైపు రెట్టింపు చేసిన పింఛన్ల సొమ్ము సోమవారం నుంచే లబ్ధిదారుల ఖాతాల్లో జమకానున్నది. ఇందుకోసం బ్యాంకులు, పోస్టాఫీసులకు మొత్తం రూ.863.24 కోట్లు తరలించారు. పింఛన్ల పెంపుదల ఉత్తర్వులు కూడా గ్రామగ్రామాన లబ్ధిదారులకు చేరాయి. పింఛన్‌దారులకు పోస్టాఫీసుల మాదిరిగా బ్యాంకర్లు కూడా నగదు ఇవ్వాలని, మండలాల్లో గ్రామాలవారీగా నిర్దేశించిన రోజుల్లో పింఛన్ సొమ్మును అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



**ప్రతినెలా రూ.863.24 కోట్లు చెల్లింపు**

ప్రస్తుతం రాష్ట్రంలో 38.99 లక్షల మంది ఆసరా పింఛన్‌దారులున్నారు. పెంచిన సొమ్ము ప్రకారం వారికి ప్రతినెలా రూ.863.24 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. ఇందుకు బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లకుపైగా కేటాయించారు. గతంలో ఏటా రూ.5,500 కోట్లు కేటాయించేవారు. కానీ సీఎం కేసీఆర్ పింఛన్ సొమ్మును రెట్టింపు చేయడంతోపాటు వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుల వయోపరిమితిని తగ్గించడంతో నిధులు పెంచడం అనివార్యమైంది. ప్రస్తుతం రాష్ట్రంలో 12,92,594 మంది వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటున్నారు. అర్హుల వయోపరిమితి తగ్గించడంతో ఈ సంఖ్య మరో ఏడు లక్షలకుపైగా పెరిగే అవకాశమున్నది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారు మాత్రమే ఈ పింఛన్లకు అర్హులు.

### అర్హులకు అన్యాయం చేయరాదు

**జీవిత** చరమాంకంలో ఉన్నవారికి ఆసరా పింఛన్లలో అన్యాయం చేయరాదని, లబ్ధిదారుల ఎంపికలో అధికారులు మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని ప్రభుత్వం పేర్కొన్నది. లబ్ధిదారుల ముసాయిదా జాబితాను వార్డులు, గ్రామపంచాయతీల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో కచ్చితంగా ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించాలని, ఆ తర్వాత అర్హుల అన్ని వివరాలతో తుదిజాబితాను సిద్ధంచేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లదేనని స్పష్టంచేసింది. జాబితా సిద్ధమైన తర్వాత మండలాల నుంచి ఎంపీడీవోలు, మున్సిపాలిటీల నుంచి కమిషనర్లు ఆమోదం కోసం జిల్లా కలెక్టర్లకు నివేదించాలని, కలెక్టర్ల ఆమోదం తర్వాత సదరు జాబితాను ఆసరా సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

# మున్సిపల్ ఎన్నికలకు రేపోమాపో నోటిఫికేషన్



రిజర్వేషన్ల ఖరారుపై ఉన్నతాధికారులతో సీఎస్ జోషి సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపాలక ఎన్నికలకు ఒకటి రెండ్రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశమున్నది. వార్డుల విభజనపై సోమవారం హైకోర్టులో దాదాపుగా స్పష్టత రావచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదివారం సచివాలయంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావుతో సమీక్ష నిర్వహించారు. వివిధ మున్సిపాలిటీలపై హైకోర్టులో ఉన్న కేసుల గురించి ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్టు తెలిసింది. వార్డుల విభజనను శాస్త్రీయంగా నిర్వహించిన విషయాన్ని హైకోర్టుకు తెలియజేయాలని, అయితే కోర్టు తీర్పు తర్వాతే రిజర్వేషన్లు ఖరారు చేయాలని అధికారులకు సీఎస్ స్పష్టంచేసినట్టు సమాచారం. మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారైన తర్వాత ప్రభుత్వం సంబంధిత ఫైల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేస్తుంది. ఈ ఫైల్ అందిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయనున్నది. సీఎస్‌తో సమావేశం ముగిసిన తరువాత న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావుతో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ సమావేశమయ్యారు. హైకోర్టుకు నివేదించాల్సిన అంశాలపై ఈ భేటీలో చర్చించినట్టు సమాచారం.

# కొత్త రెవెన్యూ చట్టంపై సర్కార్ దృష్టి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అధికారుల్లో జవాబుదారీతనం పెంచడమే ఉద్దేశం

- పంచాయతీ, మున్సిపల్ చట్టాల మాదిరిగా పకడ్బందీగా రెవెన్యూ చట్టం
- అవినీతికి ఆస్కారం లేకుండా పనులు సాగాలన్నదే సీఎం కేసీఆర్ భావన
- 'నమస్తే తెలంగాణ' ధర్మగంటకు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులపై ఆరా
- రెవెన్యూ చట్టం రూపకల్పనపై కసరత్తు ప్రారంభించిన ఉన్నతాధికారులు

అవినీతిపై తెలంగాణ ప్రభుత్వం సమరభేరీ మోగించింది. రాష్ట్రంలో అవినీతిని అంతమొందించాలన్న ఏకైక లక్ష్యంతో ఒకదాని వెంట ఒకటిగా పకడ్బందీ చట్టాలకు రూపకల్పన చేస్తున్నది. ఇప్పటికే గ్రామపంచాయతీ, మున్సిపల్ చట్టాలను తీసుకొచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు నూతన రెవెన్యూ చట్టంపై దృష్టి సారించింది. ప్రజలు లంచాలు ఇచ్చే అవసరం లేకుండా నిర్ణీత సమయంలో పనులు వాటంతట అవే జరిగిపోయేలా వ్యవస్థలు రావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు భావించారు. అందుకే చట్టాలను పక్కాగా రూపొందిస్తున్నారు. నిర్ణీత సమయంలోగా సంబంధిత అధికారులు పనిచేయని పక్షంలో చర్యలుంటాయన్న హెచ్చరికలు కూడా కొత్త చట్టాల్లో పొందుపరిచి వారిలో జవాబుదారీతనం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలకు నిత్యం సేవలందించే పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల్లో అవినీతిని అంతమొందిస్తే మిగతా శాఖల్లో కూడా చాలా సులువుగా అరికట్టవచ్చునని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన కొత్తలో తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ ద్వారా ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు లభిస్తున్నాయి. తక్కువ సమయంలోనే టీఎస్ ఐపాస్ విజయవంతమైనట్టుగానే.. మిగతా శాఖల్లో కూడా నిబంధనల్ని సరళతరం చేస్తూ, ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యతలను గుర్తుచేసేలా చట్టాల రూపకల్పన చేస్తున్నారు.

**ఉన్నతస్థాయిలో మొదలైన కసరత్తు**

కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో ఉన్నతాధికారులు అధ్యయనం మొదలు పెట్టినట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 145 రెవెన్యూ చట్టాలు అమలులో ఉన్నాయి. అన్ని రెవెన్యూ చట్టాలకు మదర్ డాక్యుమెంట్‌గా తెలంగాణ రెవెన్యూ చట్టం-1317 ఫస్లీ ఉంటుంది. ఇందులో ముఖ్యంగా రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్) భూసేకరణ, అసైన్డ్, సర్వే సెటిల్‌మెంట్ చట్టాలు ఉన్నాయి. జాగీర్దార్ అబాలిషన్ చట్టం-1965 ముగిసిన తరువాత కూడా సీఎస్ 13, సీఎస్14 కేసులు ఉన్నాయి. ఇనాందారుల చట్టం ముగిసినప్పటికీ ఓఆర్సీలు ఇంకా ఇస్తున్న సంఘటనలు ఉన్నాయని అధికారులే చెప్తున్నారు. ప్రొటెక్ట్ టెనెంట్ యాక్ట్ (పీటీ)-1973 ఏనాడో ముగిసినప్పటికీ.. 38-ఈ సర్టిఫికెట్లు ఇస్తున్న పరిస్థితి ఉన్నదంటున్నారు. వీటన్నింటికి చెక్ పెట్టాలంటే పట్టా భూమి, ప్రభుత్వ భూమి అనే వర్గీకరణ తీసుకురావాలని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటివరకు టైటిల్ గ్యారంటీ లేకపోవడంతో ఎవరైనా వివాదం సృష్టిస్తే.. ఆ భూమి తనదేనని సదరు భూ యజమాని నిరూపించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. విలువైన భూములపై కబ్జాదారులు వివాదాలు సృష్టించి కాజేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్‌పెట్టడంతోపాటు రైతుల భూముల రికార్డులకు భద్రత కల్పించేలా టైటిల్ గ్యారంటీ చట్టంగాని, ఇప్పటివరకున్న అన్ని రెవెన్యూ చట్టాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి ఒకే రెవెన్యూ కోడ్‌ను తీసుకురావడంగానీ చేస్తే ఎలా ఉంటున్నదన్న విషయంపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నట్టు తెలిసింది. భూమి యజమానికి భరోసాతోపాటు అవినీతికి ఆస్కారం లేని విధంగా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దేలా కొత్త చట్టాన్ని తేవడానికి కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

### అవినీతికి తావులేకుండా..

**రెవెన్యూశాఖలో** క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిపై సీఎం కేసీఆర్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకొనేందుకు ప్రయత్నిస్తుండగా.. అన్నింటిలో రాబందుల్లా పీక్కుతింటున్నారని, అవినీతి తీవ్రంగా ఉందని బాధపడుతున్నారు. రైతుబంధు పథకం రైతులందరికీ అమలుచేయాలని భూ రికార్డుల ప్రక్షాళన చేపడితే.. కొత్త సమస్యలు తెరపైకి రావడంతో చాలా మంది రైతులకు రైతుబంధు సాయం దక్కని పరిస్థితి ఏర్పడింది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక నిర్వహిస్తున్న ధర్మగంట శీర్షికకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న అంశంపై కూడా సీఎం కేసీఆర్ ఆరా తీశారు. భూమి సమస్యలు పెరుగడానికి అధికారుల అవినీతి, నిర్లక్ష్య వైఖరే కారణమన్న భావన బలంగా ఉన్నది. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖలో అవినీతికి ఆస్కారంలేని కొత్త విధానం తీసుకురావాలన్న దృఢనిశ్చయంతో సీఎం కేసీఆర్ ఉన్నారు. ఈ మేరకు కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాలని, ఇందుకోసం అత్యున్నత రెవెన్యూ విధానంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.







తెలంగాణ జల జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు దేశ చరిత్రలోనే అపూర్వ నిర్మాణం. గత పదిహేను రోజులుగా మేడిగడ్డ నుంచి అన్నారం దాకా పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలు కనువిందుచేస్తున్నాయి. తాజాగా ఉపగ్రహం నుంచి తీసిన ఛాయాచిత్రాలు సమగ్రమైన కాళేశ్వరం ప్రాజెక్టును అద్భుత దృశ్యకావ్యంగా ఆవిష్కరిస్తున్నాయి. (ఈ నెల 18న తీసిన ఉపగ్రహ ఛాయా చిత్రాలివి)

జలాభిషేకం

# కన్నెపల్లిలో ఎత్తిపోత పునఃప్రారంభం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

## నాలుగురోజుల విరామం తర్వాత మొదలు

- అన్ని మోటర్లను ఆటోమోడ్‌లోకి తీసుకొచ్చిన అధికారులు
- 3, 4 నంబర్ల మోటర్లతో ఎత్తిపోత.. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూసివేత
- అన్నారం పంపుహౌస్‌లో 1వ మోటర్‌కు సింక్రనైజేషన్ ప్రక్రియ పూర్తి
- నేడు రెండు మోటర్ల ద్వారా సుందిళ్లకు జలాల ఎత్తిపోత!
- ఎగువన గోదావరిలోకి వరద

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌లో గోదావరి జలాల ఎత్తిపోత ఆదివారం మళ్లీ మొదలయింది. ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో మేడిపల్లి బరాజ్ గేట్లను అధికారులు మూసివేశారు. కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్‌లో సోమవారం 1, 2వ నంబర్ల మోటర్లను ద్వారా సుందిళ్లకు నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మ్యానువల్ నుంచి ఆటోమోడ్‌లోకి తీసుకొచ్చేందుకు నాలుగు రోజులపాటు మోటర్లను నిలిపివేసిన ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం రెండు మోటర్లను ఆన్‌చేసి.. అన్నారం బరాజ్‌లోకి జలాలను ఎత్తిపోశారు. పంప్‌హౌస్‌లో అన్ని మోటర్లు ఆటోమోడ్‌లోకి వచ్చాయని ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం అర్ధరాత్రి 3వ నంబర్ మోటరు ఆన్‌చేసిన అధికారులు ఆదివారం ఉదయం 8 గంటల వరకు నడిపి ఆఫ్‌చేశారు. తిరిగి 11 గంటలకు 3, 4వ నంబర్ల మోటర్లను ఆన్‌చేసి డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌లోకి గోదావరి జలాలను తరలించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని 2వ నంబర్ మోటర్‌ను ఏక్షణంలోనైనా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు. అన్నారం బరాజ్ గేట్లవద్ద గోదావరి జలాలు 9.92 మీటర్లకు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు మేడిగడ్డ నుంచి అన్నారం బరాజ్‌కు 5.87 టీఎంసీల నీరు చేరిందని అధికారులు తెలిపారు. కాగా, మేడిగడ్డ బరాజ్ గేట్లను ఆదివారం మూసివేశారు. ఎగువ నుంచి ప్రాణహిత వరద తగ్గుముఖం పట్టడం, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లను తిరిగి ప్రారంభించడంతో బరాజ్‌లో నీటిని నిల్వచేసేందుకు అధికారులు గేట్లను మూసివేశారు. ప్రస్తుతం బరాజ్‌లో 8.5 మీటర్ల ఎత్తులో ఏడు టీఎంసీల నీరునిల్వ ఉన్నది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్



అన్నారం బరాజ్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా తరలుతున్న గోదావరి జలాలు



మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్‌లో మొదటి మోటర్‌ను ఆన్‌చేయడంతో డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకుతున్న గోదారి జలాలు

## అన్నారం రెండోమోటర్‌కు వెట్‌రన్ ప్రక్రియ ప్రారంభం

మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంపుహౌస్ 1వ నంబర్ మోటర్ సింక్రనైజేషన్ ప్రక్రియ పూర్తయింది. 2వ నంబర్ మోటర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల పథకాల ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, ఇంజినీరింగ్ నిపుణుల సమక్షంలో వెట్‌రన్ ప్రక్రియను ప్రారంభించారు. 1వ మోటర్‌కు శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు పలుమార్లు వివిధ రకాల పరీక్షలను నిర్వహించి సింక్రనైజేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. సోమవారం సాయంత్రం నుంచి ఈ మోటర్ సుందిళ్ల పంపుహౌస్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నది. 2వ మోటర్‌కు సోమవారమే వెట్‌రన్ చేసి నీటిని ఎత్తిపోసేలా సిద్ధంచేశారు. వాస్తవానికి రెండోపంపును ఆదివారమే ప్రారంభించాల్సి ఉండగా విదేశీ ఇంజినీర్లు మధ్యాహ్నం 2 గంటల తర్వాత పంపుహౌస్‌కు చేరడంతో ప్రక్రియ ఆలస్యమయింది. సోమవారం సాయంత్రం నీటిని ఎత్తిపోసే విధంగా చర్యలు చేపడుతున్నారు. కాగా, అన్నారం పంప్‌హౌస్‌లో మొదటి మోటర్ పరీక్షల నిమిత్తం చేసిన పంపింగ్‌తో సుందిళ్ల బరాజ్‌లోకి ఇప్పటివరకు 0.06 టీఎంసీల నీరు చేరింది.

## కన్నెపల్లిని సందర్శించిన సీఎండీ ప్రభాకర్‌రావు

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ట్రాన్స్‌కో- జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఆదివారం కుటుంబసమేతంగా పూజలుచేశారు. వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మండపంలో ఆశీర్వచనంచేసి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ప్రభాకర్‌రావు కుటుంబసమేతంగా కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ మెఘా కంపెనీ సీజీఎం వేణుమాధవ్, ఇంజనీర్లు వారికి స్వాగతంపలికారు. పంప్‌హౌస్ వ్యూపాయింట్ నుంచి డీఈఈ సూర్యప్రకాశ్ ప్రాజెక్టు గురించి వివరించారు. ఫోర్‌బే, డెలివరీ సిస్టర్న్ వద్ద గ్రావిటీ కెనాల్‌లో పోస్తున్న నీటిని పరిశీలించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల పనితీరును తెలుసుకుంటున్న ట్రాన్స్‌కో- జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

## ఐదు బాహుబలి మోటర్ల డ్రైరన్ పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన బాహుబలి మోటర్ల డ్రైరన్ ఒక్కొక్కటిగా పూర్తవుతున్నది. ఇప్పటివరకు ఐదుమోటర్ల డ్రైరన్‌ను అధికారులు విజయవంతంగా పూర్తిచేశారు. ఈ క్రమంలో అధికారులు సింక్రనైజేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-8 కింద రామడుగు పంపుహౌస్‌లో ఈ మోటర్లను అమర్చారు. 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఏడుమోటర్లను రామడుగు పంపుహౌస్‌లో అమరుస్తున్నారు. తద్వారా రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు వీలవుతుంది. అయితే ఇప్పటివరకు ఐదు మోటర్ల డ్రైరన్‌ను కూడా అధికారులు పూర్తిచేశారు. మిగిలిన రెండింటిలో ఈ నెలాఖరుకు ఒకటి, వచ్చేనెలలో మరోమోటర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తుచేస్తున్నారు.

## కృష్ణా బేసిన్‌లో ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం

కృష్ణాబేసిన్‌లో ఇన్‌ఫ్లోలు పడిపోతున్నాయి. ఆదివారం ఆల్మట్టి వద్ద 19,155 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదైంది. 129.72 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఆల్మట్టిలో ప్రస్తుతం 116.34 టీఎంసీల నిల్వ ఉన్నది. ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో కర్ణాటక అధికారులు అవుట్‌ఫ్లోను నిలిపివేశారు. నారాయణపూర్‌కు 190 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. దిగువన ఉజ్జయినికి 3,141 క్యూసెక్కులు, తుంగభద్రకు 4,895 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తున్నది. స్థానికంగా కురిసిన వర్షాలతో నాగార్జునసాగర్‌కు రెండు రోజుల కిందట రెండువేల క్యూసెక్కులకు పైగా ఉన్న ఇన్‌ఫ్లో ఇప్పుడు 643 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రకాశం బరాజ్ వద్ద 5,226 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది.

రికవరీ ఆఫీసర్-2 వారి సమక్షంలో
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2**
మొదటి అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001.

**O.A No.558/2011 లో R.P. No.910/2017 (పాత ఆర్.పి. నెం. 263/2013)**
దిగువ వారి మధ్య:
**కెనరా బ్యాంక్, మెట్టుగూడ బ్రాంచ్,** సికింద్రాబాద్ ... **సర్టిఫికెట్ హోల్డర్**
మరియు
**శ్రీమతి డా॥ కె.విజయలక్ష్మి శారద & ఇతరులు** ... **సర్టిఫికెట్ డెటార్**

**సర్టిఫికెట్ డెటార్స్‌కు డిమాండ్ నోటీసు**
1) **శ్రీమతి డా॥ కె. విజయలక్ష్మి శారద,** డాక్టర్, భర్త: బి. సుధాకర్ రాజు, శారద నర్సింగ్ హోమ్, ఆర్‌టిసి బస్టాండ్ ప్రక్కన, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా. ... **సర్టిఫికెట్ డెటార్ నెం.1**
2) **శ్రీ బి. సుధాకర్ రాజు,** తండ్రి: కృష్ణం రాజు, ఎ-బ్లాక్, 104, శాంత అపార్ట్‌మెంట్, కోంపల్లి, రంగారెడ్డి జిల్లా. ... **సర్టిఫికెట్ డెటార్ నెం.2**
3) **బొర్రా మౌనిక రెడ్డి,** తండ్రి: శ్రీ బి. లింగా రెడ్డి, ఎఫ్ -203, 2వ అంతస్తు, షంగ్రిల్లా అపార్ట్‌మెంట్స్, రోడ్డు నెం. 8, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్-3, మైనర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గార్డియన్ తల్లి శ్రీమతి బి.ఎల్. మంజులా రెడ్డి (ప్రొఫార్మ పార్టీ). ... **సర్టిఫికెట్ డెటార్ నెం.3**

గౌరవనీయులైన ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్ చే ఆమోదించబడిన ఓ.ఎ. నెం.558/2011లో ఆర్.పి. నెం.910/2017(పాత ఆర్.పి. నెం. 263/2013) ప్రకారం మీ నుండి బకాయిను **రూ.19,26,383/-** (పందొమ్మిది లక్షల ఇరవై ఆరు వేల మూడు వందల ఎనభై మూడు రూపాయిలు) + వడ్డీ మరియు ఖర్చులు కలిపి వసూలు చేయుటకు నోటీసు జారీ చేయడమైనది. ప్రతివాదులయిన మీరు, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోగా **"డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్"** పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా సదరు మొత్తం చెల్లించవలసిందిగా తెలియజేయడమైనది. లేనియెడల, ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూలు నందలి రూల్ 4,5 మరియు బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థల ఋణబకాయిల వసూలు చట్టం, 1993 యొక్క సెక్షన్ 25 నుండి 29 ప్రకారం తదుపరి చర్యలు తీసుకొనబడును.

**తేది: 15-05-2019** (కె. శ్రీనివాసరావు) రికవరీ ఆఫీసర్-2,
ప్రదేశం: హైదరాబాద్ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్.



ఆదివారం బాసర వద్ద జలకళ సంతరించుకున్న గోదావరి

## గోదావరికి చేరుతున్న వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి వరద వచ్చిచేరుతున్నది. దీంతో గోదావరి ప్రవాహం స్వల్పంగా పెరుగుతున్నది. నిర్మల్ జిల్లాలోని బాసర గోదావరి నదికి క్రమంగా వరద వచ్చి చేరుతున్నది. ఆదివారం జలకళ సంతరించుకున్నది. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి సమీపంలో గోదావరి, హరిద్ర, మంజీరా నదుల సంగమక్షేత్రంలో వరద ప్రవాహం పెరిగింది. కందకుర్తి వంతెన వద్ద గోదావరి నిండుగా పారుతున్నది. నదిలో గల పురాతన శివాలయాన్ని వరద ముంచెత్తింది. దిగువన కడెం జలాశయంలోకి స్వల్పంగా నీరుచేరుతున్నది. రెండ్రోజులుగా కురిసిన వర్షానికి దుబ్బవాగు, గండివాగు పొంగిపొర్లడంతో సింగూరు జలాశయానికి 1,067 క్యూసెక్కుల నీరు వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరిలో ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఆదివారం ఉదయం 6 గంటలకు 8.6 అడుగుల ప్రవాహం ఉండగా, సాయంత్రం 6 గంటలకు 9 అడుగులకు చేరుకున్నది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని భద్రాచలం సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం 71.70 మీటర్లుగా ప్రవహిస్తున్నది. మేడిగడ్డ వద్ద గేట్లు ఎత్తడంతో కిందివైపున గోదావరి ప్రవాహం నెమ్మదిగా పెరుగుతున్నది.



నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద గోదావరిలో వంతెనను ఆనుకొని ప్రవహిస్తున్న వరద



నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



# అసైన్డ్‌భూముల్లో చిచ్చు!

అక్రమార్కుల చెరలో వందల ఎకరాలు • దళితుల పట్టాభూములూ దర్జాగా కబ్జా

రెవెన్యూచట్టాలకు అధికారుల తూట్లు • అసైన్డ్‌భూములకూ యథేచ్ఛగా థర్డ్‌పార్టీ రిజిస్ట్రేషన్లు

బై నంబర్లు వేసి స్థానికేతరులకు కొత్త పాస్‌పుస్తకాలు జారీ

జేసీ ఆదేశాలనూ ఖాతరుచేయని తాసిల్దార్ • ఆందోళనలో మెదక్ జిల్లా పొడ్చన్‌పల్లి దళితులు

**మెదక్ మున్సిపాలిటీ:** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 1168/29లో 492 ఎకరాల 28 గుంటల అసైన్డ్ భూమి ఉన్నది. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ భూమిని గ్రామానికే చెందిన దళితులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చదునుచేసి.. 1958 నుంచి సాగు చేసుకొంటున్నారు. వారిలో అర్హులైన నిరుపేద దళితులకు 1970, 1984, 2003, 2009 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వాలు విడుతలవారీగా పట్టాలు పంపిణీ చేశాయి. అయితే, కాలం కలిసిరాక పట్నంబాట పట్టిన వారి భూములపై అక్రమార్కుల కన్నుపడింది. ఖాళీగా ఉన్న అసైన్డ్ భూముల నుంచి మొదలైన వీరి ఆక్రమణల పర్వం.. 2003, 2004 నాటికి దళితులకు పంపిణీచేసిన భూములను చెరపట్టడం వరకు చేరింది. రెవెన్యూ అధికారుల అండతో పట్టాలు పొందడమూ మొదలయింది.

**2003-04 నుంచి పట్టాలు మార్పిడి**

పొడ్చన్‌పల్లి గ్రామ దళితులకు 1970లో పట్టాలు మంజూరైనప్పటి నుంచి ఆ భూములను వారే సాగుచేసుకొంటున్నారు. 1989-90 ఆర్వోఆర్‌లోనూ, 2000-2001 వరకు పహాణీలో వారిపేర్ల మీదనే భూములు ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. అయితే, 2003-2004 నుంచి వీఆర్వోలు దళితుల పేర్లను క్రమంగా తొలగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పహాణీల్లో ఉన్న కొద్దిమంది దళితుల భూములనూ వివాదాల్లో ఉన్నవిగా పరిగణిస్తూ వాటిని పక్కనపెట్టారు. కానీ అక్రమార్కుల చెరలో ఉన్న భూములకు మాత్రం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండానే.. పాస్‌పుస్తకాలు సైతం జారీచేశారు. ఇక్కడే రెవెన్యూ అధికారులు మరో చిచ్చు రాజేశారు. 1168/29లో కొందరు దళితులకు కొత్త పాస్‌పుస్తకాలు ఇస్తూనే.. బై నంబర్లు చేర్చి ఆక్రమణదారులకు కూడా పాస్‌పుస్తకాలు జారీచేశారు. దీంతో ఈ భూమి నాదంటే నాదంటూ అటు ఆక్రమణదారులు, ఇటు దళితులు పంచాయితీ పెట్టుకొంటున్నారు. 1186/29 సర్వే నంబర్‌లో 492 ఎకరాలు ఉంటే రెవెన్యూ అధికారులు సుమారు 600 ఎకరాల భూములకు పాస్‌పుస్తకాలు జారీచేసినట్టు సమాచారం. అదీగాక కొందరికి నకిలీ పట్టా సర్టిఫికెట్లు సైతం జారీచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అసైన్డ్ భూములను స్థానికేతరులకు కేటాయించకూడదనే నిబంధనలను కూడా పూర్తిగా ఉల్లంఘించినట్టు తెలుస్తున్నది. అలాగే అసైన్డ్ భూములకు పట్టాలు పొందినవారు అమ్మకాలు సాగించడానికి వీలులేదనే నిబంధనను కూడా విస్మరించారు. థర్డ్‌పార్టీ పట్టాలు చెల్లవని తెలిసినా వారిని కొనసాగిస్తూ వస్తున్నారు.

**అప్పనంగా బొక్కేశారు..**

ఒకప్పుడు సాధారణంగా ఉన్న వ్యక్తి అసైన్డ్ భూముల్లో పాగావేసి.. అందులోనే ఇల్లీగల్ దందాలు చేస్తూ నేడు అందనంత ఎత్తుకు ఎదిగినట్టు తెలుస్తున్నది. బడా రాజకీయ నాయకులనే శాసించే స్థాయికి చేరుకొన్నాడు. అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో అతని ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముందుగా మైనార్టీ వ్యక్తివద్ద తన భార్య పేరిట 1.18 ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి ఈ భూముల్లో ఆధిపత్యం చెలాయిస్తూ వస్తున్నాడని చెప్తున్నారు. పక్క గ్రామానికి చెందిన మరొకరు దాదాపు 13 ఎకరాల అసైన్డ్ భూమిని గుప్పిట్లో పెట్టుకొన్నట్టు తెలుస్తున్నది. ఆక్రమించిన భూములకు కబ్జాదారుడి కూతురు, అల్లుడు, మరో ఇద్దరి పేరిట ఇటీవల రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకాలను మంజూరుచేశారు. ఈ భూములన్నీ మెదక్-బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారికి పక్కనే ఉండటం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలకు అతి సమీపంలో ఉండటంతో వీటి విలువ కోట్ల రూపాయలకు చేరింది. ప్రభుత్వ భూముల్లో అక్రమ కార్యకలాపాలు చేపట్టొద్దు. కానీ ఈ భూముల్లోనే సదరు నేత నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. వందల ట్రాక్టర్ల మట్టిని తరలించి అసైన్డ్ భూమిలో ఇటుక బట్టీలు చేపడుతూ సొమ్ము చేసుకొంటున్నాడు. స్థానికేతరుల వద్ద ఉన్న భూములను బడాబాబుల వద్ద పట్టాలకు మించి ఉన్న స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామంలోని అర్హులైన దళితులకు కేటాయించాలని వారు పోరాడుతున్నారు.



మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలోని అసైన్డ్ భూముల్లో ఈ నెల 18న ధర్నా సందర్భంగా భోజనాలు చేస్తున్న దళితులు

**పత్తాలేని సర్వే రిపోర్టు?**

అన్యాక్రాంతమైన తమ భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ దళితులు ఈ ఏడాది మార్చి 29న పాపన్నపేట తాసిల్దార్, జిల్లా జాయింట్ కలెక్టర్ నగేశ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. స్పందించిన జేసీ వెంటనే సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. కానీ తాసిల్దార్ మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు ఈ నెల 18న ఆ భూముల్లో ధర్నా కూడాచేశారు. అయితే కబ్జాదారులు, స్థానికేతరుల వద్ద ఉన్న పట్టాలు, వారికి ఎలా వచ్చాయి అన్న విషయాన్ని తెలుసుకోకుండా.. 'మీవే భూములు అనడానికి ఆధారాలు చూపించండి' అని దళితులనే తాసిల్దార్ ప్రశ్నించడం గమనార్హం. 1964 నుంచి తమవద్ద ఉన్న ఫైనల్ పట్టా సర్టిఫికెట్లను, ఆధారాలను, ఆర్వోఆర్, పహాణీల నకళ్లను దళితులు సమర్పించారు. అయినప్పటికీ తాసిల్దార్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టంచేస్తున్నారు.

### ఆక్రమించిన వారిని ఉపేక్షించం



పొడ్చన్‌పల్లి గ్రామంలో అసైన్డ్ భూములను ఆక్రమించిన ఎవరినీ ఉపేక్షించం. రికార్డుల ప్రకారం ఎవరికి భూములు ఉన్నాయో వారికే కేటాయిస్తాం. ప్రభుత్వం ఒకవేళ ఆ భూములకు సంబంధించి దళితులకు పట్టాలు ఇస్తే వారికే దక్కేలా చర్యలు తీసుకుంటాం. ఒక కుటుంబానికి అసైన్డ్ భూములు కలుపుకొని 5 ఎకరాలకు మించి ఉంటే వారినుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఇప్పటికే పొడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన అసైన్డ్ భూముల వ్యవహారంపై చర్యలు ప్రారంభించాం. అసైన్డ్‌భూములను కొన్నా, అమ్మినా నేరంగానే పరిగణింపబడుతుంది. ఆ భూముల్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఇటుక బట్టీలు నిర్వహించడం, ఇతర కార్యకలాపాలు నిర్వహించడం మా దృష్టికి వచ్చింది. వారిపై కఠినచర్యలు తీసుకుంటాం.

**- నగేశ్, జిల్లా జాయింట్ కలెక్టర్**

### ఈ భూములను మేమే సాగుచేసుకున్నాం



రాళ్లు, ముళ్లపొదలతో ఉన్న ఈ భూములను 1968లో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చదునుచేసి సాగు చేసుకున్నాం. 1970లో అందోల్ తాలూకా కార్యాలయంలో మాకు పట్టాలు జారీచేశారు. ఈ భూముల్లో పంటలు పండించుకుంటూ పిల్లలను సాదుకున్నం. తీవ్ర కరువు ఏర్పడటంతో జీవనోపాధి కోసం కొన్నేండ్లు పట్నం వెళ్లివచ్చేటప్పటికి భూములను పొరుగూరోళ్లు ఆక్రమించారు. అప్పటి నుంచి మా భూములు మాక్కావాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నం. **- తుడుం సంజీవు**

### సర్కారోళ్లే మాకు న్యాయం జేయాలే



అడివిలెక్క ఉన్న ఈ భూములను పిల్లజల్లా కలిసి మంచిగ జేసుకున్నం. జిట్టపులులు తిరుగంగా పానాలు చేతపట్టుకొని ఎవుసం జేసినం. మాకు చాతగాక ఇడుస వెట్టినం. మా పిల్లలేమో గింతదూరం అప్పుడప్పుడు అచ్చిపోయేటోళ్లు. కానీ ఇప్పుడు మా పొలాలను ఓలో కబ్జా జేసి ఇప్పుడు ఆగమాగం జేస్తుండ్రు. సర్కారోళ్లే మాకు న్యాయం జేయాలే. **- రెగోటి పద్మారావు**

### అక్రమాలకు రెవెన్యూ అధికారుల వత్తాసు



మా తాతలు, తండ్రులు ఈ భూములను సాగు చేశారు. మాకు బుద్ధితెలిసాక కూడా పంటలు పండించారు. కానీ ఇప్పుడు వీటిలో స్థానికేతరులు తిష్టవేశారు. స్థానికేతరులకు అధికారులు పాస్‌పుస్తకాలు ఇచ్చారు. ఫైనల్ పట్టా సర్టిఫికెట్లు లేకుండా కేవలం కాస్తులో ఉన్నారన్న కారణం చూపిస్తూ స్థానికేతరులను ప్రోత్సహిస్తున్నారు. ఓ పక్క ప్రభుత్వం రెవెన్యూ ప్రక్షాళనకు శ్రీకారం చుడితే అధికారులు ఇష్టారీతిగా వ్యవహరించడం దారుణం. **- తుడుం భూమన్న**

## కొత్త పాస్‌బుక్ ఇప్పించండి

భూమి ఉన్నా అందని రైతుబంధు సాయం ▪ ఖమ్మం జిల్లా వల్లభివాసి పూర్ణచంద్రరావు ఆవేదన



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామంలోని సర్వే నంబర్ 57/3 యూలో రైతు బిచ్చాల పూర్ణచంద్రరావుకు 1.16 ఎకరాల భూమి ఉన్నది. దీనికి పూర్ణచంద్రరావు పట్టాదారుగా, అనుభవదారుగా ఉన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో పూర్ణచంద్రరావు.. తమ వద్ద ఉన్న పాత రికార్డులన్నీ రెవెన్యూ అధికారులకు చూపించి, కొత్త పాస్‌బుక్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకొన్నారు. కానీ, అధికారులు కొత్త పాస్‌బుక్ ఇవ్వలేదు. 2018 మేలో రైతుబంధు కింద చెక్కును మాత్రమే రైతు చేతిలో పెట్టారు. అక్టోబర్ 2018లో రెండోవిడుతలో రైతుబంధు సాయం కూడా పంపిణీ చేయలేదు. కొత్త పాస్‌బుక్ ఇవ్వకపోవడం, రైతుబంధు సాయం అందకపోవడంతో పూర్ణచంద్రరావు.. పాత పాస్‌బుక్, 13(బీ), ఈ- పహాణీ ప్రతులను పట్టుకొని రెవెన్యూ అధికారులను కలిసి సమస్యను వివరించారు. న్యాయం చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు. రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా రైతుబంధు సాయాన్ని నష్టపోయానని బాధితుడు చెప్తున్నారు. ఇక అదే సర్వే నంబర్ 57/3లో ఏసు రామదాసు నుంచి 14 గుంటల భూమిని 2009లో కొన్నానని, సాదాబైనామా కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, దానిని సైతం ఇంతవరకు పాస్‌బుక్‌లో నమోదుచేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 మేలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుచేసినా అధికారులు స్పందించలేదని, ఖమ్మం ఆర్డీవోకు అప్పీలు చేసుకోగా ఇప్పటివరకు న్యాయం చేయలేదని తెలిపారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసినా స్పందన కరువైందని చెప్పారు. దీనిపై స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మిని వివరణ కోరగా.. డిజిటల్ ప్రక్రియంతా పూర్తయిందని, పాస్‌పుస్తకాలు చెన్నైలో ముద్రణ అవుతున్నాయని తెలిపారు. పాస్‌పుస్తకాలు రాగానే రైతుకు అందజేస్తామని, పెండింగ్‌లో పెట్టడంలేదని వివరించారు.

## పట్టా మార్పిడిలో జాప్యం

**చందంపేట:** నా పేరు నలావత్ జింత, మాది నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్‌దేవర్‌పల్లి గ్రామం. నా భర్త నలావత్ తావుర్య పేరు మీద 886 ఖాతా నంబర్.. సర్వే నంబర్ 129/1/1లో 3.32 ఎకరాల భూమి ఉన్నది. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో దరఖాస్తు చేసుకున్నా మాకు కొత్త పాస్‌పుస్తకం రాలేదు. కొత్త పాస్‌పుస్తకం కోసం నా భర్త అనేకసార్లు తాసిల్ కార్యాలయం చుట్టూ ఎన్నోసార్లు తిరిగారు. అయినా పని కాలేదు. నా భర్త 8 నెలల కింద మృతి చెందారు. దీంతో నా భర్త పేరు మీద ఉన్న భూమిని నా పేరిట ఫౌతీ చేయాలని అధికారులను కోరాను. వీఆర్వో, తాసిల్ చుట్టూ తిరిగినా కనికరించడం లేదు. సారూ నా భర్త చనిపోయాడు. భూమిని నా పేరిట మార్చండని వీఆర్వోను అనేకసార్లు వేడుకొన్నా పట్టించుకోవట్లేదు. గ్రామంలో చాలామంది రైతులు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు సాయం మూడుసార్లు తీసుకొన్నారు. కానీ నాకు ఒక్కసారి కూడా రాలేదు. మాది పేద కుటుంబం. నా బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక 'ధర్మగంట'ను ఆశ్రయించాను. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కనికరించి నాకు న్యాయం చేయాలని చేతులెత్తి మొక్కుతున్నాను.



### సమస్యను పరిష్కరిస్తాం

నలావత్ జింత భర్త తావుర్య మృతిచెందిన విషయం నా దృష్టికి రాలేదు. వీఆర్వో దృష్టికి వచ్చినప్పటికి నాకు చెప్పలేదు. తావుర్య పేరు మీద ఉన్న భూమిని ఫౌతీ ఆధారంగా జింత పేరు మీద మార్చే విధంగా వీఆర్వోతో ఫారం-6 ద్వారా ప్రొసీడింగ్ తయారు చేయించి త్వరలో మార్చేవిధంగా చర్యలు తీసుకుంటా.

**- రవీంద్రరాజు, తాసిల్దార్, చందంపేట**

## ఆ రెండెకరాలు ఎక్కడ?

- ఎస్సీ కార్పొరేషన్‌కు 12 ఎకరాలు ఇచ్చిన రైతులు
- పదెకరాలకే డబ్బులు ముట్టజెప్పిన అధికారులు

**రాజోళి:** రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వ పథకాల అమలుకోసం ఎస్సీ కార్పొరేషన్‌కు భూమిని ఇచ్చిన రైతులు అవస్థపడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం నౌరోజీ క్యాంపునకు చెందిన నల్లాని వెంకటేశ్వర్లు, నల్లాని హనుమంతరావు, బొబ్బా రామ్మోహన్‌రావుకు రాజోళి మండలం పెద్ద దన్వాడ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 148, 149, 160లలో 12 ఎకరాల భూమి ఉండేది. వారు ఈ భూమిని 2018 జనవరి 25న అప్పటి తాసిల్దార్ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్‌కు అప్పగించారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ పథకం కోసం దీనిని సేకరించిన అధికారులు.. అందులో పదెకరాలకు మాత్రమే భూ యజమానులకు డబ్బులిచ్చారు. మిగతా రెండెకరాలకు డబ్బు ఇవ్వలేదు. ఎస్సీ కార్పొరేషన్‌కు తాము ఇచ్చిన భూమిని సర్వే చేసేటప్పుడు కూడా తమకు సమాచారం ఇవ్వకుండానే కొలతలు వేసుకొని.. రిజిస్ట్రేషన్ చేశారని, మిగిలిన రెండెకరాలు ఎక్కడ ఉన్నదో తమకు చూపించలేదని రైతులు వాపోతున్నారు. కాగా, ఎస్సీ కార్పొరేషన్‌కు భూమిని ఇచ్చిన ముగ్గురు రైతుల్లో బొబ్బా రామ్మోహన్‌రావు మరణించారు. ఆయన పేరుతో భూమి లేకపోవడంతో.. ఆయన కుటుంబానికి రైతు బీమా పథకం వర్తించలేదు. అధికారులు మిగిలిన రెండెకరాల్లో తమ వాటా తమకు అప్పగించి ఉంటే.. రామ్మోహన్‌రావు కుటుంబానికి రైతుబీమా సొమ్ము అందేదని తోటి రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు మిగిలిన భూమిని చూపించి అప్పగించాలని, లేదంటే ఆ భూమిని ఎస్సీ కార్పొరేషన్‌కైనా చెందేలా చేయాలని కోరుతున్నారు.



### ఇబ్బందులు పెడుతున్నారు

మేము ఇచ్చిన 12 ఎకరాల్లో పదెకరాలకు మాత్రమే ఎస్సీ కార్పొరేషన్ నుంచి డబ్బు అందింది. మిగిలిన రెండెకరాలకు రాలేదు. ఆ రెండెకరాలను కూడా ఎస్సీ కార్పొరేషన్‌కు ఇస్తామన్నా తీసుకోవడంలేదు. మాకు భూమిని చూపించడంలేదు. దీంతో మేము నష్టపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయంచేయాలి.

**- నల్లాని వెంకటేశ్వర్‌రావు, బాధిత రైతు**

## విరాసత్ చెయ్యండి సారూ..



**పరిగి రూరల్:** నా పేరు నేనావత్ ధన్‌సింగ్. మాది వికారాబాద్ జిల్లా పరిగి మండలం గొవిందపూర్‌తండా. మా తల్లి నేనావత్ భద్రమ్మ పేరిట బాబాపూర్‌లోని సర్వే నంబర్లు 33/ఈలో 7 గుంటలు, 35/ఈలో 19 గుంటలు, 34/ఈలో 5 గుంటలు, గొవిందపూర్‌తండాలోని సర్వే నంబర్ 89లో 3.14 ఎకరాలు.. మొత్తం 4.10 ఎకరాల భూమి ఉన్నది. మా తల్లి రెండేండ్ల కింద మృతి చెందారు. మేము నలుగురం అన్నదమ్ములం. ఆమె పేరిట ఉన్న 4.10 ఎకరాలను నలుగురు కొడుకులమైన ధాన్‌సింగ్, నర్సిములు, మోహన్, రవి పేరిట విరాసత్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని గత ఏడాది దరఖాస్తు చేసుకొన్నాం. ఈ విషయంలో సంబంధిత వీఆర్వో, ఆర్ఐ పంచనామా చేసి రిపోర్టు రాశారు. ఏడాదిగా పరిగి తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేటికీ రెవెన్యూ అధికారులు విరాసత్ చేయలేదు. మా తల్లి పేరిట ఉన్న భూమిని నలుగురు అన్నదమ్ముల పేరిట మార్చాలని కోరుతున్నా.

### ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి



అవినీతిని రూపుమాపడానికి కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావాలనే సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొంటారు. ఆయన తీసుకొన్న నిర్ణయం సాహసోపేతమైనది. రెవెన్యూ వ్యవస్థలో అక్రమార్కులకు చరమగీతం పాడటానికే ఈ కొత్త చట్టం. తప్పనిసరిగా చట్టం రావాల్సిందే. లంచం ఇస్తే తప్ప పనిచేయని అధికారులు ఉన్నంత కాలం ప్రజలు ఇబ్బందులు పడుతారు. కొత్త చట్టంతో అధికారుల తీరులో మార్పు వస్తుందని ఆశిస్తున్నాం.

**- ముత్యాల మహిపాల్‌రెడ్డి దేశ్‌ముఖి, భూదాన్‌పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా**

## కాళ్లరిగేలా తిరిగినా పట్టదా!

పైసలిచ్చినవారికే పనులు చేస్తారా?

- పాస్‌పుస్తకాల జారీలో రెవెన్యూ ఇష్టారాజ్యం
- సామాన్యులను రేపుమాపంటూ తిప్పుకొంటున్నరు
- పేరు మార్పు కోసం వికారాబాద్ రైతుల తిప్పలు

**వికారాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం ఒకవైపు భూరికార్డుల ప్రక్షాళన చేపట్టి రైతుల ఇబ్బందులు తొలగించి పాస్‌పుస్తకాలు అందించాలని ఆదేశిస్తుంటే రెవెన్యూ అధికారులు అందుకు పూర్తి విరుద్ధంగా పనిచేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, తప్పుడు పనులతో రికార్డుల్లో పేరుమార్పు జరుగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ తాసిల్దార్ కార్యాలయం చుట్టూ నిత్యం వందలమంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. వికారాబాద్ మండలం సిద్ధులూరు, ధన్నారం, కొటాలగూడ, పీరంపల్లి, గొట్టిముక్కల, పీలారం, పులుమద్ది తదితర గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఉన్నాయి. పరిష్కారం కోసం వీరంతా గత ఏడాది కాలంగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు సమస్యలు పరిష్కరించడంలో ఏమాత్రం శ్రద్ధచూపడం లేదు. ఎందుకు చేయడం లేదని గట్టిగా ప్రశ్నిస్తే అప్పటికప్పుడు ఏవో కారణాలు చెప్పి తప్పించుకొంటున్నారు. రేపు మాపు అంటూ ఏండ్లకుఏండ్లు కాలయాపన చేస్తున్నారు. అన్ని పత్రాలు సరిగా ఉన్నా పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించి పాస్‌పుస్తకాలు జారీచేయడం లేదు. నిత్యం కలెక్టర్ సమావేశాలు ఏర్పాటుచేసి రైతుల సమస్యలను తీర్చాలని ఆదేశిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారని, అడిగినంత డబ్బు ముట్టజెప్పేవారికి మాత్రం గంటల వ్యవధిలోనే రికార్డుల్లో నమోదుచేసి, పాస్‌పుస్తకాలు చేతిలో పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

### తమ్ముడికి పాస్‌బుక్ ఇచ్చి.. నాకు ఇయ్యలేదు



వికారాబాద్ మండలం ధన్నారంలోని సర్వే నంబర్ 62లో మాకు 4 ఎకరాల పొలం ఉన్నది. ఇదే సర్వే నంబర్‌లో మా తమ్ముడికి పాస్‌బుక్ ఇచ్చారు. వివరాలు ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు వీఆర్వో సురేశ్ రూ. 500 కూడా తీసుకున్నా పనిచేయలేదు. డబ్బున్నవారికే ఇక్కడ పనులు చేస్తున్నారు. నిలదీస్తే పొలంపై కేసు ఉన్నదని బుకాయిస్తున్నారు. నా తమ్ముడి పొలంపై కూడా కేసు ఉంటే పాస్‌బుక్ ఎలా ఇచ్చారు? నాకు వెంటనే పాస్‌బుక్ ఇస్తే రైతుబంధు సహాయం అందుతుంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పొలాలు కొన్న వెంటనే ఆన్‌లైన్‌లో ఎక్కిస్తున్నారు. పైసలిస్తేనే అధికారులు పనులు చేస్తున్నారు.

**- మధుసూదన్‌రెడ్డి, ధన్నారం, వికారాబాద్**

### ఏడాదిగా తిరుగుతున్నా పనికాలేదు



మాది వికారాబాద్ మండలం ధన్నారం. మా నాన్న బీరయ్య పేరున 12 ఎకరాల పొలం ఉన్నది. మేము ఐదుగురు అన్నదమ్ములం. ఒక్కొక్కరికీ 2 ఎకరాల చొప్పున ఏడాది కిందట పంచుకొని రిజిస్ట్రేషన్ చేసుకొన్నాం. రికార్డుల్లో మా పేరుమీదికి మార్చేందుకు ఏడాదినుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పనిచేయడం లేదు. మాలాంటి నిరుపేద రైతులను నిత్యం కార్యాలయాల చుట్టూ తిప్పితే ఎలా బతుకాలి. అధికారులు వెంటనే స్పందించి న్యాయంచేయాలి.

**- కుర్వ కిష్టయ్య, ధన్నారం, వికారాబాద్**

### నెలాఖరులోగా సమస్యలు పరిష్కరిస్తాం



ఈ నెలాఖరులోగా భూసమస్యలను పరిష్కరించి, రైతులందరికీ పాస్‌పుస్తకాలు అందేలా చర్యలు తీసుకొంటున్నాం. వికారాబాద్ మండలంలో 16 వేల ఖాతాలు ఉండగా 14,506 ఖాతాలకు పాస్‌పుస్తకాలు అందించాం. మిగిలినవి కూడా త్వరలో సరిచేసి అందేలా చర్యలు తీసుకొంటాం. రైతులు సిబ్బందికి డబ్బులు ఇవ్వకూడదు. పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. 1,700 ఖాతాలు భూవివాదాల కారణంగా అపరిష్కృతంగా ఉన్నాయి. అందులో 800 ఖాతాలను ఇప్పటికే సరిచేశాం. మిగితా ఖాతాలను కూడా ఈ నెలఖరులోగా సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చి, డిజిటల్ సంతకాలు చేసి రైతులకు పాస్‌పుస్తకాలు అందజేస్తాం.

**- చిన్నప్పలనాయుడు, వికారాబాద్ తాసిల్దార్**

## ఒకరి భూమి మరొకరికి పట్టా!

రియల్టర్‌తో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు

ధర్మగంటను ఆశ్రయించిన జనగామ జిల్లా మాణిక్యాపురం బాధితులు

**జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం కళ్లెం రెవెన్యూ పరిధిలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన బడికె పుష్పమ్మకు సర్వే నంబర్ 89/ఏ/3లో 2.10 ఎకరాలు, 89/ఏ/2లో 1.02 ఎకరాల భూమి ఉన్నది. 35 ఏండ్ల కిందట భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారు పాస్‌పుస్తకాలు పొంది సాగు చేసుకొంటున్నారు. 2006లో పుష్పమ్మ మృతి చెందగా.. ఆమె భర్త సత్తయ్య అనారోగ్యంతో మంచం పట్టారు. దీంతో భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా తమ పేరిట పట్టా మార్పిడి చేయాలని కుమారులు బడికె శ్రీనివాస్, బడికె కరుణాకర్ తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకొన్నారు. వీఆర్వో సంపత్ స్థానిక రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఉపేందర్‌తో కుమ్మక్కై సర్వే నంబర్ 89/ఏ/3లో ఎకరం భూమి మాత్రమే శ్రీనివాస్, కరుణాకర్ పేరిట చేసి మిగిలిన 1.10 ఎకరాల భూమిని బడిగె బుచ్చి ఎల్లయ్య పేరిట పట్టా చేసినట్టు బాధితులు తెలిపారు. దీంతో గత ఏడాది ఏప్రిల్ 10న మార్పిడి ఎలా జరిగిందని సమాచార హక్కు చట్టం కింద కూడా దరఖాస్తు చేసుకొన్నట్టు పేర్కొన్నారు. ఈ భూమిపై కోర్టు ద్వారా ఇంజెంక్షన్ ఆర్డర్ కూడా పొందినట్టు చెప్పారు. భూమిని కబ్జా చేయాలనే దురుద్దేశ్యంతో బుచ్చి ఎల్లయ్య అతని అనుచరులు ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తుండగా అడ్డుకోబోయిన తమ తండ్రి సత్తయ్యపై దాడి చేసి గాయపరిచి మృతికి కారకులైనట్టు ఆరోపించారు. ఈ విషయంపై గ్రామంలో ఆందోళన చేయడంతో స్పందించిన తాసిల్దార్, వీఆర్వో రికార్డును యథావిధిగా సరిచేస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఏడాదిన్నరగా తాసిల్ చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని చెప్పారు. సీసీఎల్ నాంపల్లి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా రికార్డులు సరిచేయాలని కలెక్టర్, ఆర్డీవో, తాసిల్దార్‌కు నోటీసులు సైతం జారీ అయినట్టు తెలిపారు. ఇప్పటివరకు తమకు ఎలాంటి న్యాయం జరుగలేదని బాధితులు వాపోయారు.



బాధితులు బడికె శ్రీనివాస్, బడికె కరుణాకర్



ఆదివారం సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో చింతమడకలో పోలీస్ సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేస్తున్న సీపీ జోయల్ డెవిస్





ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు వీలుగా చింతమడకలో ఇంటింటికీ వెళ్లి ఐడీ కార్డులు అందజేస్తున్న అధికారులు



# సొంతూరుకు సీఎం

మొదటిపేజీ తరువాయి...

ఉదయం 10.30 గంటలకు చింతమడక గ్రామానికి చేరుకుంటారు. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేయడంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తారు. ఇది కేవలం సీఎం కేసీఆర్ సొంతూరు గ్రామస్థులతో మమేకమయ్యే పర్యటన అయినందున ఇతరులెవరినీ అనుమతించడం లేదు. ముఖ్యమంత్రి గ్రామంలో కలియదిరుగుతారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆత్మీయ సమావేశం, సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లుచేశారు. 3200 మంది గ్రామస్థులకు ప్రత్యేకంగా తయారుచేయించిన పింక్ కలర్ ఐడీ కార్డులను అందించారు. వీరంతా ఐడీ కార్డులతో సభాస్థలికి చేరుకుంటారు. ప్రతి 30 కుటుంబాలకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. 200 మంది అధికారులకు వైట్ గుర్తింపుకార్డులు, 200 మంది మీడియా ప్రతినిధులకు గ్రీన్ గుర్తింపుకార్డులను అందించారు. మొత్తంగా ఆరువేల మందికి భోజనాలను ఏర్పాటుచేస్తున్నారు. ఐకేపీ గోదాము వద్ద రెయిన్‌ప్రూఫ్ టెంట్‌ను నెలకొల్పారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటుచేశారు. అధికారులు, మీడియాకు ప్రత్యేకంగా గ్యాలరీ ఉంటుంది. 60 మంది కూర్చొనేలా వేదిక రూపొందించారు. వేదికకు కుడివైపున గ్రీన్ హౌస్‌ను ఏర్పాటుచేశారు. సమావేశం అనంతరం భోజనాలకోసం మహిళలకు, పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ ఆత్మీయులతో కలిసి భోజనం చేయడానికి పెద్దమ్మ గుడి పక్కనే రెయిన్‌ప్రూఫ్ టెంట్ వేశారు. పెద్దమ్మ గుడి ముందు చింతచెట్టు వద్ద గద్దెను కూడా నిర్మించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.




సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామంలో సిద్ధమవుతున్న సమావేశ వేదిక

### రైతుబిడ్డ కేసీఆర్

సీఎం కేసీఆర్ రైతుబిడ్డ. ఎంత ఎదిగినా వ్యవసాయాన్ని మాత్రం ఏనాడూ విడిచిపెట్టలేదు. ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు, కరువు మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు సైతం చింతమడకలోనే స్వయంగా వ్యవసాయం చేశారు. రోజులో నాలుగైదు గంటలపాటు ట్రాక్టర్‌తో స్వయంగా పొలం దున్నేవారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఇప్పటికీ చెప్తున్నారు. వ్యవసాయమంటే సీఎం కేసీఆర్‌కు ఎంతో మక్కువ. అందుకే ముఖ్యమంత్రి అయినప్పటికీ నేటికి కూడా వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలో ఇప్పటికీ పంటలను పర్యవేక్షిస్తుంటారు.



సీఎం కేసీఆర్ సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చింతమడకలోని ఆయన ఇంట్లో పనిచేసిన జిట్టని పోశవ్వతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి ఉన్నారు



### ఎంతో సంబురంగా ఉంది

సీఎం కేసీఆర్ చింతమడకకు రావడం ఎంతో సంబురంగా ఉంది. సీఎం సార్ వస్తున్న సంతోషంలో మా ఇండ్లను పచ్చని తోరణాలు, పూలతో అలంకరించినం. మా గ్రామ బిడ్డ నేడు రాష్ట్రాన్ని పాలిస్తుండటం సంతోషంగా ఉంది. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుంటం. గ్రామస్థులంతా సంతోషంగా ఉన్నారు.

**- మొత్కు యాదగిరి, సీఎం కేసీఆర్ దోస్త్**



### ఘనంగా స్వాగతం పలుకుతాం

కేసీఆర్ ముఖ్యమంత్రి పదవిలో ఉన్నా స్నేహితులందరితోనూ ఎంతో ఆత్మీయంగా ఉంటారు. ఆయన గ్రామానికి రావడం చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్.. నేను చిన్ననాటి నుంచి ఒకే దగ్గర ఉండి చదువుకున్నాం. గ్రామమంతా పండుగలా ఉంది. సీఎం కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నాం.

**- భైరి కిష్టారెడ్డి, సీఎం కేసీఆర్ క్లాస్‌మేట్**



సీఎం కేసీఆర్ ఆత్మీయులతో కలిసి భోజనం చేయడానికి ఏర్పాటుచేసిన రెయిన్‌ప్రూఫ్ టెంట్

### చరిత్రపుటల్లో చింతమడక

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలం చింతమడక. ఇక్కడ వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కేసీఆర్‌తో ఈ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. చరిత్ర పుటల్లో చోటుచేసుకుంది. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా పనిచేసిన నేత ఆయన. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్రాన్ని సాధించి తొలి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి ప్రశంసలందుకున్నారు. రెండోసారి కూడా ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి అన్ని వర్గాల ప్రజల గుండెల్లో నిలిచారు. చింతమడక బిడ్డ ఇవాళ ఉన్నత స్థానంలో ఉండటంతో పురిటిగడ్డ పులకరించిపోతున్నది. ఉన్నతస్థానంలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామస్థులతో ఆత్మీయత, అనుబంధాలు అలానే కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ గ్రామంలో ఉన్న స్నేహితులు, గ్రామపెద్దలతో ఆయన కలుపుగోలుగా ఉంటారు. గ్రామానికి వచ్చారంటే ప్రతివారిని పేరుపెట్టి పిలుస్తుంటారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి సీఎం కేసీఆర్ దంపతులు వచ్చినప్పుడు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ తన చిన్ననాటి మిత్రులను పేరుపెట్టి పిలిచి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఆయన.. నేను మళ్లీ వస్తా.. మీతో రోజంతా గడుపుతా అని మాటిచ్చారు. ఆ మాట ప్రకారం సోమవారం చింతమడకకు రానుండటంతో గ్రామస్థులు సంబురపడిపోతున్నారు. సీఎం కేసీఆర్‌కు చిన్నతనం నుంచే ఎంతో మేధాశక్తి ఉండేది. పాఠశాల స్థాయిలో చిలిపి పనులు చేసిన అతడిలో చురుకుదనం కనిపించేదని కేసీఆర్ గురువు మృత్యుంజయశర్మ చెప్తుంటారు. తెలుగు వ్యాకరణం, భాషపై పట్టుసాధించేలా కృషిచేశారని అంటారు. కేసీఆర్ ఒకటో తరగతి నుంచి రెండో తరగతి వరకు అంకంపేట, మూడో తరగతి చింతమడకలో, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు దుబ్బాకలో చదువుకున్నారు. అనంతరం ఉన్నత చదువులు సిద్దిపేటలో చదువుకున్నారు. పాఠశాల స్థాయిలో కేసీఆర్ ప్రతిరోజూ చింతమడక నుంచి దుబ్బాక వరకు కాలినడకనే వెళ్ళివచ్చేవారు. చింతమడక గ్రామానికి చెందిన రాఘవరెడ్డి అనే హిందీ పండితుడు కొంతకాలానికి దుబ్బాక పాఠశాలకు వచ్చారు. అప్పుడు ఆయన దుబ్బాకలోనే నివాసం ఉండటంతో కేసీఆర్, ఆయన సోదరి సుమతి కూడా వారి ఇంట్లోనే ఉండేవారు. కేసీఆర్ మిత్రుల మాటల ప్రకారం.. పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా పౌరాణిక నాటకాల్లో కూడా ఆయన పాత్రలు వేసేవారు. శ్రీకృష్ణ పాండవీయం నాటకంలో పంచపాండవుల్లో చివరివాడైన సహదేవుని పాత్రను కేసీఆర్ పోషించారు. పాఠశాల విద్యార్థి సంఘ నాయకత్వానికి జరిగిన పోటీలో గెలిచి ఉపాధ్యక్షునిగా పనిచేశారు.

### చింతమడక సమగ్ర అభివృద్ధి

కేసీఆర్ స్వగ్రామం కావడంతో చింతమడకలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధతో ఈ గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తిచేయిస్తున్నారు. కేసీఆర్ సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తన సొంత భూమి 70 ఎకరాలను ఎస్సీ కార్పొరేషన్‌కు అందజేశారు. తన ఇంటిని పాఠశాలకు ఇవ్వడంతో కొన్నాళ్లపాటు పాఠశాల నడిపించారు. ప్రస్తుతం అక్కడ భారతీయ స్టేట్ బ్యాంకు కొనసాగుతున్నది. ఇంటి ఆవరణలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని నిర్మాణం చేయడంతో విద్యార్థులు ఆ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. పలు అభివృద్ధి పనులతో చింతమడకను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.45 లక్షలతో ఆర్‌అండ్‌బీ డ్రైనేజీ పనులు, 48 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తిచేశారు. మరో 24 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తికాగా లబ్ధిదారులతో సోమవారం సీఎం కేసీఆర్ గృహప్రవేశాలు చేయించనున్నారు. బీసీ గురుకుల పాఠశాలకు భూమిపూజ చేస్తారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఐకేపీ గోదాము, సీసీ ప్లాట్‌ఫాం, నూతన పంచాయతీ భవనంతో పాటు అన్ని కులాలకు కమ్యూనిటీ హాళ్లను నిర్మించారు. ప్రాథమిక పాఠశాలకు మోడల్ భవనాన్ని నిర్మించారు. పెద్దమ్మ దేవాలయం వద్ద ఫంక్షన్‌హాల్, మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లా కనెక్షన్, శ్మశానవాటిక, విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. వీటితోపాటు గ్రామం నలుదిక్కులా వివిధ గ్రామాలను కలుపుతూ తారురోడ్లను నిర్మించారు. హరితహారంలో భాగంగా ఎవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో లక్షా రెండువేల మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపట్టారు. చెరువులను అభివృద్ధిపర్చారు.

### ఇంటింటా తోరణాలు.. పూలదండలు



ఇంటింటా మామిడి తోరణాలు! బంతిపూల దండలు!! ఇండ్ల ముందు వెల్‌కమ్ టు సీఎం కేసీఆర్ అంటూ ముగ్గులు.. తమ ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఘనస్వాగతం పలుకడానికి సిద్ధమైన చింతమడక చిత్రమిది. దసరా, దీపావళి, ఉగాది తదితర పండుగలు జరుపుకొన్నప్పుడు ఎంత సంబురంగా ఉంటుందో ఇప్పుడు అంతకన్న ఎక్కువ సంబురంతో ఉన్నారు చింతమడక గ్రామస్థులు. సోమవారం రానున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కోసం సిద్ధమైన ఏర్పాట్లను చూసేందుకు ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ పీ వెంకట్రామ్‌రెడ్డి గ్రామంలో కలియతిరిగారు. ఇండ్ల ముందు గ్రామస్థులు చేసుకున్న అలంకరణలను పరిశీలించారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చింతమడకలోని వారి ఇంట్లో పనిచేసే జిట్టని పోశవ్వ ఇంటికి వెళ్లి మాట్లాడారు. మీ సార్ వస్తున్నారు పోశవ్వ.. రేపు మీటింగ్‌కు రావాలని ఆహ్వానించారు.

### పటిష్ఠ బందోబస్తు

సీఎం కేసీఆర్ సోమవారం చింతమడకలో పర్యటించనున్న నేపథ్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. బందోబస్తును 15 సెక్టార్లుగా విభజించారు. ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ముగ్గురు ఏసీపీలు, 8 మంది డీఎస్పీలు, 32 మంది సీఐలు, 74 మంది ఎస్‌ఐలు, 64 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 635 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు, 75 మంది మహిళా కానిస్టేబుళ్లు, మహిళా హోంగార్డులు, స్పెషల్ పార్టీ, రోప్ పార్టీస్ బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్స్, సెక్యూరిటీ వింగ్, మఫ్టీ పార్టీతో కలిపి మొత్తంగా 1050 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.



చింతమడక గ్రామంలో రహదారికి ఇరువైపులా బారికేడ్లు



చింతమడకలో సహపంక్తి భోజనాల కోసం ఏర్పాటుచేస్తున్న డైనింగ్ టేబుళ్లు

## ఇందూరు భక్తజనసంద్రం





నిజామాబాద్ నగరంలో ఆదివారం ఖిల్లా తేలు మైసమ్మ (శారదాంబ) గద్దె నుంచి గ్రామ దేవతల ఊరేగింపు ప్రారంభమైంది. ఊర పండుగ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదె ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వడ్లదాతి నుంచి ఉదయం 7.15 గంటలకు సార్గాలమ్మ, కొండల్‌రాయుడు, బోగంసాని దేవతామూర్తులను తెచ్చి సిర్నాపల్లి గడీ వద్ద ప్రతిష్ఠించి డప్పు చప్పుళ్లతో, బైండ్ల, పోతురాజుల నృత్యాలతో గద్దెకు చేర్చారు. గ్రామ దేవతల ఊరేగింపుతో ఇందూరు భక్తజన సంద్రమైంది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, ఎమ్మెల్సీ ఆకుల లలిత, 'నుడా' చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులు పూజలుచేశారు.

- ఖలీల్‌వాడి

## ఓఆర్‌ఆర్ లోపల సమృద్ధిగా తాగునీరు

**ఇప్పటికే తొలివిడుతలో 190 గ్రామాలకు శాశ్వత పరిష్కారం**

**రూ.586.86 కోట్లతో ఫేజ్-2 పథకం • 1,094 కిలోమీటర్ల మేర పైపులైన్లు**

**15 భారీ స్టోరేజీ రిజర్వాయర్లు • 1,300 కాలనీలకు ప్రయోజనం**

**ప్రభుత్వ పరిశీలనలో డీపీఆర్ • త్వరలో టెండర్లు పిలిచేందుకు కసరత్తు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) లోపలున్న గ్రామాల్లో తాగునీటి సమస్యలను పూర్తిగా తొలిగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. 'మిషన్ భగీరథ'లో భాగంగా ఇప్పటికే 190 గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటుచేసిన ప్రభుత్వం.. 164 రిజర్వాయర్లలో 139 రిజర్వాయర్ల నిర్మాణాన్ని పూర్తిచేసింది. 1,400 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణ పనులను పూర్తిచేసి నల్లాద్వారా ఇంటింటికీ సమృద్ధిగా నీరందిస్తున్నది. మిగిలిన 25 రిజర్వాయర్ల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరునాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. ఓఆర్‌ఆర్ ఫేజ్-1 పథకం ద్వారా 1,300 కాలనీలు, బస్తీల్లో దాదాపు 20 లక్షల మందికి దాహార్తి తీరుతుంది. ప్రతి వ్యక్తికి నిత్యం 135 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టారు. శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు భారీగా వెలిశాయి. దీంతో ఆ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎస్‌సీసీ సంస్థ రూ.586. 86కోట్ల అంచనా వ్యయంతో ఓఆర్‌ఆర్ ఫేజ్-2 పథకానికి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను రూపొందించి జలమండలికి సమర్పించింది. ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన ఈ ప్రతిపాదన ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్ద ఉన్నది. నిధులపై స్పష్టత వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి ప్రాజెక్టును మొదలుపెట్టేందుకు జలమండలి సిద్ధంగా ఉన్నది. ఓఆర్‌ఆర్ ఫేజ్-2లో భాగంగా హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, సరూర్‌నగర్, శామీర్‌పేట, కీసర, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఘట్‌కేసర్, శంషాబాద్, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మండలాల పరిధిలో సుమారు 1,094 కిలోమీటర్ల మేర పైపులైన్లను వేసి 1,300 కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు 90 మిలియన్ లీటర్ల నిల్వ సామర్థ్యమున్న 15 భారీ స్టోరేజి రిజర్వాయర్లను నిర్మించనున్నారు.



### మండలాలవారీగా కేటాయించే నిధులు

| మండలం | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|
| హయత్‌నగర్ | 86 |
| ఇబ్రహీంపట్నం | 7.90 |
| మహేశ్వరం | 15 |
| సరూర్‌నగర్ | 100 |
| శామీర్‌పేట | 12.25 |
| కీసర | 15.50 |
| కుత్బుల్లాపూర్ | 50.94 |
| మేడ్చల్ | 15.97 |
| ఘట్‌కేసర్ | 65.30 |
| శంషాబాద్ | 24 |
| రాజేంద్రనగర్ | 96 |
| రామచంద్రాపురం, పటాన్‌చెరు | 98 |
| మొత్తం | 586. 86 |

## పోలీసు వ్యవస్థను ఆధునీకరిస్తాం

• కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ఖైరతాబాద్:** రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను అధునీకరిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బోనాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఖైరతాబాద్‌లోని శ్రీరాజరాజేశ్వర నల్లపోచమ్మ దేవాలయంలో జరిగిన కల్యాణోత్సవాల్లో పాల్గొన్న మంత్రి, స్థానిక బీజేపీ నేత నగేశ్ ఇంట్లో పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. తెలంగాణలోని షీటీమ్స్‌కు, బంజారాహిల్స్‌లో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ ఫ్యూజన్ టవర్స్‌కు కేంద్ర ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. జీహెచ్‌ఎంసీలో సీనియర్ అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతానని చెప్పారు.

## ఎస్సీ స్టడీసర్కిల్ ఫౌండేషన్ కోర్సు ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎస్సీ స్టడీసర్కిల్ నిర్వహిస్తున్న ఫౌండేషన్ కోర్సు ఎంపిక పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన 23 నుంచి జరుపనున్నారు. గ్రూప్ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాలు పొందేందుకు ఈ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్టు స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు.

# చెలిమె

## శిలాక్షరాన్నై...

ఏళ్ళ నిశ్శబ్దాన్ని కరిగించే
వాక్యమొక్కటి రాసి తీరాలి
వేల గుండెల్లో మార్మోగే
పద సమూహం పట్టి తేవాలి!

వెతల బ్రతుకును నిదురపుచ్చే
జోలపాటొకటి పాడి మురియాలి
శ్రమ జీవన సౌరభాల్ని వెదజల్లే
జానపదమై జాలువారాలి!

కదనరంగం వైపు నడిపే
కవనమొక్కటి కూర్చి పాడాలి
వైరాగ్య రాగం తిరగరాసే
వైవిధ్య గానం ఆలపించాలి!

శిశిరాలు కావలించుకున్న కోనల్లో
వసంత గీతికై పల్లవించాలి!
శిథిలాల క్రింద నలిగే సాహితిని
శిఖరాల అంచున నిలబెట్టాలి!

**– సాంబమూర్తి లండ**
**9642732008**

## ఆసరా

నా తడారిన గొంతులోని
పొడి పొడైన దాహం
ఆకాశానికి తెలిసినట్టుంది

ఎక్కడెక్కి నుంచో మేఘాల్ని లాక్కొచ్చి
నాలుగు చినుకుల్ని రాల్చింది

నేల తల్లేమో ఒళ్లు విరుచుకొని
మట్టి వాసనై నన్ను చుట్టేసింది

విచ్చుకుంటున్న మొగ్గేమో సిగ్గిలి
ముసిముసి నవ్వుల్ని చిలికింది

చెట్టేమో కొమ్మల్ని పైకెత్తి
మబ్బుకు దండం పెట్టింది

తడి తడైన గాలేమో/ గిరగిరా తిరిగి నాట్యం చేసింది
అవును మరి, చిగురించడానికీ
ఊపిరిపొయ్యడానికీ, ఆసరా/ చినుకే కదా

మదిలో తళుక్కున మెరిసే భావన
నాలుగు అక్షరాల్ని తోడు తెచ్చుకొని
కాగితం మీద కుదురుకోవడానికీ
ఆసరా లేనిదో బయటిదో
చినుకో చినుకులాంటి/ ఆర్తో కదా

**– వారాల ఆనంద్, 94405 01281**

మంచి మనిషి, సాహితీవేత్త, గ్రంథాలయోద్యమకారుడు విఠలాచార్యకు సముచిత గౌరవం దక్కింది. మధురకవి విఠలాచార్య గారిని దాశరథి గౌరవ పురస్కారం వరించింది. తన అరువై ఏండ్ల సాహితీ, సాంస్కృతిక ప్రస్థానంలో ఏనాడూ అవార్డులు, రివార్డులను ఆశించని ఆయనను తెలంగాణ సముచిత రీతిన గుండెకు హత్తుకున్నది. మరో మాటలో చెప్పాలంటే.. విఠలాచార్య గారికి దాశరథి పురస్కారం అందించి తెలంగాణ సమాజం తననుతాను గౌరవించుకున్నది.

# పల్లె పరిమళానికి పట్టాభిషేకం

**నడకనేర్చిన** ప్రతివారూ నగరాల వైపు నడుస్తున్న నేటి సమాజంలో పల్లె ఒడిని వీడకుండా, పల్లెనే ప్రాణపదంగా చేసుకొని తనదైన కార్యక్షేత్రంలో నిత్యం ప్రజా చైతన్యం కోసం పరితపిస్తూ.., ప్రజా సంక్షేమంలో మునిగిపోయే అరుదైన మానవీయ మహామనీషి విఠలాచార్య.

విఠలాచార్య జీవితం, వ్యక్తిత్వం విశిష్టమైనది. ఆయన త్యాగమయ జీవనయానం అందరికీ సాధ్యం కానిది. చిన్నతనంలోనే తండ్రి ప్రేమకు దూరమైన ఆయన, తాను పెరిగి పెద్దగయ్యే క్రమంలో నిలువెల్లా ప్రేమను నింపుకొని ఎదిగారు. కుటుంబపరంగా చదివించే స్థోమత లేకున్నా 'వారాల' బ్బాయిగా పూటకో ఇంట్లో పెట్టింది తింటూ చదువులు సాగించారు. పేదరికంలో కుచేల స్నానం చేసిన ఆయన, మనుషులను ముఖ్యంగా పేదలను ప్రేమించటం మాత్రమే నేర్చుకున్నారు. అతి నిరాడంబర సాధారణ జీవితాన్ని అనుసరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తారు. వారసత్వ ఆస్తిగా వచ్చిన భూమిని ధనవంతులు తమ లాభాపేక్ష కోసం కొం టామని వచ్చినా ఇవ్వకుండా, పేదల గృహావసరాల కోసం వెచ్చించిన దాతృత్వం ఆయనది. తాను నివాసం ఉండే ఇంటిని గ్రంథాలయంగా మార్చి, 70 వేల పైచిలుకు పుస్తకాలతో విజ్ఞానఖనిని ఏర్పరిచి దాన్ని ప్రజలందరి ఉమ్మడి ఆస్తిగా తీర్చిదిద్దిన త్యాగనిరతి ఆతనిది. నిస్వార్థతకూ, త్యాగనిరతికీ మారుపేరుగా నిలిచిన ఆయన వ్యక్తిత్వం ఏ కొద్దిమందికి మాత్రమే సాధ్యమయ్యేది. మొత్తంగా.. 'అట్లాంటి మనిషి ఒకరు మన మధ్యనే ఇన్నాళ్లూ తిరుగాడాడు..' అని చెప్పుకునేంత ఆదర్శమూర్తి విఠలాచార్య.

వృత్తి జీవితంలోనూ, సాహిత్య జీవితంలోనూ విఠలాచార్యది విశిష్ట ప్రస్థానం. ఉపాధ్యాయుడిగా ఎక్కడ పనిచేసినా పిల్లలకు అక్షరజ్ఞానం అందిస్తూనే, పెద్దలకు చైతన్య దీపాలందించాడు. గ్రామ ప్రజలందరిని ఏకంచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయటమే కాకుండా, ఆయన అడుగుపెట్టిన చోటల్లా సాహిత్య, సాంస్కృతిక సంస్థలను ఏర్పాటుచేసి ప్రజాచైతన్యానికి పాటుపడ్డారు. ఆ క్రమంలో ప్రజల్లో ఉన్న మౌఢ్యాలను పారదోలేందుకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బుర్రకథలు, నాటికలు, నాటకాలు రాశారు. ఆడి, పాడించారు. అక్షరజ్ఞానమంతా సమాజ ఉద్ధరణ, చైతన్యం కోసంగా ఆచరించి చూపారు. ఛందోబద్ధ పద్యాలను అవలీలగా రాసే విస్తార పాండిత్యం ఉన్న ఆయన కాలానుగుణంగా భాషను, సాహిత్యాన్ని ప్రజాస్వామికరించారు. అందులో భాగంగా, సామాజిక బాధ్యతగా వచన కవిత్వాన్ని రాశారు, రాస్తున్నారు. తన పీహెచ్‌డీ సిద్ధాంతం మొదలు గొలుసుకట్టు నవలల దాకా, పద్య కవిత్వం, శతక సాహిత్యం మొదలు వచన కవి త్వం, నేటీ మినీ



వృత్తి జీవితంలోనూ, సాహిత్య జీవితంలోనూ విఠలాచార్యది విశిష్ట ప్రస్థానం. ఉపాధ్యాయుడిగా ఎక్కడ పనిచేసినా పిల్లలకు అక్షరజ్ఞానం అందిస్తూనే, పెద్దలకు చైతన్య దీపాలందించాడు. గ్రామ ప్రజలందరిని ఏకంచేసి పాఠశాల అభివృద్ధికి కృషిచేయటమే కాకుండా, ఆయన అడుగుపెట్టిన చోటల్లా సాహిత్య, సాంస్కృతిక సంస్థలను ఏర్పాటుచేసి ప్రజాచైతన్యానికి పాటుపడ్డారు.

కవిత్వం.. నానీల దాకా కాలంతో కాలు కదిపి నడిచివచ్చారు. ఏది రాసినా అదంతా సామాజిక ప్రయోజనం కోసమని చాటిచెప్పారు. సాహిత్యం-సాహిత్యం కోసం కాదని చాటిచెబుతూ.. తన సాహిత్య కృషినంతా.. సామాజిక పురోగమనానికి కందెనగా, సమాజంలో చుట్టూరా సాగుతున్న సామాజిక సంఘర్షణల జ్వాలలకు చమురుగా చేసి వెలుగులు పంచుతున్నారు. ఈ మధ్య కొంతమందికి ఎంత పురాతనమైనదీ, పాతదీ అయితే అంతగా ప్రేమించే వింత వ్యాధి ఒకటి సోకింది. పాతదంతా మేలిమి బంగారమంటూ నెత్తికెత్తుకొని ఊరేగుతున్నారు. ప్రబంధ గ్రాంథిక, పద్య సాహిత్యానికి శవ సింగారం చేస్తున్నారు. పాండిత్యాన్ని ప్రదర్శించుకునేందుకు సంకీర్తనలు, శతకాలు, శ్లోకాలు రాస్తున్నారు. నేటి ఆధునిక కాలంలోనూ మధ్యయుగాల నాటి బూజుపట్టిన భావజాలంతో ఇంగువ కట్టిన గుడ్డ పేలికలుగా భాసిల్లజూస్తున్నారు. కాలం మారింది. పరిణామ క్రమంలో సమాజం చాలా ముందుకు నడిచివచ్చింది. రాజస్థానాల ఛందోబద్ధ పాండిత్య శబ్దాలంకార సంకెళ్ల నుంచి బంధనాలు తెంచుకొని సాహిత్యం ప్రజాపరమైంది. రాజస్థానాల, అధికార, పండిత వర్గానికే పరిమితమైన సాహి త్యం ప్రజల చేతుల్లో ఆయుధమైంది. వచన కవిత్వంగా, పాటగా ప్రజలకు వెలుగుదారులు చూపుతున్నది. ఆ కొనసాగింపునకు విఠలాచార్య సాహితీసేద్యం ఓ మచ్చుతునక, ఓ కొనసాగింపు.

రామకృష్ణ పరమహంస గురించి మనకు ఓ కథ ఉన్నది. నేలపై కూర్చొని శిష్యులకు బోధన చేస్తున్నప్పుడు ఒక పాము ఆయన పాదాల మీది నుంచి పోతున్న స్థితిని చూసి.., తన పాదాన్ని కదిపితే పాముకు ఏ విధంగానైనా ఇబ్బంది కలుగుతుందేమోనని పాము దాటి పోయిందాకా కాలు కదుపకుండా కూర్చున్నాడట. ఇది పరమహంస సున్నితత్వానికీ, సాటి ప్రాణుల పట్ల ప్రేమకూ ప్రతీకగా చెబుతారు. సరిగ్గా అంతటి సున్నిత మనస్కుడు మన విఠలాచార్య. తనకు కరుస్తున్న చీమను కూడా దానికి ఎక్కడ ఇబ్బంది కలుగుతుందేమోనని సుతిమెత్తగా తొలిగించి దానికి దారిచూపే ప్రేమామయుడు విఠలాచార్య. అని చెప్పి.. అందరూ మంచివాళ్లే, అంతా మంచే అనే అవకాశవాద పలాయనవాది కాదాయన. ఎవరెటు పోతే నాకేంటి అనే బాధ్యతారహితుడు కాదు. మంచి కోసం, మానవీయత కోసం దేన్నైనా వ్యతిరేకిస్తాడు, ఎవరినైనా ఎదిరిస్తాడు. సామాజిక మత మౌఢ్యాలనూ, దోపిడీ పీడనలను, దౌర్జన్యాలను తీవ్రంగా నిరసిస్తాడు. కలాన్ని కరవాలంగా ఝుళిపిస్తాడు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్త చీడపీడలపై కలాన్ని ఖడ్గంగా ప్రయోగిస్తాడు. సరిగ్గా ఈ నేపథ్యంలోంచే..

**'మనలో మనకు**
**భేదాలను సృష్టిస్తే**
**వేదాలనైనా తిరస్కరిద్దాం..**
**సమతను కాదంటే**
**స్వమతమేదైనా తిరస్కరిద్దాం..**
**చెడును చెప్పితే**
**దేవుని గుడినైనా తిరస్కరిద్దాం..'** అంటూ సమాజానికి పిలుపునిచ్చాడు. సామాజిక అసమానతలు, అంతరాలు, వివక్షలు లేని సమాజం కోసం పరితపిస్తున్నాడు. ఓ మానవీయ సమాజం కోసం కలం సైనికుడిగా సాగిపోతున్నాడు.

ఈ క్రమంలో ఆయన రాసిన సాహిత్యాన్ని ఆసాంతం చూసినప్పుడు కొంత వైరుధ్యం కనిపించకమానదు. అయితే.. ఆయన వ్యక్తిత్వాన్ని దగ్గరగా చూసినవారికి అది వైవిధ్యంగానే అర్థమవటంలో అర్థమున్నది. అలాగే అది తాను రూపుదిద్దుకొని ఎదిగివచ్చిన తరానికి ఉన్న పరిమితిగా అర్థం చేసుకుంటే.., మొత్తంగా ఆయన మంచికీ, మానవీయతకూ పట్టం కట్టిన తీరు అనుసరణీయం. మనిషి కేంద్రంగా సాగిన ఆయన సాహిత్య కృషి ఆదర్శప్రాయం.

దాశరథి పురస్కారం తనకు దక్కిన సందర్భాన్ని పురస్కరించుకొని.. 'ఇది ఒకరకంగా తెలంగాణ పల్లెకు దక్కిన గౌరవంగా.., పల్లెకు పట్టాభిషేకం చేయటంగా భావిస్తా'నన్న ఆయన వినమ్ర ప్రకటన, విఠలాచార్య సచ్ఛీలతకు నిదర్శ నం. ఎనభై రెండేండ్ల జీవనయానంలో జీవితాన్నంతా మంచికోసం-మనిషి కోసం, సమత కోసం-మమత కోసం వెచ్చించిన విఠలాచార్యకు దాశరథి పురస్కారం లభించిన సందర్భంగా తెలంగాణ సమాజం తరపున అభినందనలు.

**– ఎస్.మల్లారెడ్డి, 8096677255**



## నిరతము వెలిగే రవి

విప్లవజ్వాలలు గుండెల రగులగ
ఆరనిమంటలు తనువును కాల్చగ
దేశప్రగతికి శాంతి రూపమై
విశ్వజననికి కాంతి దీపమై
'అగ్నిధార'లను కురిపించాడు
'రుద్రవీణ'లను పలికించాడు

తెలంగాణలో ప్రభాతమ్ములా
నిజాము గుండెను చీల్చు అమ్ములా
తెలుగు వెలుగులో కొత్త జిలుగులా
పూలగుండెలో మధువు తరగలా
'పునర్నవమ్ము'ను సృష్టించాడు
భావవీచికల విహరించాడు

మనసున మమతల రూపై నిలిచిన
కన్నుల వెన్నెల కాంతులు చిందిన
కవితా తరువుకు చివురులు తొడిగిన
దీనుల బతుకుల దివ్వెలు నిలిపిన
ధీర కవీంద్రుడు దాశరథి
కవిలోక రవీంద్రుడు దాశరథి

మరందగీతిక మాధురిలోన
విరిసిన నందనవనములలోన
మోగిన మువ్వల సవ్వడిలోన
పూసిన పువ్వుల నవ్వులలోన
వెన్నెలలొలికే శశి దాశరథి
నిరతము వెలిగే రవి దాశరథి.

**– తిరునగరి శరత్‌చంద్ర, 6309873682**

### కొత్త పుస్తకం

## నూనెసుక్క ఇంకిన్ని కథలు



కొట్టం రామకృష్ణారెడ్డి జీవితంలోంచి వచ్చిన కథలు. ఇవన్నీ ఆయన జీవించిన పల్లెలోని జీవితానుభవాలు, నిజాయితీ స్పందనలకు ప్రతిరూపం ఈ కథలు. ఈ కథల్లో పల్లె వాతావరణ అద్భుత చిత్రణ, వ్యవసాయ వృత్తి విశేషాల వర్ణన, సజీవ మాండలిక భాషా ప్రయోగం, కుటుంబ జీవితంలోని సున్నిత అంశాల ఆవిష్కరణ ఈ కథల ప్రత్యేకత, విశిష్టత. నేటి ఆధునిక యాంత్రికాభివృద్ధి యుగంలో మనిషి ఎదుర్కొంటున్న సంక్షోభాలు, వాటి నుంచి బయటపడేందుకు పడుతున్న తన్లాట ఈ కథల్లో పుష్కలంగా ఉన్నది. మొత్తంగా ఈ కథల నిండా తెలంగాణ పల్లె జీవితం ఉన్నది. పెనుగులాట ఉన్నది. సమకాలీన కథకుల్లో రామకృష్ణారెడ్డి ఎదిగి వచ్చిన మంచి రచయిత.

**రచన: కొట్టం రామకృష్ణారెడ్డి, వెల:రూ. 120**
**ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, 33-22-2, చంద్రబిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520004, ఫోన్:0866-2430302**

### ప్రకటనలు

## దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభ

తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య 95వ జయంతి ఉత్సవం సందర్భంగా సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభ 2019 జూలై 22న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతిలో జరుగుతుంది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్, గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బొంతు రామ్మోహన్ హాజరవుతారు. దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కార గ్రహీత కూరెళ్ల విఠలాచార్యతో పాటు, ఆత్మీయ అతిథులుగా మహమ్మద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, దానం నాగేందర్, కె.వి.రమణాచారి, నందిని సిధారెడ్డి, బాదిమి శివకుమార్, దేశపతి శ్రీనివాస్, బాబా ఫసియొద్దీన్, విజయారెడ్డి తదితరులు హాజరవుతారు. సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. అందరికీ ఆహ్వానం.

**- మామిడి హరికృష్ణ, సంచాలకులు**
**-బి. వెంకటేశం, ప్రభుత్వ కార్యదర్శి**

## ఆవిష్కరణ సభ

తిరునగరి శ్రీనివాస స్వామి రచన 'వెన్నెల వాన', తిరునగరి శరత్‌చంద్ర 'అక్షర శిఖరం' పుస్తకాల ఆవిష్కరణ సభ 2019 జూలై 27న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. డాక్టర్ పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరుగు సభలో అతిథులుగా ఆచార్య సూర్యాధనుంజయ్, బైసా దేవదాసు, భూపతి వేంకటేశ్వర్లు, తంగిరాల చక్రవర్తి హాజరవుతారు.ముఖ్య అతిథి సుద్దాల అశోక్ తేజ పుస్తకాలను ఆవిష్కరిస్తారు. డాక్టర్ సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి, అనంతోజు మోహనకృష్ణ పుస్తకాలను పరిచయం చేస్తారు. సలీమ, సయ్యద్ ముజాహిద్ అలీ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు..

**- తెలంగాణ సాహితి, అపూర్వ క్రియేషన్స్**

# అగ్నిధార 'దాశరథి'

**భారత** స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ ఉద్యమం సముజ్వలమైన అమరగాథ. ఆ ఉద్యమానికి మూడు పార్శ్వాలున్నది ప్రప్రథమంగా వక్కాణించదగినది. బ్రిటిష్‌వలస పాలనకు చరమగీతం పాడిన ప్రజోద్యమాల వరుసలో జాతీయ విముక్తి పోరాటంగా ప్రత్యేకించి స్వదేశీ సంస్థానాలలో సాగిన ప్రజా పోరాటంగా దానికున్న ప్రాధాన్యం అనితరమైనది. వ్యవసాయాధార భారత సమాజంలో కీలకమైన భూ సమస్యను జాతీయ ఎజెండాలోకి ఎక్కించిన వీరోచిత పోరాటం అది రెండో పార్శ్వం. చారిత్రకంగా, సాంస్కృతికంగా ఒక్కటైన తెలుగు ప్రజలు పరాయి దాస్యంలో ముక్కచెక్కలైన పరిస్థితికి అంతం పలికి భాషాప్రయుక్త ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు భూమిక సిద్ధింపచేసిన ప్రజాతంత్ర పోరాటమన్నది మరో ముఖ్యమైన మూడవ పార్శ్వం.

తెలంగాణ ఉద్యమ కావ్యాల్లోకెల్లా అగ్రగణ్యమైనది దాశరథి అగ్నిధార. తెలంగాణ కాకతీయుల కదన పాండితికి నెలవే కాదు-ఒకప్పుడు మనుజేశ్వరాధముల నదఃకరించిన పోతన కవి పురిటిగడ్డ. ఆ వారసత్వం పుణికి పుచ్చుకున్న దాశరథి నిజాం నవాబు పదఘట్టనలో నలిగి నవిసి యమయాతనలకు గురైనది తెలంగాణ. జన్మజన్మాల బూజుగా కృద్ధ కవులచే శప్తుడైన నిజాం, ఆయన తొత్తులైన దేశముఖుల చేతిలో అలవి కాని అష్టకష్టాల పాలయింది. దున్నుకోటానికి బారెడు భూమి లేక మాతృభాషలో చదువుకునే వీలులేక కనీస జీవన ప్రమాణాలకు నోచుకోని తెలుగు ప్రజల చింతల కాపురంగా సొక్కిపోయింది. ఆ దారుణంపట్ల ఆగ్రహోదగ్రులైన తెలుగు ప్రజలు ప్రళయరుద్రులై, వీరభద్రులై ఒక్కుమ్మడిగా విజృంభించారు. కవులు ఆ పోరాటాన్ని పరిపరి విధాల కీర్తించారు. నిజాం ముష్కరపాలనపై నిప్పులు వర్షించారు. అగ్నిధారలు స్రవించాయి. రుద్రవీణలు గర్జించాయి. వీర తెలంగాణ స్ఫూర్తితో మహాంధ్రోద్యమాన్ని ఆకాంక్షిస్తూ ప్రఖ్యాతులూ, అజ్ఞాతులూ అయిన కవులెందరెందరో పాటలని తూటాలుగా, ఈటెలుగా, బరిసెలుగా, వడిసెలుగా, వజ్రాయుధాల్లా మలిచి నిజాం రాక్షస రాజ్యంపై పరిక్రమించారు. ఆ పోరాట కాలంలో ఉత్తమ సాహిత్యం, ఉన్నతమైన అభిరుచులతో వివిధ కళారూపాలు సమరశీల ప్రజల విప్లవ కథన కాహళులుగా రూపుదిద్దుకున్నాయి.భూసమస్యపై, సాంస్కృతిక పరిరక్షణ సమస్యపై జరిగినటువంటి ఆ పోరాటం కవులను ఉత్తేజపరిచింది. అందులో దాశరథి ప్రేక్షకుడిగా కాకుండా స్వయంగా పాల్గొన్నారు.

వాస్తవానికి **'అగ్నిధార'** తెలంగాణ ప్రజల పీడిత మనోభావాలకు ప్రతీక. దాశరథి చెప్పినట్టు అది నిజాం నవాబు పాలనను తుదముట్టించడమే కాకుండా తెలంగాణలో వున్న భూస్వామ్య, బానిస వ్యవస్థను రద్దుచేసి తెలుగువారందరూ ఒక్కటి కావటానికి తోడ్పడింది. **'నా తెలంగాణ కోటి రత్నాల వీణ'** అన్న దాశరథి మూడుకోట్ల నొక్కటే ముడి బిగించి మహాంధ్రోదయాన్ని ఆకాంక్షిస్తారు. అది అగ్నిధారలో ఆసాంతం కనబడుతుంది. వాస్తవానికి అగ్నిధార ఆయన కారాగారవాస క్లేశాలు. అజ్ఞాతవాస అవస్థల నుండి జ్వలించినటువంటి కావ్యమది. అగ్నిధార తొలి ప్రచురణకు పీఠికరాస్తూ దేవులపల్లి రామానుజరావుగారు చెప్పినట్టు.. ఆ ఉద్యమంలో భాగస్వామి అయినటువంటి దాశరథి అక్కడి ప్రజలు మట్టి నుండి మాణిక్యాలై, ప్రజల మనుషులై సృష్టించిన చరిత్రకు భాష్యకారుడిగా నిలిచాడన్నారు. దాశరథి చెప్పినట్టు పీడిత ప్రజావాణికి మైకు అమర్చినటు వంటి ఉత్తమ కావ్యం అగ్నిధార.అలాగే రైతుకు తన భూమి మీద హక్కును గురించి తెలంగాణము రైతుదే. **'ముసలి నక్కకు రాచరికంబు దక్కునే'** అని అగ్నిధారలో గర్జించాడు. అంతేకాకుండా అనేక విధాలుగా ఆ ఉద్యమంలో తమతోపాటు తాదాత్మ్యం పొందినటువంటి వీరకేసరులను స్మరిస్తూ అగ్నిధారను తన సహజైలువాసి వట్టికోట ఆళ్వార్ స్వామికి అంకితమిచ్చాడు.

దాశరథి పోరాట ప్రజల ఆస్థానకవిగా వున్నప్పుడు రాసిన మూడు కావ్యాలలో కూడా తెలంగాణా పోరాట ప్రజాశ్రేణుల యొక్క మనోభావాలను ప్రతిధ్వనిస్తాయి. **అగ్నిధార** మొదటిది. **రుద్రవీణ** రెండవది. దాని పర్యవసానంగా వచ్చిన **మహాంధ్రోదయం** మూడవది. దాశరథి యొక్క యింకొక వైశిష్ట్యం ఏమిటంటే.. అగ్నిధార, ప్రజల మనిషి నవల రాసినటువంటి తన నిజామాబాద్ జైలు సహవాసి వట్టికోట ఆళ్వార్ స్వామికి అంకితమిస్తే, రుద్రవీణను తెలంగాణకు అంకితమిచ్చాడు. అలాగే మహాంధ్రోదయాన్ని సురవరం ప్రతాపరెడ్డికి అంకితమిచ్చాడు.

దాశరథి తెలుగు, సంస్కృతం, పారశీ, ఆంగ్లం బాగా చదువుకున్నవాడు. ఇటు ఛందోబద్ధమైన కవితల లోనూ, అటు వచన ప్రక్రియలలోనూ, గేయాలలోనూ ప్రసిద్ధి చెందినవాడు. ప్రతి ప్రక్రియను కూడా హృదయగతమైనటువంటి భావోద్వేగంతో నిక్షిప్తం చేసినవాడు. దాశరథి ఆనాటి చరిత్రకు అద్దం పట్టినటువంటి కవి. తెలంగాణ ఉద్యమ ప్రేరణతో అనేక కావ్యాలు వచ్చాయి. అనేక నవలలు వచ్చాయి. ఉదాహరణకు ఆరుద్ర **'త్వమేవాహం'**, కుందుర్తి **'తెలంగాణ'**, అలాగే బొల్లిముంత **'మృత్యుంజయులు'**.. యిలా వచ్చినటువంటి అన్ని సాహితీ ప్రక్రియలు, రూపాలు, కావ్యాల్లోకెల్లా **అగ్నిధార** ఉత్తమమైనది. ఆనాడు తెలంగాణ ప్రజల క్రోధాగ్నికి ఎలా దాశరథి స్పందించాడో ఒక విషయం చెప్తే అర్థమవుతుంది.ఆయన.. **'నా గీతావళి ఎంతదూరము ప్రయాణంబగునో అందాక ఈ భూగోళమ్మున అగ్గి పెట్టెదను నిప్పుల్ పోసి, హేమంత భామా గంధర్వ వివాహమాడెదను. జూమసుప్త గోళమ్ముపై ప్రాణాకాశనవారుణోష్ట జలధారల్ చల్లి చల్లార్చెద'**నన్నాడు,

**'వీనియ తీగపై పదును పెట్టిన నా కరవాల**
**ధారతో గానము ఆలపించెద స్వకంఠము**
**నుత్తరణంబు నొనర్చి స్వర్గానకు భూమినుండి**
**రసగంగను చిమ్మెద. పీడిత ప్రజావాణికి మైకు**
**అమర్చి అభావాదులకున్ వినిపింప చేసెదన్..'**అన్నాడు.

చాలా గొప్ప భావోద్వేగ భరితమైనటువంటి కావ్యమది. అంతేకాదు తెలంగాణ అంటే దాశరథి పరవశించిపోతాడు. ఎంత ఇదిగా అంటే..

**'కాకతీయుల కంచుగంట మ్రోగిననాడు**
**కరకు రాజులకు తత్తరలు పుట్టి**
**వీర రుద్రమదేవి విక్రమించిననాడు**
**తెలుగు జెండాలు నర్తించే మింట**
**కాపయ్య నాయకుండేపునూపిననాడు**
**పర రాజులకు గుండె-పట్టుకొనియె**
**చాళుక్య పశ్చిమ రాజ పాలనమ్మున**
**కళ్యాణ ఘంటలు గణ గణ మనె**

**నాడు, నేడు తెలంగాణా మోడలేదు**
**శత్రువుల దొంగదాడికి**
**శ్రావణాభ్రజలద గంభీర గరాట్టహాసమదర**
**నా తెలంగాణా పోవుచున్నది నవపథాన..'** అన్నటువంటి దాశరథి అనేక విషయాలలో ఆదర్శమైనటువంటి ప్రజాకవిగా నిలబడ్డాడు.

వాస్తవానికి దాశరథి ఆకారంలో వామనుడు, పరాక్రమంలో త్రివిక్రముడు. నిత్యనూతన ప్రగతిశీలి. నైజాం కర్కశపాలనలో కఠోర జీవితాన్ని కన్నది, విన్నది కాదు. స్వయంగా అనుభవించిన వాడు. ఆ అనుభవాలకు పదునైనటువంటి అక్షరరూపం కల్పించినవాడు. రెండు పదుల వయస్సు నిండకముందే నైజాం జైళ్లలో నానా బాధలు పడ్డవాడు. ఆ బాధల నుండి పుట్టిన అగ్నియే ఆయన కవిత్వం. అందులోదే **అగ్నిధార**. క్రౌంచపక్షి దురవస్థ చూసి వాల్మీకి కవి గళం విప్పారింది. తెలంగాణ ప్రజల దురవస్థ చూసి, అనుభవించి దాశరథిలో అంతర్నిహితమైన అగ్ని లావాను పోలిన కవితా స్రవంతిగావిజృంభించి అగ్నిధార రూపం దాల్చింది. పద్యం, గేయం,వచనం, కవిత్వం లాంటి అన్ని రూపాలలోనూ ఆయన సిద్ధహస్తుడు.

వాస్తవానికి దాశరథి ఆకారంలో వామనుడు, పరాక్రమంలో త్రివిక్రముడు. నిత్యనూతన ప్రగతిశీలి. నైజాం కర్కశపాలనలో కఠోరజీవితాన్ని కన్నది, విన్నది కాదు. స్వయంగా అనుభవించినవాడు. ఆ అనుభవాలకు పదునైనటువంటి అక్షరరూపం కల్పించినవాడు. రెండు పదుల వయస్సు నిండకముందే నైజాం జైళ్లలో నానాబాధలు పడ్డవాడు. ఆ బాధ ల నుండి పుట్టిన అగ్నియే ఆయన కవిత్వం. అందులోదే అగ్నిధార. క్రౌంచపక్షి దురవస్థ చూసి వాల్మీకి కవి గళం విప్పారింది. తెలంగాణ ప్రజల దురవస్థ చూసి, అనుభవించి దాశరథిలో అంతర్నిహితమైన అగ్ని లావాను పోలిన కవితాస్రవంతిగావిజృంభించి అగ్నిధార రూపం దాల్చింది.

మీదుమిక్కిలి పారశీ కవి గాలిబ్ 'గజళ్ల'ను అనువదించి తెలుగువారికి ఆ రససిద్ధిని పంచిపెట్టినవాడు. నా తెలంగాణ కోటిరత్నాలవీణ అన్న దాశరథి అక్కడితో ఆగిపోలేదు. సోషలిస్ట్ వ్యవస్థపట్ల మమకారం, విశ్వశాంతి.. యిలా ఆయన భావనాస్రవంతి విశ్వజీవన శ్రేయోదాయకమైనటువంటి త్రివిక్రమాకృతిలో, కవిత్వం రూపంలో దర్శనమిస్తుంది. కనుకనే దాశరథి నిత్యనూతనుడు. సాహిత్య సనాతనుడు, ప్రగతిశీలి. బహుగ్రంథ రచయితగా పెక్కు సత్కారాలు అందుకున్నాడు.ఆంధ్రకవితా ప్రపంచంలో పోరాట ప్రజల ఆస్థానకవిగా తొలిదశలో జాజ్వల్యమానంగా వెలుగొందినవాడు. తరువాత ఆయన సినిమా గేయాలు, ఆస్థానకవిగా ఆయన పరిస్థితి తెలిసిందే. తెలుగువారు యింకా ఎంతో కవితా సృష్టిని ఆయన్నుంచి ఆశిస్తూ వుండగా 60 ఏండ్లకే అమరుడైన అగ్నిధార సృజనశీలి దాశరథి.

**– సి.రాఘవాచారి**

**('శత వసంత సాహితీ మంజీరాలు' అన్న గ్రంథంలో దాశరథి అగ్నిధార పై సి.రాఘవాచారి రాసిన వ్యాసం సంక్షిప్తంగా..)**
**(నేడు.. దాశరథి 95వ జయంతి..)**

### తెలంగాణ సాహిత్యం

## ఏ పడగ కింద లేదు..

**ఈ** మధ్య 'ప్రభుత్వ వ్యతిరేక కవులు' అని చెప్పుకోవడం ఫ్యాషనైపోయింది. కొందరు ఆరోపిస్తున్నట్టుగా కవులెవ్వరూ ప్రభుత్వానికి జీహుజూర్ అనటం లేదు. తెలంగాణ కవులు ప్రభుత్వం పడగ పైన్నే ఉన్నారు కానీ, పడగ నీడ కింద లేరు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు కాకముందు తెలంగాణకు అన్నిరంగాల్లో అన్యాయం జరుగుతుండే గనుక అందరం భేషరతుగా అప్పటి ప్రభుత్వాలను విమర్శించినం. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. మనం ఆశించిన స్థాయిలో లేకపోవచ్చేమో కానీ, అభివృద్ధి జరుగుతుందనేది వాస్తవం. కవులూ, రచయితలూ జరుగుతున్న అభివృద్ధిని గుర్తించాల్సిన చారిత్రక సందర్భం ఇది. కాళేశ్వరం మీద నీటి కవితలు రాసిన కవులు ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ సైతం కవితలు రాసిన్రు. సాహిత్య పేజీలు తిరగేస్తే ఈ నిజం కన్పిస్తది. తెలంగాణ మన చేతికి వచ్చే సరికే పూర్తిగా శిథిలమైపోయింది. కనుక కవులకు ప్రభుత్వం మీద పూర్తి వ్యతిరేకత వుండాల్సిన అవసరం లేదు.

ఇప్పుడు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న కవులు కూడా చెరబండరాజు లాంటి నికార్సయిన కవులేం కాదు. వారు ఉద్యోగాల్లో వున్నప్పుడు పదోన్నతుల కోసం, ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వం ఇచ్చే పదవుల కోసం ప్రభుత్వంచుట్టూ తిరిగిన వారే. అక్కడా పని కాకుంటే జూన్ రెండుకు ముందు అవార్డు కోసం ప్రగతి భవన్ చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ పని కాక విసిగిపోయిన కవులే కదా ప్రభుత్వ వ్యతిరేక రాగమెత్తుకున్నది!

చిత్రమేందంటే ప్రభుత్వ వ్యతిరేక కవులుగా చెప్పుకునే వారు, వారు మాత్రం ఉన్నత స్థానాల్లో వుండాలె. వారి పిల్లలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువు కోవాలె. వాళ్ళు డాలర్ల వేటకు విదేశాలకు పోవాలె. మాలాంటి కవులు చింపిరి జుట్టుతో, చిరిగిన అంగీతో ప్రభుత్వ వ్యతిరేక కవితలు రాస్తూ సాహిత్య సభల్లో గొంతు చించుకోవాలా!? నిజానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజలు ఏమేరకు లబ్ధి పొందుతున్నారనే అంశాల ప్రాతిపదికన మాత్రమే కవులు కానీ, రచయితలు కానీ ప్రభుత్వాన్ని విమర్శించటం లేదా పొగడటం చేయాలి. అలా కాకుండా పనులు కాకపోతే ప్రభుత్వాన్ని తిట్టడం, అనుకూలంగా వుంటే ప్రభుత్వానికి బాకా ఊదటం రచయితలు చేయాల్సిన పని కాదు. కాళోజీ కేంద్ర ప్రభుత్వ పురస్కారం తీసుకుంటే లేని తప్పు తెలంగాణ కవులు తెలంగాణ సాహిత్య అకాడమీ చేస్తున్న చిన్నపాటి సన్మానం పొందితే తప్పవుతుందా? దాన్ని పడుపు కూడు అనడం నిజంగా మనల్ని మనం అవమానించుకోవడమే.

దేశవ్యాప్తంగా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా 'అవార్డు వాపసీ' పిలుపు వచ్చినప్పుడు మన ప్రభుత్వ వ్యతిరేక తెలుగు కవులు ఎక్కడున్నరు? వర్తమానంలో వరవరరావు మీద ప్రధాని నరేంద్రమోదీ హత్యా ప్రయత్న నేరం మోపబడి గత తొమ్మిది నెలలుగా జైల్లో మగ్గుతుంటే ప్రభుత్వ వ్యతిరేక కవులుగా భుజాలు చరుచుకునే వారు ఏం చేస్తున్నట్టు?

బీజేపీ బలపడేందుకు కారణం మీరంటే మీరని కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీలు ఒకరిమీద ఒకరు నింద వేసుకుంటున్న దీన స్థితిని మనం ప్రత్యక్షంగా చూస్తూ రచయితలుగా ఏం రాస్తున్నామనేది ముఖ్యం. ప్రజాస్వామిక తెలంగాణ కావాలని, అది త్వరలోనే రావాలని అందరికీ ఉంటుంది. కానీ మన దేశం మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండి అది చాలదన్నట్టు మతతత్వ పార్టీ గుప్పిట్లో అధికారం కేంద్రీకృతమైన తర్వాత భారతదేశంలో ఒక రాష్ట్రమైన తెలంగాణలో మాత్రమే మనం ఏదో కోరుకుంటే అదెలా సాధ్యమవుతది? ఇప్పుడు దేశవ్యాప్తంగా కవులను, కళాకారులను, రచయితలను సంఘటిత పరిచే లౌకిక ప్రజాతంత్ర ఉద్యమావశ్యకత మన ప్రధాన లక్ష్యంగా మనం కొనసాగాలి. లేకపోతే చరిత్రలో మన పేజీని మనమే నిశబ్దంగా చింపుకున్న వారిగా అదృశ్యమైపోతం.

**– ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, 98490 82693**

**(ఈ మధ్య ఓ పత్రికలో తెలంగాణ కవులను విమర్శిస్తూ వచ్చిన వ్యాసానికి స్పందన)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



**పురివిప్పిన 'మయూరి' అందాలు..**

పాలమూరులోని మయూరి పార్కు పచ్చదనంతో పురివిప్పింది. ఎటు చూసినా పచ్చని చెట్లే దర్శనమిస్తు న్నాయి. ఈ పచ్చదనం మహబూబ్‌నగర్ ప్రాంతానికే కొత్త అందాలను తెచ్చిపెట్టింది.



నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో ఆదివారం బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. పోతురాజుల విన్యా సాలు, డప్పు చప్పుల మధ్య ఘనంగా బోనాల ఊరేగింపు తీశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి స్వయంగా బోనమెత్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - రుద్రూర్



మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గఢ్‌పూర్‌లోని క్వారీ దుర్గాదేవి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకు న్నారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు. సుమారు లక్ష మంది అమ్మవా రిని దర్శించుకున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. - మంచిర్యాల రూరల్





సూర్యాపేట జిల్లా కోదాడలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తదితరులు

## గోదావరి, కృష్ణా అనుసంధానానికి ప్రణాళికలు

### విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**కోదాడ, నమస్తే తెలంగాణ:** కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం కానున్నదని.. సాగు నీరందక బీడువారిన భూముల్లో సిరుల పంట పండ నున్నదని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కోదాడలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అనేక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని చెప్పా రు. ఆంధ్రా వలసపాలనలో ఆకలిచావులు, ఆత్మహత్యలు ఉండేవని.. సీఎం కేసీఆర్ అన్నదాతలకు అండగా ఉండి రైతుబంధు సాయంతోపాటు రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టడంతో నేడు రైతులకు భరోసా ఏర్పడిందని చెప్పారు. సాగర్ ఎడమ కాల్వకు కూడా గోదావరి జలాలు రప్పించి ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, టీఆర్ ఎస్ రాష్ట్రకార్యదర్శి ఎర్నేని వెంకటరత్నం బాబు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, కలెక్టర్ శ్రీదేవసేన

## మాది చేతల ప్రభుత్వం

### జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**కలెక్టరేట్:** తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ అపరభగీరథుడిగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టి ఐదేండ్ల కాలంలో పూర్తిచేశారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో ఆదివారం జిల్లా పరిషత్ మొట్టమొదటి సర్వసభ్యసమావేశం జడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ రా ష్ట్రాన్ని దేశంలోనే గొప్పరాష్ట్రంగా తీర్చిదిద్దాల న్న ఆకాంక్షతో ముందుకు సాగుతున్నారన్నారు. నాలుగేండ్లలోపు కాళేశ్వరం పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు.



సిద్దిపేటలో మహిళా హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## ఎడ్యుకేషన్ హబ్‌గా సిద్దిపేట

### ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేటను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సిద్దిపేట యూనివర్సిటీ తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలో రూ.19.39 కోట్ల వ్యయంతో నిర్మించిన పీజీ కళాశాల భవనం, మహిళా వసతి గృహాన్ని ఓయూ వైస్ చాన్స్‌లర్ ఎస్ రామచంద్రం, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పీజీ కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ గోపాల్ రెడ్డి, వీసీ ఓఎస్డీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## సౌదీఅరేబియాలో రోడ్డు ప్రమాదం

- మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరి దుర్మరణం
- గుడిరేవు, రోటిగూడలో విషాదఛాయలు




నాంపెల్లి రాజు, ఉప్పు మల్లేశ్ (ఫైల్)

**దండేపల్లి:** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గ్రామానికి చెందిన నాంపెల్లి రాజు(24), జన్నారం మండలం రోటిగూడకు చెందిన ఉప్పు మల్లేశ్(40) సౌదీఅరేబియాలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గుడిరేవుకు చెందిన సత్తయ్య, రాజవ్వ ముగ్గురు సంతానంలో రాజు పెద్ద కుమారుడు. మూడేండ్ల క్రితం డ్రైవర్‌గా పనిచేసేందుకు సౌదీకి వెళ్లాడు. ఉదయం రొట్టెల కోసమని రోటిగూడకు చెందిన మిత్రుడు మల్లేశ్‌తో కలిసి 10 కిలోమీటర్ల దూరంలోని దుకాణానికి బైక్‌పై బయల్దేరారు. వెనుక నుంచి కారు ఢీకొనడంతో అక్కడికక్క డే మృతి చెందారు. మల్లేశ్ అప్పుచేసి మరీ రెండోసారి సౌదీ వెళ్లాడు. వారి మృతదేహాలను స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు సాయం అందించాలని కుటుంబీకులు కోరుతున్నారు.



### చేపల కోసం వల వేస్తే

## పాములు పడ్డాయి

**చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరులోని ఓ చెరువులో మత్స్యకారుడు చేపలకోసం వల వేయగా పాములు చిక్కాయి. అనంతరం అవి వలలోనే చనిపోయాయి. ఆదివారం ఉదయం మత్స్యకారుడు చెరువులో చేపల కోసం వలవేసి వచ్చాడు. సాయంత్రం వెళ్లి తీయగా చేపలతోపాటు 40 వరకు పాములుపడి ఉన్నాయి.

# జోరువాన

### ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా..
### భద్రాద్రి, సూర్యాపేట, జగిత్యాల జిల్లాల్లో ఓ మోస్తరు
### రాగల మూడ్రోజులు వర్షసూచన: వాతావరణ కేంద్రం వెల్లడి



ఖమ్మం నగరంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ప్రవహిస్తున్న వరదనీరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం ఖమ్మం, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుకు ఖమ్మం జిల్లాలో ఓ మహిళ మృతి చెందింది. పలుచోట్ల చెరువుల్లోకి నీరు చేరింది. భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, సూర్యాపేట జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. రాగల మూడ్రోజుల వరకు రాష్ట్రంలో ని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మో స్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

**ఖమ్మం జిల్లాలో..**

ఖమ్మం నగరంతోపాటు పలు మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. నగరంలో కురిసిన వర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి.కామేపల్లి మండలం పండితాపురం శివారులో పిడుగుపాటుకు గిరిజన మహిళ భూక్యా లాలి మరణించింది. ఖమ్మం రూరల్, చింతకాని, బోనకల్, కూసుమంచి, కామేపల్లి, రఘునాథపాలెం, కొణిజర్ల, కారేపల్లి, వైరా తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, టేకులపల్లి, ఇల్లెందు, చంద్రుగొండ, కొత్తగూడెం తదితర మండలాల్లో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలో కురిసిన కుండపోతకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురికి కాల్వలు నిండిపోవడంతో ప్రధాన రహదారిలోని దుకాణ సముదాయాల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. సిరికొండ మండలంలో ఉరుములు మెరుపులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని సిరికొండ, పాండు గూడ, కొండాపూర్, ఎల్లమ్మ, కొత్త చెరువు కుంటలు నిండాయి. గుడిహత్నూర్ మండలం ఉమ్రి(బి)లో పిడుగుపాటుకు ఎద్దు మృత్యువాతపడింది. బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్ రూరల్, తలమడుగు, ఇంద్రవెల్లి, బోథ్, భీంపూర్, జైనథ్, నార్నూర్, ఆదిలాబాద్ అర్బన్, తాంసి, మావల మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రెండు గంటలపాటు కురిసిన వర్షానికి జేకే నగర్ కాలనీ చుట్టూ భారీగా వరద చేరింది. జగిత్యాల జిల్లాలో శనివారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సారంగాపూర్, జగిత్యాల, రాయికల్, ధర్మపురి, మల్యాల, గొల్లపల్లి, కొడిమ్యాల, వెల్గటూర్, కోరుట్ల, మేడిపల్లి, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మల్లాపూర్‌లో భారీ వర్షం పడింది. సూర్యాపేట జిల్లాలో ఆదివారం సాయంత్రం నేరేడుచర్ల, గరిడేపల్లి, హుజూర్‌నగర్, నాగారం, అర్వపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. హుజూర్‌నగర్ గంటపాటు వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. హుజూర్‌నగర్ చెరువులోకి భారీగా వరద నీరు చేరింది.

**నమోదైన వర్షపాతం వివరాలిలా..**

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో 105 మి.మీ. వర్షపాతం నమోదైంది. మంచిర్యాల వెలగనూరులో 67, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో 81.8 మి.మీ., ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో 74.5 మీ.మీ., సిరికొండలో 74, జగిత్యాల జిల్లా అలీపూర్‌లో 73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

**రాగల మూడ్రోజులు పలుచోట్ల భారీ వర్షాలు**

రాగల మూడ్రోజుల వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కాగా కొన్నిచోట్ల భారీ వానలు కురిసే అవకాశం ఉన్నదన్నారు. ఉత్తర మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కి.మీ. ఎత్తు వరకు ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నదని, మరో వైపు ఆగ్నేయ బంగాళాఖాతం దానిని ఆనుకొని తూర్పు మధ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 నుంచి 5.8 కి.మీ. మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, వీటి ప్రభావంతో రుతుపవనాలు మరింత బలపడ వచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌లోకి చేరిన వర్షపు నీరు



జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి కురుస్తున్న వర్షం

### వచ్చే 36 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రుతుపవనాలు చురుకుగా కదులుతున్న నేపథ్యంలో రాగల 36 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడినప్పటికీ మధ్యాహ్నం సమయానికి ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం 5.30 వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 31.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.3 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 61శాతంగా నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

# డబుల్ ఆసరా..

### పెరిగిన పింఛన్‌తో ఆనందంలో లబ్ధిదారులు
### ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



సూర్యాపేట జిల్లా కోదాడలో ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



మహబూబ్‌నగర్‌లో పింఛన్ పెంపు మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణలత

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఆసరా పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం విల్లివిరుస్తున్నది. తాజాగా వృద్ధులకు రూ.2016, దివ్యాంగులకు రూ.3016 చొప్పున పింఛన్లు చెల్లిస్తుండటంతో వారిలో సరికొత్త ఉత్సాహం నెలకొన్నది. సీఎం కేసీఆర్ తమ బతుకుకు మరింత భరోసా కల్పించారంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పలు చోట్ల లబ్ధిదారులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పింఛన్లను పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన మంజూరు పత్రాలను రెండోరోజైన ఆదివారం కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. సూర్యాపేట జిల్లా మునగాల, నడిగూడెం మండలాల్లో విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ప్రతులను అందజేశారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అనేక నిధులు కేటాయిస్తున్నారని, ఆపన్నులకు అండగా నిలిచి ఇంటికి పెద్దకొడుకులా మారారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకటరత్నంబాబు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌తోపాటు హన్వాడలో ఆసరా లబ్ధిదారులకు పింఛన్ల పెంపు మంజూరు పత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పింఛన్ల పెంపుతో రాష్ట్రంలో ఏ వృద్ధురాలిని చూసినా వారి మోములో ఆనందం వెల్లివిరుస్తున్నదన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి, గంగాధర, రామడుగు మండలాల్లో కరీంనగర్, చొప్పదండి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్ పత్రాలను పంపిణీ చేశారు.

## వైద్యవిద్యకు తెలంగాణ దిక్సూచి

- ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే
- కేఎంసీ వజ్రోత్సవ ముగింపులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వరంగల్‌లో జరిగిన కేఎంసీ వజ్రోత్సవ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య

**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** వైద్యవిద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వలక్ష్యమని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యంపట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతున్నదన్నారు. దేశంలోకెల్లా తెలంగాణ రాష్ట్రంలోనే మంచివైద్యం దొరుకుతుందనేలా అందరం కలిసి కృషి చేద్దామని వివరించారు. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలోని ఆడిటోరియంలో ఆదివారం వజ్రోత్సవ ముగింపువేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకుల సేవలు అవసరం అని గుర్తించిన సీఎం కేసీఆర్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయోపరిమితిని 58 నుంచి 65 ఏండ్లకు పెంచారని గుర్తు చేశారు. కేఎంసీ ప్రాంగణం నుంచి ప్రస్తుతం ఉన్న ఎంజీఎం వరకు హెల్త్‌కారిడార్ నిర్మించాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్నారని.. అందులో భాగంగానే వరంగల్ సెంట్రల్ జైలును తరలించి మొత్తం ఒక్కటిగా చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నదని తెలిపారు. కేఎంసీ, ఎంజీఎం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహాయం చేస్తుందని, అలాగే ఎన్నారైలు, పూర్వ విద్యార్థులు, వివిధ ప్రాంతాల్లో దవాఖానల నిర్వాహకులు తమకు తోచిన విధంగా సహాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 'మీరు 20శాతం డబ్బులు ఇస్తే ప్రభుత్వం తరపున 80 శాతం మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు సుధాకర్‌రెడ్డి, వీఎల్ నర్సింహరావు, కాళీ ప్రసాద్‌రావు, ఎండీ అన్వర్, విజయచందర్‌రెడ్డి, సంధ్యారాణి, హనుమంతరావు, జార్జిరెడ్డి, మధుసూధన్, రవి, సుధీర్‌కుమార్, మోహన్‌రావు, మల్లేశం, జైసింగ్ రాథోడ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ సభ్యత్వాలు తీసుకుంటున్న నాయకులు

## కొనసాగుతున్న సభ్యత్వాలు




**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ పలు జిల్లాల్లో ఆదివారం కూడా కొనసాగింది. వనపర్తిలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పలువురికి సభ్యత్వాలను అందజేశారు. వరంగల్ నగరంలోని హన్మకొండ వేయిస్తంభాల గుడి ఆవరణలోని కుడా గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ బ్రాహ్మణులకు సభ్యత్వాన్ని అందజేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో పూర్తయిన సభ్యత్వ నమోదు పుస్తకాలను స్థానిక నాయకులు టీఎస్‌ఐఐసీ చైర్మన్, సభ్యత్వ నమోదు ఇంచార్జి గ్యాదరి బాలమల్లుకు అందజేశారు.

## అయ్యో పాపం.. రైతు

- పొలానికి ఉన్న ఫెన్సింగ్ తగలడంతో విద్యుదాఘాతం
- అక్కడికక్కడే మృతి

**భీమారం:** మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఎల్కేశ్వరం పంచాయతీ పరిధిలోని ఎల్బీపేటలో ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఎల్బీపేటకు చెందిన మొండయ్య(60) ఆదివారం ఉదయం పత్తి చేనుకు మందు కొట్టేందుకు వెళ్లాడు. అతడి పక్కన ఉన్న మరో పొలం చుట్టూ వేసిన కంచెకు విద్యుత్ ప్రవహిస్తున్నది. పత్తిచేనుకు మందు కొడుతుండగా మొండయ్య ప్రమాదవశాత్తు పక్కపొలం కంచెను తాకడంతో విద్యుతాఘాతానికి గురయ్యాడు. కాపాడబోయిన అతడి భార్య లక్ష్మికి కూడా గాయాలయ్యాయి.

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

## ఐదుగురు దుర్మరణం

- మహబూబ్‌నగర్ జిల్లా కుచ్చరకల్‌లో ముగ్గురు
- కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో బైక్ అదుపుతప్పి ఇద్దరు మృతి



మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చరకల్‌లో ప్రమాదానికి కారణమైన కారు

**రాజాపూర్:** వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఐదుగురు ప్రాణాలు వదిలారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ముగ్గురు, కామారెడ్డి జిల్లా భిక్కనూరులో ఇద్దరు దుర్మణం చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చరకల్‌కు చెందిన గొడుకు చంద్రయ్య (55), మంగళి రంగయ్య(60), యాదగిరి (20) తమ పశువులను రోడ్డు పక్కన ఉన్న బీడు పొలంలో మేపుతూ రోడ్డు పక్కన కూర్చున్నారు. ఈ క్రమంలో జడ్చర్లకు చెందిన శేఖర్‌రెడ్డి మద్యంమత్తులో తన ఇన్నోవా వాహనంలో తిర్మలాపూర్ నుంచి వేగంగా వస్తుండగా.. కుచ్చకల్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చున్న కాపరులపైకి దూసుకెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు వాహనాన్ని వెంబడించి పట్టుకొని శేఖర్‌రెడ్డిని పోలీసులకు అప్పగించారు. మరో ఘటనలో కామారెడ్డి జిల్లా భిక్కనూరులోని 44వ జాతీయరహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన శ్రీనివాస్(37), స్వామి(30) మరణించారు.

## వేదికపైనే కుప్పకూలి హాస్యనటుడు మృతి

ప్రదర్శనలో భాగమని నమ్మిన ప్రేక్షకులు.. దుబాయ్‌లో విషాదం



**దుబాయ్:** భారత సంతతికి చెందిన నటుడు, స్టాండప్ కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకొన్న మంజునాథ్ నాయుడు (36) శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందారు. దుబాయ్‌లోని ఒక హోటల్‌లో ఎక్కువ మంది ఎదుట ప్రదర్శన ఇస్తుండగా గుండెపోటు రావడంతో వేదికపైనే కుప్పకూలిపోయారు. ప్రదర్శనలో లీనమైన ప్రేక్షకులు, నిర్వాహకులు.. మంజునాథ్ కుప్పకూలిపోవడాన్ని కూడా ప్రదర్శనలో భాగమని అనుకొన్నారు. గుండెపోటుకు గురైన విషయాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించగా.. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చెన్నై మూలాలున్న మంజునాథ్ అబుదాబిలో జన్మించారు. ఐదేండ్లుగా ఆయన స్టాండప్ కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకొన్నారు.

## జపాన్ ప్రజల మద్దతు 'షింజో అబే'కే!

ఎగువసభ ఎన్నికల్లో రెండొంతుల మెజారిటీ వస్తుందని అంచనా



**టోక్యో:** జపాన్‌లో ఎగువసభకు జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా ఆదివారం పోలింగ్ జరిగింది. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాని షింజో అబే నేతృత్వంలోని లిబరల్ డెమొక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) ఈ ఎన్నికల్లో తమ మెజారిటీని పదిల పరచుకోనున్నదని సర్వే సంస్థలు అంచనా వేస్తున్నాయి. ప్రతిపక్షం బలహీనంగా ఉండటం, సామాజిక భద్రత కోసం వినియోగ పన్నును 10 శాతం పెంచుతున్నట్టు ప్రధాని ప్రకటించడంతో ఆయన నేతృత్వంలోని ఎల్‌డీపీ, సంకీర్ణ భాగస్వామ్య కొమెయిటో పార్టీలు 124 వరకూ సీట్లను గెలిచే అవకాశమున్నదని, సభలో ఈ భాగస్వామ్య కూటమికి రెండొంతుల మెజారిటీ రావొచ్చని ఒపీనియన్ పోల్స్ అంచనా వేశాయి.

## పేదింటికి 128 కోట్ల కరెంట్ బిల్లు!

చెల్లించలేదని విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉత్తర్‌ప్రదేశ్‌లో విద్యుత్ అధికారుల లీలలు



**న్యూఢిల్లీ, జూలై 21:** ఉత్తర్‌ప్రదేశ్ విద్యుత్ అధికారులు తమ లీలలతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో కన్నౌజ్‌లోని ఓ గృహ వినియోగదారునికి రూ.23 కోట్ల భారీ బిల్లును విధించిన విద్యుత్ అధికారులు.. ఇప్పుడు హపూర్‌లోని చామ్రి గ్రామంలో షమీమ్ అనే మరో సాధారణ గృహ వినియోగదారునికి ఏకంగా రూ.128,45,95,444 బిల్లును 'వడ్డించి' సంచలనం సృష్టించారు. ఈ తప్పును సరిదిద్దించుకునేందుకు కాళ్లరిగేలా తిరిగినా అధికారులు కనికరించలేదని, పైపెచ్చు ఆ బిల్లును చెల్లించలేదన్న కారణంతో తన ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారని బాధితుడు వాపోయారు. 'మా విజ్ఞప్తులను పట్టించుకున్న వారే లేరు. అధికారులు తప్పును సరిదిద్దపోగా ఆ బిల్లును చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు. లేదంటే మా ఇంటికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదని అధికారులు తెల్చిచెప్పారు' అని షమీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా తమకు సగటున రూ.700 నుంచి రూ.800 విద్యుత్ బిల్లు వస్తుందని, ఇప్పుడు తనకిచ్చిన బిల్లును చూస్తుంటే మొత్తం హపూర్ నగర విద్యుత్ బిల్లును అప్పగించినట్టుగా ఉన్నదని ఆయన ఆరోపించారు.



### యథా తండ్రి.. తథా కుమారుడు

గౌడ కుటుంబం ఎప్పుడూ పూర్తి కాలం అధికారంలో కొనసాగలేదనే వాదనలు ఉన్నాయి. 1996 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 161 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలువగా కాంగ్రెస్ 140 సీట్లకే పరిమితమైంది. పలు పార్టీల అగ్రనేతలు మద్దతు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అనూహ్యంగా దక్షిణాది నుంచి రెండో ప్రధానిగా జేడీఎస్‌కి చెందిన దేవెగౌడ జూన్ 1న ప్రమాణస్వీకారం చేశారు. 11 నెలలకే ఆ పదవిని కోల్పోయారు. ఆయన కుమారుడు కుమారస్వామి ప్రస్తుతం అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 104 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించగా కాంగ్రెస్ 80 సీట్లకే పరిమితమైంది. 37 స్థానాల్లో గెలిచిన జేడీఎస్ అనూహ్యంగా కాంగ్రెస్ మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. తండ్రి మాదిరిగానే కుమారస్వామి 13 నెలల పాలనలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు.

# కర్ణాటకానికి నేటితో తెర?

తేలనున్న సంకీర్ణ ప్రభుత్వ భవితవ్యం

సోమవారమే విశ్వాస పరీక్షను ఎదుర్కొంటామన్న సర్కార్

చర్చను ముగిస్తామని స్పష్టం చేసిన స్పీకర్

సుప్రీంకోర్టుపైనే కుమారస్వామి, కాంగ్రెస్ ఆశలు

**బెంగళూరు, జూలై 21:** కర్ణాటక సంక్షోభానికి సోమవారంతో తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వాస పరీక్షను ఎదుర్కొంటామని ప్రభుత్వం స్పష్టం చేయగా.. చర్చను ఇక పొడిగించేది లేదని స్పీకర్ రమేశ్‌కుమార్ తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో సీఎం కుమారస్వామి భవితవ్యం సోమవారం తేలే అవకాశమున్నది. విశ్వాస తీర్మానంపై గురువారం నుంచి చర్చ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం కాంగ్రెస్, బీజేపీ వేర్వేరుగా శాసనసభాపక్ష సమావేశాలు నిర్వహించాయి. సోమవారం బలపరీక్ష సందర్భంగా అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాయి.

**సర్కార్‌కు గుణపాఠం చెప్తాం: రెబల్ ఎమ్మెల్యేలు**

రెబల్ ఎమ్మెల్యేలను బుజ్జగించే ప్రయత్నాలను సంకీర్ణ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. సీఎంను మార్చుతామని రాయబారం పంపినా రాజీనామాలపై వెనక్కి తగ్గేది లేదని వారు స్పష్టం చేశారు. ముంబైలోని ఓ హోటల్‌లో మకాం వేసిన కాంగ్రెస్, జేడీఎస్ అసంతృప్త ఎమ్మెల్యేలు ఆదివారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. డబ్బుల కోసం తాము ముంబైకి రాలేదని, కాంగ్రెస్-జేడీఎస్ వైఖరి పట్ల విసిగిపోయామని, ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకే ముంబైకి వచ్చినట్లు వెల్లడించారు. సోమవారం అసెంబ్లీకి హాజరుకాబోమన్నారు.

**సుప్రీంకోర్టుపైనే సీఎం ఆశలు**

సీఎం కుమారస్వామితోపాటు కాంగ్రెస్ నేతలు సుప్రీంకోర్టు స్పందనపైనే ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీ వ్యవహారాల్లో గవర్నర్ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం సుప్రీంకోర్టును వారు ఆశ్రయించిన సంగతి తెలిసిందే.



బెంగళూరులోని ఓ రిసార్ట్‌లో పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప

అలాగే విప్ జారీపైనా స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు బలపరీక్షపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది.

**ప్రభుత్వానికి నేడే చివరి రోజు: యడ్యూరప్ప**

సీఎం కుమారస్వామి ప్రభుత్వానికి సోమవారమే చివరి రోజని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప ఆదివారం మీడియాతో అన్నారు. స్పీకర్ రమేశ్ కుమార్, సీఎం కుమారస్వామి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కూడా బలపరీక్షను సోమవారం ఎదుర్కొంటామని చెప్పారని, దీంతో ఈరోజుతో అంతా ముగుస్తుందని తనకు వంద శాతం నమ్మకం ఉన్నదన్నారు. రాజీనామా చేసిన కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుపై బలవంతం చేయకూడదని సుప్రీంకోర్టు చెప్పడంతో ఆ పార్టీలు జారీ చేసిన విప్‌కు విలువ లేదన్నారు.

**ప్రభుత్వ పతనం ఖాయం?**

కాంగ్రెస్-జేడీఎస్‌కు 117 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో 16 మంది (కాంగ్రెస్-13 , జేడీఎస్-3) రాజీనామా చేశారు. రామలింగారెడ్డి మాత్రం ప్రభుత్వానికి మద్దతిస్తున్నారు. మిగతా 15 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించినా లేక వారు ఓటింగ్‌కు గైర్హాజరైనా.. సంకీర్ణ బలం 101కు పడిపోతుంది. ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతున్న బీజేపీ బలం 107గా ఉన్నది.

### ప్రభుత్వానికి మద్దతివ్వండి: మాయావతి

కుమారస్వామి ప్రభుత్వానికి మద్దతివ్వాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి కర్ణాటకలోని తమ ఒకగానొక పార్టీ ఎమ్మెల్యే ఎన్ మహేశ్‌కు సూచించారు. కాగా దీనికి ముందు పార్టీ అధిష్ఠానం నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో విశ్వాస పరీక్షపై సోమవారం జరిగే ఓటింగ్‌కు తాను దూరంగా ఉంటానని, సోమ, మంగళవారం అసెంబ్లీకి హాజరుకాబోనని మీడియాకు మహేశ్ వెల్లడించారు.

## ఇమ్రాన్‌కు చేదు అనుభవం

అమెరికాలో సొంత మంత్రులతోనే స్వాగతం

అధికారిక స్వాగతానికి ఒక్క అధికారినే పంపించిన అగ్రదేశం

**వాషింగ్టన్, జూలై 21:** మూడు రోజుల అమెరికా పర్యటన నిమిత్తం శనివారం అమెరికాకు చేరుకున్న పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆయనకు అధికారిక స్వాగతం పలికేందుకు అమెరికాకు చెందిన ఉన్నత స్థాయి అధికారులెవరూ హాజరు కాలేదు. ప్రొటోకాల్ పాటించేందుకు ఓ అధికారిని మాత్రమే అమెరికా పంపించింది. పాక్ విదేశాంగ శాఖ మంత్రి షా మహమూద్ ఖురేషీ, అమెరికాలో స్థిరపడిన కొందరు పాక్ పౌరులు మాత్రమే ఇమ్రాన్‌కు స్వాగతం పలికేందుకు వచ్చారు. ఈ పర్యటనలో పాక్ ప్రధాని వెంట ఆ దేశ విదేశాంగ కార్యదర్శి సోహైల్ మహమూద్, వాణిజ్య సలహాదారుడు అబ్దుల్ రజాక్ ఉన్నారు. అమెరికా అధ్యక్షుడి ఆహ్వానం మేరకు ఈనెల 22న శ్వేతసౌధంలో ట్రంప్‌తో ఇమ్రాన్ భేటీ కానున్నారు. అమెరికా ఇటీవల పాక్‌కు భద్రతా సాయాన్ని నిలిపివేసిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి ఈ సమావేశం సాయపడుతుందని పాక్ భావిస్తున్నది.



అమెరికా వచ్చిన పాక్ ప్రధాని ఇమ్రాన్‌కు స్వాగతం పలుకుతున్న పాక్ విదేశాంగ మంత్రి ఖురేషీ తదితరులు

## మళ్లీ రగిలిన హాంకాంగ్

ప్రజాస్వామ్య సంస్కరణలు, సార్వత్రిక ఓటుహక్కు కల్పించాలని డిమాండ్

చైనా కార్యాలయంపై గుడ్లతో దాడి

**హాంకాంగ్, జూలై 21:** హాంకాంగ్‌లో ఆదివారం మళ్లీ నిరసన జ్వాలలు చెలరేగాయి. ప్రజాస్వామ్య సంస్కరణలు, సార్వత్రిక ఓటుహక్కు కల్పించాలని కోరుతూ వేలాది మంది ప్రజలు వీధుల్లో భారీ ప్రదర్శన చేపట్టారు. నేరస్తుల అప్పగింత చట్టానికి(ఎక్స్‌ట్రడిషన్ లా) వ్యతిరేకంగా ఆందోళనకారులు తమ ఉద్యమాన్ని ఏడో వారాంతం కూడా కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీలు తీశారు. ర్యాలీ చివర్లో ముసుగును ధరించిన కొందరు ఆందోళనకారులు హాంకాంగ్‌లోని చైనా కార్యాలయంపై గుడ్లతో దాడి చేశారు. తమ చట్ట విధానాలు, హక్కులను చైనా కాలరాస్తున్నదని నినదించారు. నేరాలకు పాల్పడిన వారిని విచారణ నిమిత్తం చైనాకు అప్పగించే చట్టంపై గత రెండు నెలలుగా హాంకాంగ్‌లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో హాంకాంగ్ లెజిస్లేటివ్ కౌన్సిల్.. వివాదాస్పద బిల్లును తాత్కాలికంగా నిలుపుదల చేసింది. పూర్తిగా ఉపసంహరించకపోవడంపై నిరసనకారులు తమ ఆందోళనలను ఉధృతం చేశారు.



## అమెరికాలో హిందూ పూజారిపై దాడి

న్యూయార్క్‌లో ఘటన

**న్యూయార్క్:** అమెరికాలో హిందూ పూజారిపై ఒక ఆగంతకుడు విచక్షణారహితంగా దాడిచేశాడు. ఈ ఘటన న్యూయార్క్‌లోని ఫ్లోరల్ పార్క్‌లో జరిగింది. గురువారం ఉదయం గ్లెన్ ఓక్స్ ప్రాంతంలోని శివశక్తి పీఠం పూజారి స్వామి హరీశ్‌చందర్ పూరీ నడుచుకుంటూ వెళ్తుండగా ఒక దుండగుడు దాడికి పాల్పడ్డాడు. దీంతో పూజారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్టు అక్కడి హిందూ వర్గాలు తెలిపాయి. కాగా, పూజారిపై దాడికి పాల్పడిన సెర్జియో గువెయ (52) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. పూజారిపై దాడిని పలువురు ప్రజా ప్రతినిధులు ఖండించారు.

## కిలో టమాటా రూ.80!

**న్యూఢిల్లీ:** ఏ కూరలోనైనా టమాటా వేస్తే ఆ రుచే వేరు. తాజాగా టమాటా ధర కొండెక్కింది. దేశ రాజధాని ఢిల్లీలో మొన్నటి వరకు కిలో రూ.30 పలికిన టమాటా ఇప్పుడు రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతున్నది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గిందని, అందుకే ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్పారు.



## మెక్సికోలో కాల్పులు.. నలుగురు మృతి

**మెక్సికో:** మెక్సికోలోని అకాపుల్కో సిటీలో ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోగా, ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. అకాపుల్కో నగరంలోని ఓ బార్‌లోకి ఆదివారం ఉదయం ప్రవేశించిన ఆగంతకుడు తుపాకితో కాల్పులు జరిపినట్టు మెక్సికో అధికారులు తెలిపారు. బాధితులంతా అకాపుల్కో నగరవాసులేనని, సంఘటన స్థలం నుంచి 21 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు చెప్పారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి ప్రాంతంలోని మేడిబావిబస్తీలో కూలిన పాతమిద్దె కప్పు

## మిద్దెకూలి చిన్నారి మృతి

- తల్లికి తీవ్ర గాయాలు
- సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో ఘటన

**మెట్టుగూడ:** పురాతనమైన ఇంటి మిద్దె కూలడంతో తల్లి ఒడిలో నిద్రిస్తున్న 14 నెలలు బాలుడు కన్నుమూశాడు. సికింద్రాబాద్‌లోని చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. సీతాఫల్‌మండి డివిజన్‌లోని మేడిబావిబస్తీ వీరయ్యలైన్‌లో ఆర్ రాజు, భార్య స్వాతి, 14 నెలల కుమారుడు గీతాంశ్, తల్లి పుష్పమ్మ, తమ్ముడు రమేశ్‌తో కలిసి ఒకే ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రాజు ఇంటి దగ్గరలోనే బర్రెలను పెంచుతూ పాల వ్యాపారం చేస్తున్నాడు. తెల్లవారుజామున 6.15 గంటలకు కుమారుడితో కలిసి స్వాతి బెడ్‌రూంలో నిద్రిస్తుండగా ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపడింది. పెద్దశబ్దం రావడంతో బస్తీవాసులు అక్కడికి చేరుకొని శిథిలాల కింద చిక్కుకుపోయిన తల్లి, కొడుకును వెలికితీశారు. బాలుడిని స్థానిక ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. గాయపడిన తల్లి చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో పాలు పిండేందుకు రాజు, రమేశ్ బయటికెళ్లడం, కూతురు ఇంట్లో పడుకొనేందుకు రాజు తల్లి వెళ్లడంతోవారికి ప్రమాదం తప్పింది. మూడు గదుల ఇంట్లో రెండు స్లాబ్ కాగా, పడకగది మాత్రం డంగు సున్నంతో నిర్మించిన పాతకట్టడం. ఇంటి పక్కనే ఓ బిల్డర్ ఐదంతస్తుల భవనం నిర్మించాడు. క్యూరింగ్ నీళ్లు మిద్దెపై పడటంతో అది నాని కూలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పుట్టినరోజు వేడుకలో గీతాంశ్‌తో తల్లి స్వాతి (ఫైల్)

# ప్రగతిపథంలో భూపాలపల్లి

- ఫలిస్తున్న జిల్లాల పునర్విభజన
- రెండుసార్లు నీతి ఆయోగ్ ర్యాంకులు
- 93 శాతం భూ సమస్యల పరిష్కారం
- నేటినుంచి రైతుల చెంతనే భూ పరిష్కార వేదిక

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** అడవుల జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది. దేశంలోనే ప్రత్యేకతను చాటుకుంటున్నది. పరిపాలనా వికేంద్రీకరణ జరిగితే జిల్లాలు మరింత అభివృద్ధి చెందుతాయని భావించిన తెలంగాణ ప్రభుత్వం.. గతంలో ఉన్న 10 జిల్లాలను 33 జిల్లాలకు పెంచడం సత్ఫలితాలనిస్తున్నది. పరిపాలన చేరువై అభివృద్ధి ప్రజల దరికి చేరింది. కొత్త జిల్లాలు ప్రగతిపథంలో సాగుతున్నాయనేందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నది జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తర్వాత భూపాలపల్లి పరిస్థితి మారిపోయింది. విద్య, వైద్యం, పర్యావరణం, పరిశుభ్రత అంశాల్లో జిల్లా అధికార యంత్రాంగం జాతీయస్థాయిలో రికార్డులకెక్కుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా.. నీతి ఆయోగ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్‌లో రెండుసార్లు ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్నది. దేశవ్యాప్తంగా 115 వెనుకబడిన జిల్లాల్లో అభివృద్ధిపై నీతి ఆయోగ్ చేసిన సర్వేలో 2019 మార్చిలో భూపాలపల్లికి మొదటి ర్యాంకు వచ్చింది. విద్య, వైద్యం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆర్థిక సేవలు ఇలా చాలా అంశాల్లో భూపాలపల్లి అగ్రస్థానంలో నిలిచింది. దీనికి బహుమానంగా జిల్లాకు నీతి ఆయోగ్ రూ.30 కోట్లు మంజూరు చేసింది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యా ప్రగతికి కృషి చేస్తుండటంతో దేశవ్యాప్తంగా నాలుగోస్థానంలో నిలిచింది.





భూపాలపల్లిని సంపూర్ణ బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి, కలెక్టర్ వెంకటేశ్వర్లు (ఫైల్)

**భూ సమస్యల పరిష్కారంలో ముందంజ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భాగంగా ఉన్న జయశంకర్ భూపాలపల్లి కొత్త జిల్లాగా మారడంతో జిల్లా కలెక్టరు ప్రతి గ్రామానికి వెళ్లి స్వయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పర్యవేక్షించగలిగారు. ప్రస్తుత కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ప్రజల చెంతకే పరిపాలనకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భూ సమస్యలు పరిష్కరించడంలో కలెక్టర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 93 శాతం భూ సమస్యలను పరిష్కరించిన జిల్లాగా భూపాలపల్లి ముందువరుసలో ఉన్నది. మిగిలిన సమస్యలను పరిష్కరించడానికి సోమవారం నుంచి జిల్లా, మండల రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో రైతుల చెంతకే వెళ్లి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అత్యధికశాతం అడవులున్న ఈ జిల్లాలో ఎకో-టూరిజం నంబర్ వన్‌గా ఉన్నది. రామప్ప దేవాలయం, మహదేవ్‌పూర్, పాండవుల గుట్ట, కాళేశ్వరం ప్రాజెక్ట్, కాళేశ్వరం ముక్తివనం, ప్రతాపగిరి కోటలు, మైలారం, కాపురం గుట్టలు ఇలా వారసత్వ, సాంస్కృతిక కట్టడాలు పర్యాటకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**వందశాతం ఓడీఎఫ్ జిల్లాగా భూపాలపల్లి**

భూపాలపల్లి జిల్లాలో 85,244 మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం ద్వారా బహిరంగ విసర్జన లేని పరిశుభ్ర జిల్లాగా మారింది. ఓపెన్ డిఫకేషన్ ఫ్రీ (ఓడీఎఫ్) జిల్లాగా అధికారులు సైతం ప్రకటించారు. ఓడీఎఫ్‌లో భాగంగా కలెక్టర్ స్వయంగా గోరికొత్తపల్లిలో మరుగుదొడ్డి నిర్మాణ పనుల్లో పాల్గొనడం విశేషం. వచ్చే నీతి ఆయోగ్ సర్వేలో జిల్లా దేశంలోనే తిరిగి మొదటిస్థానంలో నిలుస్తుందని కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు విశ్వాసం వ్యక్తంచేశారు.

### వర్షాభావంతో చేపపిల్లల పంపిణీ ఆలస్యం

- ఈ ఏడాది 80.69 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్షాభావ పరిస్థితులతో నీరులేక చెరువులు వెలవెలబోతున్నాయి. చెరువులు నిండనిదే చేపపిల్లలు వేయడం కుదరదని మత్స్యశాఖ వర్గాలు చెప్తున్నాయి. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో జూన్‌లో 385 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూలై మూడోవారం ముగుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. దీంతో జూలై ఆఖరున లేదా ఆగస్టు మొదటివారంలో చేపపిల్లల పంపిణీ మొదలుపెట్టగలమని మత్స్యశాఖ అధికారులు భావిస్తున్నారు. గతేడాది కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు లేక నిర్దేశించిన మొత్తంలో చేపపిల్లలు పంపిణీ చేయలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 21,569 చెరువులు, రిజర్వాయర్లలో 75 కోట్ల చేపపిల్లలు వేయాలనేది లక్ష్యంగా కాగా.. 10,776 నీటివనరుల్లో 52.35 కోట్లు మాత్రమే వేయగలిగారు. ఈ సారి 21,569 జలవనరుల్లో 80.69 కోట్ల పిల్లలు వేయాలన్నది లక్ష్యం.

**అదునుదాటితే ఎదగడం కష్టం**

ఆగస్టుతో అదును దాటిపోతుందని, అప్పుడిక చెరువుల్లో చేపపిల్లల్ని వేసినా ఎదిగేందుకువాతావరణం అనుకూలించదని మత్స్యకారులు వాపోతున్నారు. నిర్దేశించిన మేరకు చేపపిల్లలు వదిలేందుకు సన్నద్ధంఅవుతున్నామని మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు.

### హోదాపై జగన్ వైఖరి సరికాదు: పురందేశ్వరి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఖరిని బీజేపీ నేత పురందేశ్వరి తప్పుపట్టారు. హోదా సాధ్యంకాదని కేంద్రం ప్రకటించినా ప్రజలను మోసంచేయడం సరికాదన్నారు. ఏపీలోని తెనాలిలో ఆమె మాట్లాడుతూ.. పలువురు నేతలు బీజేపీలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

# నిర్లక్ష్యానికి రూ.8 లక్షలు పరిహారం!

- నిరుపేదకు అండగా నిలిచిన వినియోగదారుల సహాయ కేంద్రం
- పైసా ఖర్చులేకుండా కేవలం ఇరవైరోజుల్లోనే కేసు పరిష్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రోగం నయం చేయాల్సిన వైద్యుడు చూపిన నిర్లక్ష్యం రోగి ప్రాణాల మీదికివచ్చింది. ఉన్న ఆస్తితోపాటు ఉద్యోగం పోయింది. దీంతో తనకు అన్యాయం జరిగిందని ఆశ్రయించిన బాధితుడికి పౌరసరఫరాలశాఖ- వినియోగదారుల సహాయ కేంద్రం అండగా నిలిచి రూ.8 లక్షల నష్టపరిహారం ఇప్పించింది. బాధితుడు రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపెల్లి గ్రామానికి చెందిన పీ దేవయ్య (31)కు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ ఆదివారం చెక్కును అందజేశారు. దేవయ్య యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నారు. కొంతకాలం జాతీయ పోలీసు అకాడమీలో పనిచేసిన ఆయన, యోగాలో అంతర్జాతీయ కాంస్య పతకాన్ని సాధించారు. కుటుంబ బాధ్యతలను తనపై వేసుకొని యోగ శిక్షకుడిగా పనిచేస్తున్న సమయంలో దేవయ్య పైల్స్‌వ్యాధికి గురయ్యారు. 2018 ఫిబ్రవరి 24న సికింద్రాబాద్‌లోని పైల్స్ క్లినిక్‌లో రూ.25 వేల ప్యాకేజీతో లేజర్ ట్రీట్‌మెంట్ చేయించుకున్నారు. ఆపరేషన్ అయిన మూడు గంటల తర్వాత డిశ్చార్జి చేశాక తీవ్రమైన రక్తస్రావం జరగటం ప్రారంభమైంది. మరుసటిరోజు అదే క్లినిక్‌లో సంప్రదించగా హాస్పిటల్ నిర్వాహకులు యశోద హాస్పిటల్‌కు వెళ్లాలని రిఫర్ చేశారు. చికిత్సకు పెద్దమొత్తం డబ్బు అవసరమని డాక్టర్లు చెప్పడంతో దేవయ్య కుటుంబ సభ్యులు, సన్నిహితులు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని సహాయం అందించాలని వేడుకున్నారు. దీనిపై తక్షణం స్పందించిన కేటీఆర్ చికిత్సకు అవసరమైన రూ.5.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించారు. దేవయ్య చికిత్సకు మరింత సమయం పట్టడంతో వైద్యఖర్చులు కూడా పెరిగాయి. దాదాపు నెలన్నర చికిత్సకు దేవయ్యకు మొత్తం రూ.18లక్షలు ఖర్చుకావడంతో తన భూమిని అమ్మి, అప్పులు చేసి బిల్లులు చెల్లించారు. దేవయ్య తనకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటానికి దిగారు. తెలంగాణ వినియోగదారుల సహాయ కేంద్రాన్ని 29 జూన్ 2019 నాడు ఆశ్రయించారు. జరిగిన అన్యాయంపై స్పందించిన సహాయ కేంద్రం హాస్పిటల్ యాజమన్యానికి నోటీసులు జారీచేసి 20 రోజుల్లో కేసును పరిష్కరించి రూ.8 లక్షల నష్టపరిహారం ఇప్పించింది. వస్తు, సేవల్లో అన్యాయం జరిగితే వినియోగదారుల రిడ్రెసెల్ సెల్ టోల్‌ఫ్రీ నంబర్ 180042500333 లేదా consumerInformation Redressal Centre, ట్విట్టర్ Telangana Consumer Info and Redressal Center, www.consumeradvice.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

### న్యాయం జరిగింది

హాస్పిటల్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో పైల్స్ ఆపరేషన్ వికటించి, తీవ్ర అనారోగ్యానికి గురై, ఉపాధి కోల్పోయిన నాకు ఒకవైపు కేటీఆర్, మరోవైపు వినియోగదారుల సహాయం కేంద్రం అండగా నిలవడంతో న్యాయం జరిగింది. సహాయ కేంద్రాన్ని జూన్ 29న సంప్రదించగా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 20 రోజుల్లేనే సమస్యను పరిష్కరించి, రూ.8 లక్షల నష్టపరిహారం ఇప్పించారు. ఉపాధి కోల్పోయి కష్టాల్లో ఉన్న నాకు అండగానిలిచిన కేటీఆర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్‌కు రుణపడి ఉంటాను.

**-బాధితుడు దేవయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా**

# రైతుబీమా పొడిగింపు!

మొదటిపేజీ తరువాయి...

సంబంధించి ప్రీమియం రేటు ఎల్ఐసీ కొంతమేర పెంచే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. గతేడాది ఆగస్టులో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తన జీవితంలో చేస్తున్న అతి గొప్ప పని రైతుబీమా పథకమని చెప్పారు. 2018 ఆగస్టు 14వ తేదీ నుంచి ఈ పథకం అమలులోకి వచ్చింది. దీనిప్రకారం 18 ఏండ్ల నుంచి 60 ఏండ్లలోపు పట్టాదారు రైతులు 30.05 లక్షల మంది బీమా పరిధిలోకి వచ్చారు. ఒక్కొక్క రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,271.50 చొప్పున ప్రీమియం చెల్లించింది. ఈ మేరకు ఎల్ఐసీతో ఏడాదికి ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఇందుకుగాను వ్యవసాయ శాఖ ఎల్ఐసీకి రూ.681.45 కోట్లు చెల్లించింది. ఈ పథకం ఒప్పందం ప్రకారం కొత్తగా పట్టాదారులైన రైతుల్ని కూడా బీమా పరిధిలో చేర్చుకుంటారు. ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. మరణించిన రైతు కుటుంబానికి ఎల్ఐసీ రూ.5 లక్షల బీమా చెల్లించడం మాత్రమే చేస్తుంది. అర్హులైన రైతుల నమోదు, వారు మరణిస్తే అందుకు సంబంధించిన ధ్రువపత్రాలన్నింటినీ క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయ విస్తరణ అధికారులే సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైతుబీమా పథకం ప్రారంభించిన నాటినుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో మృతిచెందిన 13,172 మంది రైతుల కుటుంబాలకు రూ. 658.60 కోట్లు పరిహారం ఇచ్చారు. ఇందులో ఎకరం నుంచి రెండెకరాలలోపు ఉన్న చిన్న, మధ్య తరగతి రైతులు 91 శాతం మంది ఉన్నారు. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు చెందినవారే 83 శాతం మంది ఉన్నారు. కాగా, ఎల్ఐసీకి ప్రభుత్వం నుంచి ప్రీమియం రూపేణా రూ. 681.45 కోట్లు చెల్లించగా.. ఇప్పటివరకు ఎల్ఐసీ పరిహారం కింద రైతు కుటుంబాలకు అందించిన మొత్తం రూ. 658.60 కోట్లుగా ఉన్నది.

### బాబు కోటరీలో వణుకు

- జ్యుడిషియల్ కమిటీ ఏర్పాటు నిర్ణయంతో ఎస్కేప్ బాట
- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎద్దేవా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అవినీతిరహిత పాలన కోసం జ్యుడిషియల్ కమిటీ ఏర్పాటుచేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించడంతో చంద్రబాబు కోటరీలో వణుకు మొదలైందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ట్విట్టర్ వేదికగా బాబుపై విజయసాయిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు కురిపించారు. 'జ్యుడిషియల్ కమిషన్, రివర్స్ టెండరింగ్, విద్యుత్ పీపీఏలపై సమీక్ష వంటి నిర్ణయాలతో చంద్రబాబు, ఆయన కోటరీకి వెన్నులో వణుకు మొదలైంది. రూపాయి కూడా అవినీతి జరుగలేదని వారికివారే సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారు. కొందరు పార్టీ మారి ఎస్కేప్ రూట్ పట్టారు. ఏం చేసినా తప్పించుకోలేరు' అని పేర్కొన్నారు.

## ఇంధన నౌకను విడుదల చేయండి!

ఇరాన్‌ను కోరిన బ్రిటన్.. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు పెంచొద్దని హితవు




**లండన్/టెహ్రాన్:** ఇరాన్ అదుపులో ఉన్న తమ ఇంధన నౌకను వెంటనే విడుదల చేయాలని బ్రిటన్ కోరింది. తమ ఇంధన నౌకను సీజ్ చేయడం ఆమోదయోగ్యం కాదని, ఈ అంశంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెంచొద్దని హితవు పలికింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న బ్రిటన్ 'స్టెనా ఇంపెరో' అనే ఇంధన నౌకను శుక్రవారం ఇరాన్ అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నౌకలో 23 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 18 మంది భారతీయులు, మిగతావారిలో రష్యా, ఫిలిప్పీన్స్, లాత్వియా తదితర దేశాల వారు ఉన్నారు. ఇరాన్ సీజ్ చేసిన నౌకను విడిపించడానికి పలు మార్గాలను పరిశీలిస్తున్నట్లు బ్రిటన్ రక్షణ మంత్రి టోబిస్ ఎల్‌వుడ్ ఆదివారం తెలిపారు.

## పాపమా... శాపమా!

ఆడబిడ్డ పుట్టని 132 పల్లెలు.. మూడు నెలలుగా ఇదే దౌర్భాగ్యం

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో వెలుగుచూసిన నివేదిక



**ఉత్తరకాశీ:** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని 132 పల్లెల్లో మూడు నెలలుగా ఒక్క బాలిక కూడా జన్మించలేదని ప్రభుత్వ రికార్డులు తెలిపాయి. ఈ పల్లెల్లో గత మూడు నెలల్లో 216 మంది పిల్లలు పుట్టినా ఒక్క బాలిక కూడా లేదు. దీనిపై ఉత్తరకాశీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆశీష్ చౌహాన్.. ఆశావర్కర్లతో అత్యవసరంగా భేటీ అయ్యారు. ఈ పల్లెల్లో నిఘా పెంచి, బాల బాలికా శిశువుల నిష్పత్తిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ గ్రామాల్లో బాలికా శిశువుల గర్భస్రావమే కారణమని సామాజిక కార్యకర్త కల్పనా ఠాకూర్ ఆరోపించారు. ఇది యాదృచ్ఛిక ఘటన కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఏమీ పట్టించుకోవడం లేదన్నారు.



■ పోర్చుగల్‌లో కార్చిచ్చు

**పోర్చుగల్** రాజధాని లిస్బన్‌కు ఉత్తరంగా 200 కి. మీ. దూరంలోని కాస్టెలో బ్రాంకో పర్వత ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. మంటలను అదుపు చేసేందుకు 400 అగ్నిమాపక వాహనాలు, సైనిక విమానాలు, హెలికాప్టర్ల సాయంతో 1300 మంది అగ్నిమాపక సిబ్బంది ఆదివారం తీవ్రంగా శ్రమించారు. దాదాపు 25 కి. మీ. విస్తీర్ణంలో కార్చిచ్చు వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 20 మంది గాయపడ్డారు. వీరిలో 8 మంది అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు. 2017లో ఇదే ప్రాంతంలో బడబాగ్ని రేగడంతో 100 మంది చనిపోయారు.



ఢిల్లీ వీధుల్లో కొనసాగిన షీలాదీక్షిత్ అంతిమయాత్ర

## అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

ఢిల్లీ మాజీ సీఎం షీలాదీక్షిత్‌ను కడసారి చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

అంత్యక్రియలకు హాజరైన సోనియా, ప్రియాంక, అమిత్ షా, కేజ్రీవాల్

కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నివాళులర్పించిన మాజీ ప్రధాని మన్మోహన్

**న్యూఢిల్లీ, జూలై 21:** ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య అధికార లాంఛనాలతో జరిగాయి. ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నా తమ ప్రియతమ నేతకు కడసారి వీడ్కోలు పలికేందుకు భారీగా ఢిల్లీవాసులు తరలివచ్చారు. ఆమె సేవలను గుర్తుచేసుకుంటూ శోకసంద్రంలో మునిగిపోయారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరులు కూడా అంత్యక్రియలకు హాజరయ్యారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్న షీలాదీక్షిత్‌కు గుండెపోటు రావడంతో శనివారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆదివారం నిజాముద్దీన్ ఈస్ట్‌లోని షీలాదీక్షిత్ ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర నేరుగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. అప్పటికే అక్కడికి భారీగా చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. 'సూర్యచంద్రులు ఉన్నంతకాలం షీలా పేరు నిలిచిపోతుంది' అని నినదించారు. అనంతరం ఆమె పార్థివదేహానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సీఎంలు అశోక్‌గెహ్లాట్, కమల్‌నాథ్ నివాళులర్పించారు. తర్వాత ఆమె పార్థివ దేహాన్ని ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలోనే ఆమె మరణించడంతో ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. అనంతరం అంతిమయాత్ర నిగామ్‌బోధ్ ఘాట్ వరకు కొనసాగింది. అక్కడ దహనసంస్కారాలు నిర్వహించారు. షీలాదీక్షిత్ గౌరవార్థం ఢిల్లీ ప్రభుత్వం రెండు రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది. నివాళులర్పించిన వారిలో బీజేపీ సీనియర్ నేతలు అద్వానీ, సుష్మాస్వరాజ్, కాంగ్రెస్ నేత అహ్మద్‌పటేల్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తదితరులు కూడా ఉన్నారు.

**షీలా నాకు అక్కలాంటివారు: సోనియా**

సోనియాగాంధీ మాట్లాడుతూ షీలాదీక్షిత్ తనకు అక్కలాంటివారని, కష్టసమయంలో తనకు అండగా నిలిచారని తెలిపారు. ఆమె మరణించడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ.. షీలాదీక్షిత్ కుమారుడు సందీప్‌దీక్షిత్‌కు ఫోన్ చేసి మాట్లాడారు.

# నేడే చంద్రయాన్-2

## ప్రయోగానికి సర్వం సిద్ధం

మధ్యాహ్నం 2.43 గంటలకు నింగిలోకి జీఎస్‌ఎల్వీ మార్క్-3

ఆదివారం సాయంత్రం 6.43 గంటలకు మొదలైన కౌంట్‌డౌన్




షార్‌లో ప్రయోగవేదికపై సిద్ధంగా ఉన్న జీఎస్‌ఎల్వీ మార్క్-3

**న్యూఢిల్లీ, జూలై 21:**

చంద్రయాన్-2 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. నెల్లూరు జిల్లా సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోని (షార్‌లోని) రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం మధ్యాహ్నం 2.43 గంటలకు చంద్రయాన్-2ను ప్రయోగించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇస్రో 'బాహుబలి'గా పిలిచే జీఎస్‌ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపడతారు. ఇందుకోసం ఆదివారం సాయంత్రం 6:43 గంటలకు 20 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఇస్రో తెలిపింది. ఈ నెల 15వ తేదీ వేకువజామునే చంద్రయాన్-2ను ప్రయోగించాలని భావించినా, చివరి నిమిషంలో సాంకేతిక సమస్యను గుర్తించడంతో వాయిదా పడిన విషయం తెలిసిందే. సాంకేతిక సమస్యను సరిచేశామని, ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇస్రో చైర్మన్ కే శివన్ ఆదివారం చెప్పారు. లాంచింగ్ రిహార్సల్స్‌నూ విజయవంతంగా పూర్తిచేసినట్లు చెప్పారు. 43.43 మీటర్ల ఎత్తైన జీఎస్‌ఎల్వీ మార్క్-3 రాకెట్.. ప్రయోగించిన 16 నిమిషాల తర్వాత స్పేస్ క్రాఫ్ట్‌ను భూకక్ష్యలోకి ప్రవేశపెడుతుందన్నారు. పైకెగసిన తర్వాత చంద్రయాన్-2కు 15 కీలక దశలను చేపట్టాలని, సెప్టెంబర్ మొదటి వారంలో ల్యాండర్ చంద్రుడిపై దిగే అవకాశం ఉందన్నారు. ఇంతకుముందెన్నడూ ఏ దేశమూ చేరని చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ల్యాండర్‌ను మృదువుగా దింపనున్నట్లు చెప్పారు.

**దక్షిణ ధ్రువ ప్రాంతంలో పరిశోధనలు..**

ఇస్రో రూ.978 కోట్ల వ్యయంతో చంద్రయాన్-2 మిషన్‌ను చేపడుతున్నది. 2008లో విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్-1కు ఇది కొనసాగింపు. చంద్రయాన్-1 ద్వారా జాబిల్లిపై నీటి జాడలను గుర్తించిన సంగతి తెలిసిందే. చంద్రయాన్-2 బరువు సుమారు 3.8 టన్నులు. ఇందులో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ ఉంటాయి. ఇంతకుముందు ఏ దేశమూ చేరని చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఇస్రో ల్యాండర్, రోవర్‌ను దించబోతున్నది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ సాగించిన నాలుగో దేశంగా భారత్ రికార్డు సృష్టించనున్నది. ఇంతకుముందు అమెరికా, రష్యా, చైనా మాత్రమే ఈ ఘనత సాధించాయి. చంద్రయాన్‌లోని ఆర్బిటార్ ఏడాది పనిచేస్తుంది. చంద్రుడి ఉపరితలంపై దిగే ల్యాండర్ (విక్రమ్), రోవర్ (ప్రజ్ఞ) 14 రోజులు పనిచేస్తాయి. చంద్రుడి దక్షిణ ధ్రువంలో దిగి.. నీరు, హీలియం-3 జాడను గుర్తించడం చంద్రయాన్-2 ప్రధాన లక్ష్యాలు. ప్రయోగించిన 16.20 నిమిషాల తర్వాత జీఎస్‌ఎల్వీ రాకెట్ చంద్రయాన్-2ను భూమికి 170 కి.మీ ఎత్తులోని కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. తదుపరి 48 రోజులు శాస్త్రవేత్తలు వివిధ దశలను నిర్వహించనున్నారు. లాంచింగ్‌ను రీషెడ్యూల్‌ను చేసిన ఇస్రో.. ఎర్త్ బౌండ్ ఫేజ్‌ను తొలుత నిర్ణయించిన 17 రోజులకు బదులుగా 23 రోజులకు పెంచింది. ఈ ఫేజ్ చివరిలో చంద్రయాన్-2 కక్ష్యను 1.05 లక్షల కి.మీ.లకు పెంచుతారు. అనంతరం క్రమంగా చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెడుతారు. ఆ తర్వాత కొద్ది రోజులకు చంద్రుడికి 100 కి.మీ. ఎత్తున వృత్తాకార కక్ష్యలోకి చేరుస్తారు. పలుమార్లు పరిభ్రమించిన అనంతరం సరైన సమయంలో చంద్రయాన్-2 ల్యాండర్‌ను చంద్రుడిపైకి జారవిడుస్తుంది. మిషన్‌లో ఈ దశే అత్యంత సంక్లిష్టమైనది. దీనికి 15 నిమిషాలు సమయం పడుతుంది. సెప్టెంబర్ 6-8 మధ్యలో ఈ దశను చేపట్టే అవకాశం ఉంది.

### ఇస్రోకూ రాహుకాలం!

ఇతర గ్రహాలపైకి రాకెట్లను, ఉపగ్రహాలను పంపే ఇస్రో శాస్త్రవేత్తలూ తమ విశ్వాసాలు, మూఢ నమ్మకాలను అనుసరిస్తుంటారని ఇస్రో విశ్రాంత అధికారి ఒకరు తెలిపారు. రాకెట్ ప్రయోగానికి రాహు కాలంలో ఎన్నడూ కౌంట్‌డౌన్ ప్రారంభించరన్నారు. ఏదైనా పని ప్రారంభించడానికి రాహు కాలాన్ని అశుభప్రదంగా పరిగణించడం తెలిసిందే. 'గ్రహాంతర ప్రయోగాల విషయమై రాకెట్ లాంచింగ్ సమయానికి శుభ సమయం కూడా తోడవ్వడం కుదరని పని. వ్యోమనౌక.. లక్షిత గ్రహ కక్ష్యలోకి చేరబోయే సమయానికి ఆ గ్రహం ఉండే స్థితిని బట్టి ప్రయోగ సమయాన్ని నిర్ణయిస్తారు. కాబట్టి, కౌంట్‌డౌన్‌ను మాత్రం శుభ సమయంలో ప్రారంభిస్తారు' అని ఆ అధికారి వివరించారు. అలాగే ప్రయోగానికి ముందు ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ నమూనాను తిరుమల శ్రీవారి పాదాల చెంత ఉంచి, స్వామివారి ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీ. మరోవైపు రాకెట్ లాంచింగ్ నాడు ప్రాజెక్ట్ డైరెక్టర్ కొత్త షర్ట్‌ను ధరిస్తుంటారని రిటైర్డ్ రాకెట్ సైంటిస్ట్ ఒకరు తెలిపారు. మరో ఆసక్తికర విషయం ఏమిటంటే ఇస్రో కూడా 13వ నంబర్‌ను అశుభంగా భావించడం. పీఎస్‌ఎల్వీ సీ-12 తర్వాత తదుపరి ప్రయోగానికి పీఎస్‌ఎల్వీ సీ-13 అని కాక పీఎస్‌ఎల్వీ సీ-14 అని ఇస్రో పేరు పెట్టడం గమనార్హం. మరోవైపు, చంద్రుడిపైకి ప్రయోగించిన అపోల్-13 మిషన్ విఫలం కావడంతో.. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా కూడా మరే మిషన్‌కూ ఆ నంబర్‌తో పేరు పెట్టలేదు. గతంలో మంగళవారం ఎలాంటి ప్రయోగాలు చేపట్టని ఇస్రో, మంగళయాన్ ప్రయోగంతో ఆ సంప్రదాయం బ్రేక్ చేసింది. 'ఇస్రో చరిత్రలో మంగళవారం ప్రయోగం చేపట్టడం అదే తొలిసారి. సాధారణంగా మంగళవారాన్ని అశుభదినంగా భావిస్తారు' అని ఓ ఇస్రో అధికారి పేర్కొన్నారు.

### చంద్రయాన్ వీక్షణకు భారీ గ్యాలరీ..

చంద్రయాన్-2 ప్రయోగం వీక్షించేందుకు సందర్శకుల కోసం భారీ గ్యాలరీ సిద్ధం చేశారు. ప్రయోగ వేదికకు సమీప శబరి గిరిజన కాలనీలో సుమారు 60 ఎకరాల అటవీ భూమిలో దీన్ని నిర్మించారు. సుమారు 5 వేల మంది రాకెట్ ప్రయోగాన్ని వీక్షించవచ్చు. ఈ నెల 15న ప్రయోగం వాయిదా పడడంతో రాకెట్ లాంచింగ్‌ను చూడాలనుకున్న వారికి నిరాశే మిగిలింది. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు తమ సీరియల్ నంబర్లతో పాసులు తీసుకుని ప్రయోగాన్ని వీక్షించొచ్చని ఇస్రో తెలిపింది.

## లైంగికదాడి జరిగిందంటూ 32 ఏండ్లకు ఫిర్యాదు

మధ్యప్రదేశ్‌లో ఘటన

**భోపాల్, జూలై 21:** తనపై లైంగికదాడి జరిగిందని ఆరోపిస్తూ రాజస్థాన్‌కు చెందిన ఓ మహిళ 32 ఏండ్ల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతేడాది జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జావొరా నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన డాక్టర్ హమీర్‌సింగ్ రాథోడ్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. 1987లో తమ బంధువుల ఇంట్లో జరిగిన ఓ పెండ్లికి తాను వెళ్లానని, ఈ పెండ్లికి హాజరైన రాథోడ్ తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని చెప్పారు. రాథోడ్ తమకు దూర బంధువు అవుతాడని, ఈ నేపథ్యంలో విషయాన్ని బయటికి చెప్పకుండా కుటుంబసభ్యులు తనను బెదిరించారని తెలిపారు. తర్వాత తనకు పెండ్లి అయ్యిందన్నారు. అయితే తనపై జరిగిన లైంగికదాడి విషయం తెలిసి ఇటీవల తన భర్త విడాకులు ఇచ్చారని చెప్పారు. ఫిర్యాదు చేయడానికి రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్‌కు వచ్చానని తెలిపారు. మరోవైపు ఈ ఆరోపణలను రాథోడ్ తోసిపుచ్చారు. తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఆమెపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. పోలీసులు మాట్లాడుతూ సదరు మహిళ ఆరోపణలపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## హిస్టరీ కాదు.. మిస్టరీ

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై మమత వ్యాఖ్య

డబ్బు, పోలీసు బలం, ఈవీఎంలతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధికి బీజేపీ ఎత్తు

కేంద్ర దర్యాప్తు సంస్థలతో తృణమూల్ ప్రజాప్రతినిధులకు బెదిరింపులు

ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల జమ సంగతేమిటని నిలదీసిన బెంగాల్ సీఎం



ఆదివారం కోల్‌కతాలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న మమత

**కోల్‌కతా, జూలై 21:** బీజేపీ, ఆరెస్సెస్‌లపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ నిప్పులు చెరిగారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలు ఒక మిస్టరీ తప్ప హిస్టరీ (చరిత్ర) కాదన్నారు. డబ్బు, పోలీసులు, ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లతో 2021 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలువాలని బీజేపీ భావిస్తున్నదని ఆరోపించారు. 1993 పోలీసు కాల్పుల మృత వీరుల సంస్మరణార్థం ఆదివారం కోల్‌కతాలో నిర్వహించిన భారీ సభలో మమతాబెనర్జీ మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థలతో తృణమూల్ ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహిస్తున్నదన్నారు. తృణమూల్ కాంగ్రెస్ శ్రేణులు ప్రజల వద్ద వసూలు చేసిన 'కట్‌మనీ' చెల్లించాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ.. 2014 ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని మమతాబెనర్జీ సవాల్ చేశారు. ఇందుకోసం ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్త నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు చెప్పారు. బ్యాలెట్ బాక్సులతో ఎన్నికలు జరుపాలని మరోసారి డిమాండ్ చేశారు. బెదిరిస్తూ, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని బీజేపీపై మండిపడ్డారు. కర్ణాటకలో మాదిరిగా పార్టీ మారితే రూ.2 కోట్ల నగదుతోపాటు ఒక పెట్రోల్ పంప్ కాంట్రాక్ట్ ఇస్తామని తమ పార్టీ ఎమ్మెల్యేలతో బీజేపీ బేరసారాలు జరుపుతున్నదని ఆరోపించారు. ఒకవేళ బీజేపీతో సంబంధాలు తెంచుకుంటే చిట్‌ఫండ్ కుంభకోణ కేసుల్లో జైలుపాలవుతారని కేంద్ర దర్యాప్తు సంస్థలు బెదిరింపులకు దిగుతున్నాయన్నారు. బీజేపీలో చేరిన వారంతా సీపీఎం, కాంగ్రెస్ పార్టీలచే తిరస్కరణకు గురైన పరాన్నభుక్తులని అభివర్ణించారు. గతంలో తమ ప్రభుత్వ తప్పిదాలను క్షమించాలని ప్రజలను కోరారు. 'బీజేపీ చేసిన పోరాటమేమిటి? వారెవ్వరు? బెంగాల్‌లో ఎవరికీ తెలియదు. ఆరెస్సెస్ మకిలీ రాజకీయాలు మాత్రమే తెలుసు. ఆరెస్సెస్ కార్యక్రమాలను పర్యవేక్షించాలని పోలీసులను బీహార్ ప్రభుత్వం ఆదేశించింది. మేం అలా పోలీసులను ఆదేశించం. పోలీసులు అప్రమత్తంగా ఉండాలి' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. ప్రజల నుంచి తృణమూల్ కార్యకర్తలు వసూలుచేసిన 'కట్‌మనీ' తిరిగి చెల్లించాలన్న బీజేపీ డిమాండ్‌పై ఆమె స్పందిస్తూ.. 'కట్‌మనీ ఇచ్చేయాలని తృణమూల్‌ను మీరు అడుగుతున్నారా? ముందు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమచేయగలరా?' అని ప్రశ్నించారు.

### ఆ సీబీఐ అధికారుల పేర్లు చెప్పగలరా?

మమతాబెనర్జీ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ మండిపడింది. బీజేపీలో చేరాలని తృణమూల్ నేతలను బెదిరిస్తున్న సీబీఐ అధికారుల్లో ఒక్కరి పేరైనా చెప్పగలరా? అని పశ్చిమబెంగాల్ బీజేపీ శాఖ అధ్యక్షుడు దిలీప్‌ఘోష్ సవాల్ చేశారు. ఒకవేళ అలా చెప్పలేకపోతే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.

## ఏనుగుల మృత్యు ఘోష!

కౌండిన్య అభయారణ్యంలో వరుసగా చనిపోతున్న ఏనుగులు



పలమనేరు సమీపంలో మృతిచెందిన పిల్ల ఏనుగు

**పలమనేరు(ఏపీ):** చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో ఓ పిల్ల ఏనుగు (5) ఆదివారం మరణించింది. కౌండిన్య అభయారణ్యం పరిధిలో ఆహారం కోసం వెతుకుతూ ఈ ఏనుగు మృత్యువాత పడినట్టు అధికారులు తెలిపారు. ఇదే అభయారణ్య పరిధిలో వారం క్రితం మగ ఏనుగు లైంగిక దాడిలో ఓ ఆడ ఏనుగు చనిపోయింది. కొన్ని వారాలుగా ఏనుగుల వరుస మరణాలు కలకలం సృష్టిస్తున్నాయి. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సంఖ్య 42 నుంచి 36కు తగ్గింది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తమ సరిహద్దుల్లో కందకాలు తవ్వాయి. 'పిల్ల ఏనుగులు అడవిలో ఎక్కువగా సంచరించాలనుకుంటాయి. కందకాలు, విద్యుత్ తీగలు, పారిశ్రామికీకరణ, ఆహారం కొరతతో అవి మరణిస్తున్నాయి' అని ఓ అటవీ శాఖ అధికారి తెలిపారు. ఆహారం కోసం ఏనుగులు గ్రామాలకొచ్చి మరణించకుండా రూ. 2 లక్షల ఖరీదు చేసే ఈ కాలర్‌ను ఏనుగుల సమూహానికి నాయకత్వం వహించే ఏనుగుకు పెడితే వాటి గమనాన్ని ఎప్పటికప్పుడు గుర్తించి, దారి మళ్లించొచ్చు. కానీ మా వద్ద సరిపడా రేడియో కాలర్స్ లేవు' అని పేర్కొన్నారు.

## పాక్‌లో రెచ్చిపోయిన టీటీపీ ఉగ్రవాదులు

తొలుత పోలీసులపై కాల్పులు ■ దవాఖానలో ఆత్మాహుతి దాడి

తొమ్మిది మంది దుర్మరణం ■ 40 మంది వరకు గాయాలు

**పెషావర్:** పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంవా రాష్ట్రం డేరా ఇస్మాల్‌ఖాన్ జిల్లా పరిధిలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ఉగ్రదాడుల్లో ఆరుగురు పోలీసులు సహా 9 మంది దుర్మరణం చెందారు. మరో 40 మంది వరకు గాయపడ్డారు. కోట్ల సైదన్ చెక్‌పోస్ట్ వద్దకు రెండు బైకులపై గుర్తుతెలియని నలుగురు సాయుధ ఉగ్రవాదులు వచ్చారు. వారు జరిపిన కాల్పుల్లో ఇద్దరు పోలీసులు మృతిచెందారు. వారి మృతదేహాలను దవాఖానకు తరలించగా అక్కడ గుమికూడిన ప్రజల మధ్యకు వెళ్లిన బుర్కా ధరించిన ఓ మహిళ ఆత్మాహుతి దాడికి తెగబడింది. ఆత్మాహుతి దాడిలో నలుగురు పోలీసులు సహా ఏడుగురు మృతిచెందారని చెప్పారు. మహిళతో ఆత్మాహుతి దాడి ఎప్పుడూ జరుగలేదని పోలీసులు తెలిపారు. బాంబర్ తల నుంచి కాళ్ల వరకు బుర్కా ధరించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడికి తామే బాధ్యులమని తెహెరిక్-ఈ- తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది.

## సీపీఐ ప్రధాన కార్యదర్శిగా డీ రాజా నియామకం

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కన్హయ్యకుమార్

దేశ తిరోగమన విధానాలపై పోరాటం కొనసాగుతుందన్న రాజా



డీ రాజా



కన్హయ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/న్యూఢిల్లీ:** సీపీఐ ప్రధాన కార్యదర్శిగా డీ రాజా ఆదివారం నియమితులయ్యారు. ఇప్పటి వరకు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోగ్యం సహకరించడం లేదన్న కారణంతో రాజీనామా చేశారు. దీంతో నాయకత్వ మార్పుపై చర్చించిన సీపీఐ జాతీయ మండలి.. ప్రధాన కార్యదర్శిగా డీ రాజాను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ తిరోగమన విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు. 'ప్రధాని మోదీ నియంతృత్వ పాలనలో దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఈ ఫలితాలతో మేం డీలాపడటం లేదు. ప్రభుత్వ తిరుగోమన విధానాలపై మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది' అని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ...అనారోగ్య కారణాల వల్లే తాను బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా తప్పుకున్నప్పటికీ కార్యదర్శివర్గ సభ్యుడిగా కొనసాగుతానని తెలిపారు. రాజా నాయకత్వంలో పార్టీ పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడు కన్హయ్య కుమార్‌తో పాటు ఒడిశా యువ నేత రామకృష్ణ పండాను జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు.

## ముంబైలో అగ్నిప్రమాదం

■ ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

**ముంబై:** ముంబైలోని ప్రఖ్యాత తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్‌కు సమీపంలోని ఓ నాలుగు అంతస్థుల నివాస భవనంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిప్రమాదం సంభవించిన చర్‌చిల్ చాంబర్ భవనం నుంచి 14 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. మృతుడిని శ్యామ్ అయ్యర్ (54)గా గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదంతో ఆ ప్రాంతంలో పెద్దఎత్తున దట్టమైన పొగ అలుముకున్నదని అధికారులు తెలిపారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న పలువురు వృద్ధులను చికిత్స నిమిత్తం సమీప ప్రభుత్వ దవాఖానకు తరలించినట్టు పేర్కొన్నారు.

## బ్యాలెట్‌పై త్వరలో విపక్షాల భేటీ

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తర్వాత భేటీకి కాంగ్రెస్ కసరత్తు

అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణపై హస్తం పార్టీ యోచన

బ్యాలెట్ కోసం విపక్షాలతో కలిసి ఈసీపై ఒత్తిడికి వ్యూహం

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది చివరిలో మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) స్థానంలో బ్యాలెట్ పత్రాలతో పోలింగ్ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఈవీఎంల భవితవ్యంపై విపక్షాలతో కాంగ్రెస్ పార్టీ ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగియగానే ఈ భేటీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాల కథనం. ఈవీఎంల స్థానే బ్యాలెట్ పత్రాల పద్ధతిని ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఇటీవల యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, సీనియర్ నేత రాహుల్‌గాంధీలను కలుసుకున్న పార్టీ నేతల బృందం.. బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ జరుపాలన్న డిమాండ్‌పై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించినట్లు ఆ పార్టీ నేత ఒకరు తెలిపారు. 'ఈవీఎంల ట్యాంపరింగ్' వల్లే బీజేపీ 303 స్థానాల్లో గెలుపొందిందని కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. కాగా, మహారాష్ట్రలోని విపక్ష పార్టీలన్నీ ఈవీఎంలకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ ఏడాది చివరిలో జరిగే మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని పార్టీ నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి ఉన్నదని మరో కాంగ్రెస్ నేత చెప్పారు. దీనిపై విపక్షాలతో సంప్రదించాక పార్టీ ఒక నిర్ణయానికి వస్తుందన్నారు. ఈ నెల ఎనిమిదో తేదీన ఢిల్లీకి వచ్చిన మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అధినేత రాజ్‌ఠాక్రే ఈసీ ప్రధాన కమిషనర్ సునీల్ అరోరాను కలిసి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను బ్యాలెట్ పత్రాలతో జరుపాలని కోరారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 220 స్థానాల్లో ఓట్ల లెక్కింపుల్లో తేడాలు ఉన్నాయని మీడియాలో వార్తలొచ్చాయని రాజ్‌ఠాక్రే గుర్తు చేశారు.

## వర్షాలకు 50 మంది మృతి

■ పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్న వరదలు



యూపీలోని మథురలో జలమయమైన రహదారిలో ప్రజల ఇక్కట్లు

**న్యూఢిల్లీ:** వివిధ రాష్ట్రాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. వర్షాలతో ఆదివారం ఒక్కరోజు 50 మంది మరణించారు. పిడుగుపాటుతో యూపీలో 32 మంది మృతి చెందినట్టు అధికారులు చెప్పారు. వరదలు, వర్షాల కారణంగా బీహార్, అసోంల్లో ఐదుగురు చొప్పున, రాజస్థాన్‌లో నలుగురు, కేరళలో ఇద్దరు, అరుణాచల్‌ప్రదేశ్, తెలంగాణల్లో ఒకరు చొప్పున మరణించారు. కేరళలో వరదలకు ఆదివారం ఇద్దరు మృతిచెందడంతో మృతుల సంఖ్య నలుగురికి చేరింది. మరో ముగ్గురు గల్లంతయ్యారు. కేరళలోని నాలుగు జిల్లాల్లో ఈ నెల 23 వరకు రెడ్‌అలర్ట్ ప్రకటించారు. భారీ వరదల కారణంగా అసోంలో వరద మృతుల సంఖ్య 64కు చేరగా, బీహార్‌లో 102కు పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో ఇంటి పైకప్పు కూలి హైదరాబాద్‌లో 14 నెలల బాలుడు మృతిచెందాడు.

# మళ్లీ ఓడిన టైటాన్స్



టైటాన్స్ రైడర్ సిద్ధార్థ్‌ను పట్టేస్తున్న తలైవాస్ డిఫెండర్లు

- రెండో మ్యాచ్‌లో తలైవాస్ చేతిలో పరాజయం
- మెరిసిన రాహుల్ చౌదరి, మన్‌జీత్ చిల్లర్

**గత ఆరు సీజన్లుగా తెలుగు టైటాన్స్‌కు సేవలందించిన రైడ్ మెషీన్ రాహుల్ చౌదరి పాత జట్టుపై కసి తీరా ఆడటంతో.. ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు వరుసగా రెండో పరాజయం తప్పలేదు. గతంలోనూ ఒకే ఆటగాడిపై ఎక్కువగా ఆధారపడి మూల్యం చెల్లించుకున్న టైటాన్స్ ఈ సీజన్‌లో సిద్ధార్థ్‌పై అతి నమ్మకంతో మరోసారి భంగపాటుకు గురైతే.. స్టార్లతో నిండిన తలైవాస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి సీజన్‌లో బోణీ కొట్టింది.**

**పీకేఎల్‌లో నేడు**

యు ముంబా X జైపూర్ - 7.30గం.
పుణే X హర్యానా - 8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తొలి మ్యాచ్‌లో పరాజయం వెక్కిరించినా.. మలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ సత్తా చాటుతుందనుకుంటే.. వరుసగా రెండో పరాజయం మూటగట్టుకుంది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 26-39తో తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమి పాలైంది. మొన్న మొన్నటి వరకు మన జట్టు తరఫున ఆడిన రాహుల్ చౌదరి అద్భుత ప్రదర్శనకు మన్‌జీత్ చిల్లర్ ఉడుం పట్టు తోడవడంతో తలైవాస్ అలవోకగా గెలుపొందింది. రాహుల్ (12 పాయింట్లు)కు బెస్ట్ రైడర్ అవార్డు దక్కగా.. మన్‌జీత్ (6 పాయింట్లు)ను బెస్ట్ డిఫెండర్ పురస్కారం వరించింది. టైటాన్స్ ఎన్నో ఆశలు పెట్టుకున్న కబడ్డీ 'బాహుబలి'సిద్ధార్థ్ దేశాయ్ (6 పాయింట్లు) మరోసారి నిరాశ పరిచాడు.

**రాహుల్ విజృంభణ**

సొంత మైదానంలాంటి గచ్చిబౌలిలో రాహుల్ చౌదరి చెలరేగిపోయాడు. తలైవాస్ తరఫున తొలి రైడ్‌కు వచ్చిన రాహుల్ పాయింట్ సాధించగా.. డూ ఆర్ డై రైడ్‌లో రజనీశ్ పాయింట్ తేవడంతో టైటాన్స్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత వరుసగా సిద్ధార్థ్ దేశాయ్, రజనీశ్‌ను పట్టేసిన తలైవాస్ ఆధిక్యంలోకి వెళ్లింది. కాసేపటికే డూ ఆర్ డై రైడ్‌లో రాహుల్‌ను పట్టేసిన టైటాన్స్ తిరిగి పుంజుకొని ఆధిక్యంలోకి దూసుకెళ్లినా.. ముగ్గురే ఉన్న కోర్టులోకి వెళ్లిన సిద్ధార్థ్ దేశాయ్ ఔట్ కావడంతో తలైవాస్ ముందంజ వేసింది. ఇక అక్కడి నుంచి అదే జోరు కొనసాగించిన తంబీల జట్టు వరుస పాయింట్లతో అదరగొట్టింది. ఫలితంగా తొలి అర్ధభాగం ముగిసేసరికి టైటాన్స్ 10-20తో వెనుకంజలో నిలిచింది.

**స్టార్ల ముందు నిలువలేక..**

రెండో సగంలోనైనా.. మ్యాజిక్ చేస్తారనుకుంటే అదీ సాధ్యపడలేదు. అజయ్ ఠాకూర్, రాహుల్ చౌదరి, మన్‌జీత్ చిల్లర్, మోహిత్ చిల్లర్, షబ్బీర్ బాబుతో కూడిన తమిళ్ తలైవాస్‌కు తెలుగు టైటాన్స్ ఏ దశలోనూ పోటీ నివ్వలేకపోయింది. ముఖ్యంగా పటిష్టమైన డిఫెన్స్‌తో మన్‌జీత్, మోహిత్.. టైటాన్స్ రైడర్లను కట్టిపడేశారు. ట్యాక్లింగ్‌లో టైటాన్స్ 8 పాయింట్లే సాధించగా.. తలైవాస్ 15 పాయింట్లు సాధించడమే దీనికి నిదర్శనం. మ్యాచ్‌లో మన జట్టు రెండు సార్లు ఆలౌట్ కాగా.. ప్రత్యర్థి జట్టు కోర్టు ఒక్కసారి కూడా ఖాళీ కాలేదు. ఆఖర్లో కొన్ని పాయింట్లు సాధించినా.. అప్పటికే ఆలస్యమైపోవడంతో టైటాన్స్‌కు వరుసగా రెండో పరాజయం తప్పలేదు. మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 42-24తో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది.

# అయ్యో.. సింధు





యమగుచి

## ఫైనల్లో యమగుచి చేతిలో పరాజయం

### ఇండోనేషియా ఓపెన్

**జకార్తా:** ఈ సీజన్‌తో తొలి టైటిల్ కోసం ఏడు నెలలుగా ఎదురుచూస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్‌లో అదిరే ఆటతో ఫైనల్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన ఈ తెలుగు తేజం తుదిపోరులో తడబడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో సింధు 15-21, 16-21తో జపాన్ క్రీడాకారిణి యమగుచి చేతిలో పరాజయం పాలై రజత పతకంతో సరిపెట్టుకుంది. 51 నిమిషాల పాటు సాగిన పోరులో అనవసర తప్పిదాలు చేసిన సింధు అందుకు తగ్గ మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ ప్రారంభంలో 0-3తో వెనుకబడిన తెలుగమ్మాయి అద్భుత పోరాటంతో ఓ దశలో 5-4తో ముందంజలో నిలిచింది. ఆ తర్వాత ఇరువురు హోరాహోరీగా పోరాడడంతో స్కోరు 8-8తో సమమైంది. ఆ తర్వాత వరుసగా మూడు పాయింట్లు సాధించిన సింధు సులువుగానే సెట్‌ను సొంతం చేసుకునేలా కనిపించింది. కానీ పట్టు వదలని యమగుచి తిరిగి పుంజుకొని స్కోరును 14-14తో సమం చేసింది. ఇక అక్కడి నుంచి అటాకింగ్ గేమ్‌పై దృష్టి పెట్టిన జపాన్ షట్లర్.. వరుసగా ఆరు పాయింట్లు సాధించింది. ఆ తర్వాత సింధు ఓ పాయింట్ సాధించినా.. వెంటనే కోలుకున్న జపాన్ స్టార్ ఓ అద్భుతమైన షాట్‌తో తొలిసెట్‌ను 21-15తో కైవసం చేసుకుంది. ఇక రెండో గేమ్ ఆరంభంలో కూడా సింధు 1-4తో బాగా వెనుకబడింది. తడబాటును కొనసాగించి 5-8తో మ్యాచ్‌లో ముందంజ వేయలేకపోయింది. యమగుచి తప్పిదాల కారణంగా భారత స్టార్ కొన్ని పాయింట్లు సాధించినా ఆధిక్యంలోకి రాలేకపోయింది. 11-15తో వెనుకబడిన సమయంలో సింధు మరోసారి పుంజుకొని 15-18కి చేరింది. ఆ తర్వాత యమగుచి బలమైన షాట్లతో విరుచుకపడడంతో ఒక్కపాయింట్ మాత్రమే సాధించిన సింధు.. 16-21తో రెండో గేమ్‌ను కూడా కోల్పోయి.. టైటిల్‌ను చేజార్చుకుంది.

**చెన్‌దే పురుషుల సింగిల్స్**

పురుషుల సింగిల్స్ ఫైనల్.. చైనీస్ తైపీ ప్లేయర్ చౌ టీన్ చెన్, అండర్స్ అంటోన్సెన్(డెన్మార్క్) మధ్య హోరాహోరీగా సాగింది. 91నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో చెన్ 21-18, 24-26, 21-15తో అంటోన్సెన్‌పై విజయం సాధించి పసిడి పతకం సొంతం చేసుకున్నాడు.



ధర్మసేన

## ఆ నిర్ణయం తప్పే

**కొలంబో:** ప్రపంచకప్ ఫైనల్లో తప్పుడు నిర్ణయంతో వార్తల్లోకెక్కిన శ్రీలంక అంపైర్ కుమార ధర్మసేన తాను చేసింది పొరపాటే అని అంగీకరించాడు. న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరు ఫైనల్ ఓవర్‌లో గప్టిల్ త్రో వేయగా బంతి.. స్టోక్స్ బ్యాట్‌కు తాకి బౌండ్రీకి వెళ్లింది. దీనికి నిబంధనల ప్రకారం 5 పరుగులే ఇవ్వాల్సి ఉండగా.. అంపైర్ ధర్మసేన మాత్రం 6 పరగులు ఇచ్చాడు. దీంతో ఇంగ్లండ్ చివరకు మ్యాచ్‌ను 'టై'గా ముగించింది. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లోనూ స్కోర్లు సమమవడంతో మ్యాచ్‌లో ఎక్కువ బౌండ్రీలు కొట్టిన ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ అంశంపై ధర్మసేన స్పందిస్తూ.. 'టీవీ రీప్లేలు చూశాకే నా నిర్ణయం తప్పు అని అర్థమైంది. టీవీల్లో చూసిన తర్వాత దానిపై మాట్లాడటం సులువే. కానీ మైదానం మధ్యలో నిలబడి రీప్లే చూసే వెసులుబాటు మాకు ఉండదు. సకాలంలో నిర్ణయం తీసుకున్నందుకు ఐసీసీ నన్ను అభినందించింది కూడా. నిబంధనల ప్రకారం ఈ అంశంపై థర్డ్ అంపైర్‌ను సహాయం కోరే అవకాశం లేకపోవడం కూడా దెబ్బకొట్టింది' అని అన్నాడు.

# కోహ్లీకి నో రెస్ట్



సెలెక్షన్ కమిటీ సమావేశానికి వస్తున్న కోహ్లీ

- అన్ని ఫార్మాట్లకు విరాటే కెప్టెన్
- విండీస్ పర్యటనకు భారత జట్ల ఎంపిక
- వన్డే, టీ20 సిరీస్‌లకు యువ ఆటగాళ్లు

**వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ లక్ష్యంగా.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో గాడితప్పిన మిడిల్ ఆర్డర్‌ను చక్కదిద్దే దిశగా విండీస్ పర్యటనకు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ జట్లను ఎంపిక చేసింది. బ్యాటింగ్‌లో మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్‌ను తీసుకోవడంతో పాటు బౌలింగ్‌లోనూ కొత్తవారికి అవకాశమిచ్చింది. గాయం నుంచి కోలుకున్న ధావన్ టీ20, వన్డేలకు ఎంపిక కాగా.. జాదవ్‌ను 50 ఓవర్ల ఫార్మాట్‌కే పరిమితం చేసింది. కార్తీక్‌ను పూర్తిగా పక్కనబెట్టగా, ఎడతెరిపి లేని క్రికెట్‌తో అలిసిపోయిన పాండ్యాకు పర్యటన నుంచి విశ్రాంతినిచ్చింది. సైన్యంలో సేవలందించేందుకు ధోనీ సెలెక్షన్‌కు దూరం కాగా.. పంత్ మూడు ఫార్మాట్లలోనూ చోటు దక్కించుకున్నాడు. టెస్టు జట్టులో తెలుగు కుర్రాడు హనుమ విహారి ప్లేస్ కాపాడుకోగా.. ప్రపంచకప్‌లో అదరగొట్టిన రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కూ అందుబాటులోకి వచ్చాడు. ప్రపంచకప్ తర్వాత విండీస్ టూర్ నుంచి కోహ్లీకి విశ్రాంతినిస్తారనే వార్తలొచ్చినా... సెలెక్టర్లు అతడికే మూడు ఫార్మాట్ల పగ్గాలు అప్పగించారు.**

## విండీస్ పర్యటన షెడ్యూల్

మూడు టీ20లు (ఆగస్టు 3,4,6)
మూడు వన్డేలు (ఆగస్టు 8, 11, 14)
రెండు టెస్టులు
(ఆగస్టు 22-26, 30-సెప్టెంబర్ 3)

తొలి రెండు టీ20లు అమెరికాలోని ఫ్లోరిడాలో జరుగనుండగా మిగిలిన మ్యాచ్‌లన్నింటికీ వెస్టిండీస్ అతిథ్యమివ్వనుంది.

**టెస్టు జట్టు:** కోహ్లీ(కెప్టెన్), రహానే(వైస్ కెప్టెన్), మయాంక్, రాహుల్, పుజారా, విహారి, రోహిత్, పంత్ (వికెట్ కీపర్), సాహా(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, కుల్దీప్, ఇషాంత్, షమీ, బుమ్రా, ఉమేశ్.



ముంబైలో ఆదివారం జరిగిన సెలెక్షన్ కమిటీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెస్కే ప్రసాద్

**టీ20 జట్టు:** కోహ్లీ (కెప్టెన్), రోహిత్ (వైస్ కెప్టెన్), ధావన్, రాహుల్, అయ్యర్, మనీశ్, పంత్(వికెట్ కీపర్), జడేజా, సుందర్, రాహుల్ చహర్, దీపక్ చహర్, భువనేశ్వర్, కృనాల్, ఖలీల్, సైనీ.

**వన్డే జట్టు:** కోహ్లీ(కెప్టెన్), రోహిత్ (వైస్ కెప్టెన్), ధావన్, రాహుల్, అయ్యర్, పంత్(వికెట్ కీపర్), మనీశ్, జడేజా, కుల్దీప్, చాహల్, జాదవ్, షమీ, భువనేశ్వర్, ఖలీల్, సైనీ.

**ముంబై:** పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఎంతో కాలంగా వేధిస్తున్న మిడిల్‌ఆర్డర్ సమస్య పరిష్కారం కోసం కొత్త ఆటగాళ్లతో మరో ప్రయోగానికి టీమ్‌ఇండియా సిద్ధమైంది. ఆగస్టు 3 నుంచి ప్రారంభమయ్యే వెస్టిండీస్ పర్యటన కోసం మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్ వైపు సెలెక్షన్ కమిటీ మొగ్గుచూపింది. టెస్టు సిరీస్‌లో తెలుగు తేజం హనుమ విహారి చోటు కాపాడుకున్నాడు. ప్రపంచకప్ సెమీఫైనల్లో ఓటమి అనంతరం తీవ్ర ఉత్కంఠ మధ్య ఆదివారం చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో సమావేశమైన కమిటీ వెస్టిండీస్ టూర్‌కు వెళ్లే టీ20, వన్డే, టెస్టు జట్లను ప్రకటించింది. ఈ సమా వేశంలో కెప్టెన్ కోహ్లీతో పాటు బీసీసీఐ అధికారులు పాల్గొ న్నారు. గాయం నుంచి కోలుకున్న ఓపెనర్ శిఖర్ ధావన్‌ను పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కు ఎంపిక చేసి.. టెస్టులకు పరిగణనలోకి తీసుకోలేదు. టెస్టు అరంగేట్రంలోనే శతక్కొట్టిన యువకెరటం పృథ్వీషా గాయంతో బాధపడుతుండటంతో అతడిని పక్కనపెట్టింది. భవిష్యత్తులో ధోనీ స్థానాన్ని భర్తీ చేస్తాడని అందరూ ఆశిస్తున్న యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ మూడు ఫార్మాట్లలోనూ ఆడనున్నాడు. విండీస్ టూర్‌లో టీ20, వన్డేలకు విరాట్ కోహ్లీకి విశ్రాంతి నిస్తారని తొలుత వార్తలొచ్చినా.. అలాంటిదేమీ జరగలేదు. మూడు ఫార్మాట్లకు అతడినే కెప్టెన్‌గా ఎంపిక చేసింది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు పర్యటన నుంచి, స్పీడ్‌స్టర్ జస్ప్రీత్ బుమ్రాకు వన్డేలు, టీ20ల నుంచి విశ్రాంతి ఇచ్చింది.

### రిటైర్మెంట్ ధోనీ వ్యక్తిగతం..

మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రిటైర్మెంట్ అంశంపై ఎమ్మెస్కే మాట్లాడుతూ.. 'రిటైర్మెంట్ అనేది పూర్తిగా ధోనీ వ్యక్తిగతం. మహీలాంటి దిగ్గజ క్రికెటర్లకు ఎప్పుడు రిటైరవ్వాలో బాగా తెలుసు. భవిష్యత్తులో తీసుకునే చర్యలు సెలెక్షన్ కమిటీ చేతిలో ఉంటాయి. వాటి గురించి ఇప్పుడే మాట్లాడాల్సిన అవసరం లేదు. ఈ సిరీస్‌కు అతడు అందుబాటులో లేడు. ఆ సమాచారాన్ని మాకు చెప్పాడు. పంత్ మెరుగయ్యేందుకు కావాల్సిన అవకాశాలను అతడికి ఇస్తాం. ప్రపంచకప్ సెమీస్‌లోనూ అతడు బాగా ఆడాడు' అని అన్నాడు. ప్రపంచకప్ అనంతరం ధోనీ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని విస్తృతంగా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సైన్యంలో సేవలందించేందుకు గాను ధోనీ రెండు నెలల విరామాన్ని కోరినట్టు సమాచారం. దీన్నిబట్టి జార్ఖండ్ డైనమేట్ రిటైర్మెంట్ ఇప్పట్లో లేనట్టేనని అర్థమవుతున్నది.

**సాహా ఆగమనం..**

భుజం శస్త్రచికిత్స తర్వాత కోలుకున్న వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా చాలా కాలం తర్వాత తిరిగి టెస్టు జట్టులోకి వచ్చాడు. అతడు చివరగా 2018లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్ ఆడాడు. పరిమిత ఓవర్ల జట్టులో యువ పేసర్లు ఖలీల్ అహ్మద్, నవ్‌దీప్‌సైనీలు చోటు దక్కించుకున్నారు. ఐపీఎల్‌లో అదరగొట్టిన అన్నదమ్ములు రాహుల్ చాహర్, దీపక్ చాహర్ టీ20లకు ఛాన్స్ కొట్టేశారు. గాయంతో బాధపడుతున్న ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌ను కూడా పరిగణించలేదు. ఇండియా-ఏ ప్రదర్శనను పరిగణలోకి తీసుకొని జట్టును ఎంపిక చేశామని ప్రకటించిన సెలెక్టర్లు... విండీస్-ఏపై సిరీస్‌లో అదరగొట్టిన యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు మాత్రం మొండిచేయి చూపారు.



## రాయుడు ట్వీట్‌ను ఆస్వాదించా..

తెలుగు క్రికెటర్ అంబటి రాయుడు రిటైర్మెంట్‌పై ఎమ్మెస్కే ప్రసాద్ స్పందించాడు. ప్రపంచకప్‌లో రాయుడిని కాదని, ఇతర ఆటగాళ్లను ఎంపిక చేయడంలో ఎలాంటి పక్షపాతం చూపలేదని స్పష్టం చేశాడు. అలాగే '3డీ ట్వీట్'గురించి మాట్లాడుతూ.. 'అది సమయోచిత ట్వీట్, దాన్ని నేను కూడా ఎంజాయ్ చేశా' అని అన్నాడు. ప్రపంచకప్‌లో జట్టు కూర్పు వల్లే రాయుడుకు చోటు దక్కలేదని వెల్లడించాడు. గతంలో రాయుడికి ఎంతో మద్దతిచ్చామని, ఫిట్‌నెస్ పరీక్షల్లో ఫెయిల్ అయిన సమయంలోనూ అతడికి తోడుగా నిలిచి జట్టులోకి వచ్చే విధంగా తోడ్పాటునందించినట్టు తెలిపాడు. ధవన్‌కు గాయమైన సమయంలో ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్ కావాలని టీమ్ మేనేజ్‌మెంట్ అడిగినందునే పంత్‌ను ప్రపంచకప్‌నకు పంపామని తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నాడు. మయాంక్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా మాత్రమే పరిగణించామని స్పష్టం చేశాడు.

## క్వార్టర్స్‌లో భారత్

**న్యూఢిల్లీ:** ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు పరాజయం పాలైనా.. క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. చైనా వేదికగా జరుగుతున్న టోర్నీలో ఆదివారం భారత్ 1-4తో కొరియా చేతిలో ఓడింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింట నెగ్గిన భారత్ 4 పాయింట్లతో గ్రూప్ 'సి'లో రెండో స్థానంతో క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. సోమవారం జరుగనున్న నాకౌట్‌లో ఇండోనేషియాతో భారత్ తలపడనుంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భాగంగా మొదట జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో డింకూ సింగ్-రితిక ఠక్కర్ జోడీ 21-19, 12-21, 12-21తో డాంగ్ జూ-యున్‌జీ ద్వయం చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో మైరబా లువాంగ్ 21-19, 19-21, 21-18తో సెంగ్ పార్క్‌పై గెలిచి స్కోరును 1-1తో సమం చేసినా.. ఆ తర్వాత జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారత ఆటగాళ్లు ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో విష్ణువర్ధన్ గౌడ్-ఇషాన్ జోడీ.. మహిళల డబుల్స్‌లో తనీష-త్రిష జంట.. మహిళల సింగిల్స్‌లో మాలవిక నిరాశజనక ప్రదర్శన చేశారు.



## హెచ్‌సీఏ రిటర్నింగ్ అధికారిగా సంపత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొత్త కార్యవర్గ ఎన్నికలను ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించాలని వార్షిక సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వీఎస్ సంపత్, అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ ఎంఎన్ రావు, బీసీసీఐ ప్రతినిధిగా జి. వివేకానందను నియమిస్తూ తీర్మానం చేశారు. ఆదివారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు అనిల్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణలోని అన్ని జిల్లాలకు పూర్తి స్థాయి క్లబ్‌లను ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏ మాజీ సభ్యుడు బాబురావు డిమాండ్ చేశారు. తీవ్ర తర్జనభర్జనల మధ్య సాగిన సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు రాగా.. చివరకు 9 అంశాలకు హెచ్‌సీఏ కార్యవర్గం ఆమోదం తెలిపింది.



నాగల్

## మెయిన్‌డ్రాకు నాగల్

### హాంబర్గ్ యూరోపియన్ ఓపెన్

**హాంబర్గ్ (జర్మనీ):** భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ హాంబర్గ్ యూరోపియన్ ఓపెన్ మెయిన్ డ్రా (ఏటీపీ-500)కు తొలిసారి అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ టోర్నీ రెండో రౌండ్‌లో ఆదివారం నాగల్ 6-4, 7-5తో మూడో సీడ్, ప్రపంచ 128వ ర్యాంకర్ అలెజాండ్రో ఫొకినా (స్పెయిన్)పై చక్కటి విజయంతో ప్రధాన టోర్నీలో ప్రవేశించాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో నాగల్ 7-5, 6-2తో సెబాస్టియన్ ఓఫ్నర్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. హర్యానాకు చెందిన 21 ఏండ్ల నాగల్‌కు ఇదే తొలి ఏటీపీ-500 టోర్నీ కావడం విశేషం. అతడు గతంలో ఏటీపీ 250 టాటా ఓపెన్ మహారాష్ట్ర టోర్నీలో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్, మాస్టర్ సిరీస్ టోర్నమెంట్‌ల తర్వాత మూడో అతిపెద్ద ఈవెంట్ ఇదే. గత కొంతకాలంగా చాలెంజర్ సర్క్యూట్‌లో మంచి ప్రదర్శన చేస్తున్న నాగల్.. తానాడిన చివరి ఏడు టోర్నమెంట్లలో ఐదింట సెమీఫైనల్‌కు చేరి సత్తాచాటాడు. ఈ ఏడాది ఆరంభంలో 350 పైచిలుకు ర్యాంకులో ఉన్న నాగల్ ప్రస్తుతం 200కు సమీపంలోకి (205) రావడం అతడి శ్రమకు నిదర్శనం.

## పాకిస్థాన్‌కు ఇద్దరు కెప్టెన్లు!

**కరాచీ:** వన్డే ప్రపంచకప్‌లో లీగ్ దశలోనే నిష్క్రమించిన పాకిస్థాన్ జట్టు ప్రక్షాళన దిశగా ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా టెస్టు, వన్డే జట్లకు వేర్వేరు కెప్టెన్లతో పాటు కోచ్‌లను నియమించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సీజన్‌లో శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్‌తో పాకిస్థాన్ మ్యాచ్‌లు ఆడనుంది. ప్రస్తుతం ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న పాక్.. వన్డేల్లో ఆరో ర్యాంక్‌లో టెస్టుల్లో 7వ ప్లేస్‌లో కొనసాగుతున్నది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సర్ఫరాజ్ సారథ్యంతో సంతృప్తిగానే ఉన్న బోర్డు సంప్రదాయ క్రికెట్‌లో మాత్రం కెప్టెన్సీ మార్చే ఉద్దేశంలో ఉన్నట్లు పీసీబీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఆ స్థానానికి అసద్ షఫీక్, అజహర్ అలీ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు టెస్టుల కోసం ప్రత్యేక కోచ్‌ను కూడా ఎంపిక చేసే పనిలో పీసీబీ ఉంది.

## రెండో రౌండ్‌లో నిఖత్



**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ దూసుకెళ్తున్నది. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ టోర్నీ 51 కేజీల విభాగంలో నిఖత్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. మాజీ జూనియర్ వరల్డ్ చాంపియన్ నిఖత్ తొలి రౌండ్‌లో 5-0తో టస్మిన్ బెన్నీ (న్యూజిలాండ్)ను చిత్తు చేసింది. మరో భారత బాక్సర్ శశి చోప్రా (60 కేజీలు) తొలి రౌండ్‌లో సుడాపోన్ సీసోండీ (థాయ్‌లాండ్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## 'టై'పై చాపెల్ కొత్త ప్రతిపాదన

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ఫైనల్లో బౌండరీలను పరిగణలోకి తీసుకొని ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించడంపై విమర్శలు, వాదనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అంశంపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ ఓ కొత్త ప్రతిపాదనను తెరమీదకు తీసుకువచ్చాడు. 'లీగ్ దశలో పాయింట్ల పట్టికలో జట్ల స్థానాలను పరిగణలోకి తీసుకోవాలి. ఫైనల్ టై అయిన సమయంలో విజేతను నిర్ణయించేందుకు ఉత్తమమైన దారి ఇదే. విజయాల వల్ల వచ్చిన పాయింట్లు లేదా రన్‌రేట్ వల్ల ఏదో ఒక జట్టు మెరుగైన స్థానంలోనే ఉంటుంది కాబట్టి ఈ విధానం సరైన సమాధానం చెబుతుంది' అని ఓ వ్యాసంలో అతడు అభిప్రాయపడ్డాడు.

# ఎలక్ట్రిక్ వాహనాలపై తగ్గనున్న పన్ను!

## 25న జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశం



**న్యూఢిల్లీ, జూలై 21:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ నెల 25న జరుగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో విద్యుత్‌తో నడిచే వాహనాలపై పన్ను తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత జరుగుతున్న 36వ సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ సమావేశంలో సౌర విద్యుత్ జనరేటింగ్ పరికరాలు, పవన విద్యుత్ టర్బైన్ ప్రాజెక్టులపై విధించే జీఎస్టీని ఎత్తివేసేదానిపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. గత జీఎస్టీ సమావేశంలో ఈవీ, ఎలక్ట్రిక్ చార్జర్లు, అద్దెకు తీసుకునే ఈవీలపై జీఎస్టీ పన్ను విధించేదానిపై వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దేశీయంగా ఈవీల తయారీని ప్రోత్సహించడానికి ఈ వాహనాలపై విధించే జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్‌కు కేంద్ర ప్రభుత్వం గతంలో సూచించింది. కానీ, దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే పెట్రోల్, డీజిల్ కార్లు, హైబ్రిడ్ వాహనాలపై మాత్రం 28 శాతం జీఎస్టీతో పాటు అదనంగా సెస్‌ను విధిస్తున్నది.

# పదోన్నతులు.. నియామకాల్లేవ్

ఎయిర్ ఇండియాలో ఆగిన సిబ్బంది వ్యవహారాలు

సంస్థలో వాటా విక్రయానికి కేంద్రం సిద్ధమవుతుండటమే కారణం




**న్యూఢిల్లీ, జూలై 21:** ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా.. ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త సిబ్బంది నియామకాలను నిలిపివేసింది. సంస్థలో వాటాల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుండటమే ఇందుకు కారణమని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియాలో 76 శాతం వాటాను అమ్మేందుకు కేంద్రం గట్టిగా ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే దీన్ని విక్రయించే తంతు త్వరలో మొదలవుతున్నదని ఆదివారం సంస్థ వర్గాలు తెలిపాయి. ఎయిర్ ఇండియాకు రూ.50,000 కోట్ల రుణ భారం ఉన్నది. నిజానికి గతేడాది నుంచే ఎయిర్ ఇండియా వాటా అమ్మకానికి కేంద్రం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. అయితే ఇవన్నీ కూడా దారుణంగా విఫలమవుతున్నాయి. ఓవైపు ధర, మరోవైపు నిబంధనలు.. ఆసక్తి ఉన్నవారికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో మార్పులు, చేర్పులతో కొత్త ప్రణాళికను మోదీ సర్కారు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఈ నెల 15దాకా సంస్థ ఖాతా పుస్తకాలను మూసేశారని, ఈ ఆర్థిక వివరాలను కొత్త బిడ్ల ఆహ్వానంలో వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని ఓ ఎయిర్ ఇండియా అధికారి చెప్పారు. సంస్థలో ప్రస్తుతం దాదాపు 10 వేల మంది శాశ్వత ఉద్యోగులున్నారు.

### నాలుగైదు నెలల్లో పూర్తి?

ఎయిర్ ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ క్రమంలో గత వారం జరిగిన సంస్థాగత సమావేశంలో అన్ని విభాగాల అధిపతులకు ఎయిర్ ఇండియా హెచ్ఆర్ డైరెక్టర్ అమృత శరణ్ నుంచి స్పష్టమైన ఆదేశాలు చేరాయి. ఏ ఉద్యోగికి సంబంధించైనా రికవరీ, పెండింగ్ అంశాల జోలికి వెళ్లవద్దన్నదే వాటి సారాంశం. కాగా, దీనిపై అటు ఎయిర్ ఇండియాగానీ, ఇటు పౌర విమానయాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఖరోలాగానీ స్పందించలేదు. దీంతో వాటా అమ్మేదాకా ప్రమోషన్లు, అపాయింట్‌మెంట్లు నిల్ అని స్పష్టమవుతున్నది. లావాదేవీ అనంతరం కూడా ప్రభుత్వం చేతిలో 24 శాతం వాటా ఉండటం, యాజమాన్య హక్కులు, అధిక రుణ భారం వంటివి బిడ్డర్లను దూరం చేస్తున్నదని ఓ అధికారి అన్నారు.

### లాభాల్లోకి తెచ్చాక..

ప్రస్తుతం ఎయిర్ ఇండియా రోజువారి ఆదాయం రూ.15 కోట్లుగా ఉన్నది. అయితే అప్పుల భారం రూ.50,000 కోట్లు. దీంతో వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలు, నిర్వహణ వ్యయాలకే చాలని పరిస్థితి. ఫలితంగా సంస్థ కొనుగోలుకు ఎవరూ సాహసించడం లేదు. దీన్ని గమనించిన కేంద్రం.. సంస్థను తిరిగి లాభాల్లోకి తెచ్చిన తర్వాతే వాటాల ఉపసంహరణకు దిగాలని అనుకుంటున్నది. ఈ నెల 3న రాజ్యసభలో పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇప్పటికే సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం అప్పుడప్పుడు ఆర్థిక సాయం చేస్తున్నది తెలిసిందే.

### పరిశ్రమలో సంక్షోభం..

దేశీయ విమానయాన పరిశ్రమలో సంక్షోభం ఛాయలు కనిపిస్తుండటం కూడా ఎయిర్ ఇండియా వాటా విక్రయానికి ప్రధాన అవరోధంగా నిలుస్తున్నది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూతబడటం, జెట్ ఎయిర్‌వేస్ దివాలా, ఇండిగో లుకలుకలు.. పరిశ్రమ ముఖచిత్రాన్ని భయానకంగా మార్చేశాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెరిగిన పోటీ వాతావరణం కూడా విమానయాన రంగానికి లాభాలను దూరం చేస్తున్నది. కాగా, ఎయిర్ ఇండియా, దాని నాలుగు అనుబంధ సంస్థలకు చెందిన రూ.29,464 కోట్ల రుణాలను ఎయిర్ ఇండియా అసెట్స్ హోల్డింగ్ కంపెనీని ఏర్పాటు చేసి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం కొంతలోకొంత వాటా విక్రయానికి కలిసి రానుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీపావళి నాటికి వాటా విక్రయాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం) కార్యదర్శి అతను చక్రబర్తి ఇప్పటికే చెప్పారు.

### పవన్ హన్స్ కోసం..

ప్రభుత్వ రంగ పవన్ హన్స్ సంస్థలో పెట్టుబడుల ఉపసంహరణ విఫలమవుతున్న నేపథ్యంలో బిడ్డర్లను ఆకర్షించేందుకు కేంద్రం నిబంధనలను సడలించింది. మార్చిన వాటి ప్రకారం కొనుగోలుదారు సంస్థలోని పర్మినెంట్ ఉద్యోగులను కనీసం ఏడాదికాలం పనిలో పెట్టుకోవాలి. ఇంతకుముందు ఇది రెండేండ్లుగా ఉన్నది. అలాగే ప్రస్తుతం నడుస్తున్న పన్ను వివాదంలో సంస్థకు వ్యతిరేకంగా ఫలితం వస్తే.. కొనుగోలుదారుకు రూ.577 కోట్ల నష్టపరిహారం చెల్లిస్తామన్నది. ఆస్తుల అమ్మకానికి సంబంధించిన కాలవ్యవధిని కూడా మూడేండ్ల నుంచి రెండేండ్లకు తగ్గించింది. పవన్ హన్స్‌లో కేంద్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్నది. మిగతా 49 శాతం వాటా ఓఎన్‌జీసీకి ఉన్నది. సంస్థకు 43 హెలికాప్టర్లున్నాయి. ఈ హెలికాప్టర్ సేవల సంస్థలో వాటా విక్రయానికి గత ఆర్థిక సంవత్సరం మోదీ సర్కారు ప్రయత్నించి విఫలమైంది. ఏ ఒక్కరూ కొనేందుకు ముందుకు రాలేదు. దీంతో నిబంధనల్లో మార్పులు చేయాల్సి వచ్చింది. ఈ నెల 5న లోక్‌సభలో వార్షిక బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఎయిర్ ఇండియా వాటాను మాత్రమే అమ్మేయబోమని, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా మరిన్ని సంస్థల్లో వాటాలను విక్రయిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. దీంతో ఆ దిశగా సర్కారు ఇప్పుడు అడుగులు వేస్తున్నదని నిపుణులు తాజా పరిస్థితులను విశ్లేషిస్తున్నారు.




# కుమార మంగళం వేతనంలో 19 శాతం తగ్గుదల



**న్యూఢిల్లీ, జూలై 21:** గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను అల్ట్రాటెక్ చైర్మన్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార మంగళం బిర్లా రూ.15.53 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. అంతక్రితం ఏడాది పొందిన రూ.19.13 కోట్ల జీతంతో పోలిస్తే 18.8 శాతం తగ్గినట్లు సంస్థ వార్షిక నివేదికలో వెల్లడించింది. దేశంలో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థయైన అల్ట్రాటెక్ రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నది. గడిచిన రెండేండ్లుగా బిర్లా వేతనంలో తగ్గుదల నమోదైంది. 2016-17లో బిర్లా రూ.22.50 కోట్ల వార్షిక వేతనం అందుకోగా, ఆ మరుసటి ఏడాదిలో ఇది రూ.19.13 కోట్లకు పడిపోయింది. 2018-19లో సంస్థలో సాధారణ ఉద్యోగి పొందిన వేతనంతో పోలిస్తే బిర్లా 202.9 రెట్లు అధికంగా లభించింది. 2016-17లో ఇది 387.9 రెట్లు అధికంగా ఉండగా, 2017-18లో 375.2 రెట్లు అధికం. గతేడాదికిగాను సాధారణ ఉద్యోగి రూ.7.65 లక్షల వార్షిక వేతనాన్ని అందుకున్నట్లు తన వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 8.5 శాతం అధికం. అల్ట్రాటెక్ మేనేజింగ్ డైరెక్టర్ కేకే మహేశ్వరి జీతం కూడా 4.76 శాతం తగ్గి రూ.12.96 కోట్లకు పడిపోయింది. మార్చి 31, 2019 నాటికి కంపెనీలో 19,557 మంది సిబ్బంది ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ల ద్వారా సంస్థ ప్రతియేటా 10.28 కోట్ల టన్నుల సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నది. గతేడాదికిగాను సంస్థ రూ.36,775 కోట్ల ఆదాయంపై రూ.2,432 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

# మహీంద్రా చీఫ్ కంటే టాటా మోటర్స్ బాస్ వేతనం రెండు రెట్లు అధికం



**న్యూఢిల్లీ, జూలై 21:** వాహన విక్రయాల్లో పోటీ పడుతున్న దేశీయ ఆటోమొబైల్ సంస్థలైన టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా బాస్‌ల వేతనాల్లో మాత్రం అంతరం ఎక్కువగా ఉన్నది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను టాటా మోటర్స్ ఎండీ, సీఈవో గ్యుంటర్ బుట్చెక్ రూ.26.29 కోట్ల వార్షిక వేతనాన్ని పొందారు. అంతక్రితం ఏడాది పొందిన వేతనంతో పోలిస్తే 1.57 శాతం అధికం. కంపెనీ వార్షిక నివేదిక ప్రకారం ఈ విషయం వెల్లడైంది. ఇదే సమయంలో మహీంద్రా అండ్ మహీంద్రా మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయెంకా మొత్తం రెమ్యునరేషన్ రూపంలో రూ.12.19 కోట్లు పొందారు. 2017-18లో పొందిన దాంతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. వీరిద్దరి మధ్య వేతనం అంతరం ఇంచుమించు రెండు రెట్ల స్థాయిలో ఉన్నది. బుట్చెక్ పనితీరు ఆధారంగా ఇచ్చే బోనస్, ఇతర రాయితీలు కలుపుకొని రూ.9.23 కోట్లు చెల్లించిన టాటా..రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద మరో రూ.32,02,494లు చెల్లించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను పనితీరు ఆధారంగా ఇచ్చే బోనస్ 5.94 లక్షల యూరోలు(ప్రస్తుత రేటు ప్రకారం ఇది రూ.77.67 కోట్లు) చెల్లించడానికి సంస్థ అధికారిక ఒప్పందం కుదుర్చుకున్నది. దీర్ఘకాలిక రాయితీల కింద మరో 5.94 లక్షల యూరోలు కూడా చెల్లించబోతున్నది. గతేడాదికిగాను టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ బోర్డు, కమిటీ సమావేశాలకు హాజరైనందుకుగాను రూ.6 లక్షలు చెల్లించింది. మరోవైపు మహీంద్రా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా జీతం 7.97 శాతం పెరిగి రూ.8.67 కోట్లు పొందారు. టాటా మోటర్స్ గతేడాదిలో 12,74,072 యూనిట్ల వాహనాలను విక్రయించింది. వీటిలో కమర్షియల్ వాహనాలు 5,27,286 యూనిట్లు కాగా, ప్యాసింజర్ వాహనాలు 7,46,786 యూనిట్లు ఉన్నాయి. ఇదే సంవత్సరంలో మహీంద్రా అమ్మకాలు 10.76 శాతం పెరిగి 6,07,548లకు చేరాయి. కంపెనీ ట్రాక్టర్ల అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 3.4 శాతం పెరిగి 3,30,436లకు చేరుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టాటా ప్యాసింజర్ వాహన విక్రయాలు 42,034లకు చేరుకోగా, ఇదే సమయంలో మహీంద్రా 59,400లకు చేరాయి.

# ఈసారి 4.1 శాతమే

## 2019-20కిగాను దేశ ద్రవ్యోల్బణం అంచనాను తగ్గించిన ఏడీబీ

**న్యూఢిల్లీ, జూలై 21:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను దేశ ద్రవ్యోల్బణం అంచనాను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) తగ్గించింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ బలపడుతుండటం, జీడీపీ అంచనాల్లో కోతల మధ్య ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం 4.1 శాతంగా ఉండొచ్చని చెప్పింది. ఇంతకుముందు ఇది 4.3 శాతంగా ఉంది. దక్షిణాసియా ప్రాంతంలో ద్రవ్యోల్బణం తగ్గేందుకు భారత్ ప్రధాన చోదక శక్తి కాగలదన్న ఏడీబీ.. ఈ ఏడాది దక్షిణాసియా దేశాల ద్రవ్యోల్బణం అంచనానూ 4.7 శాతం నుంచి 4.5 శాతానికి దించింది. ఆసియా అభివృద్ధి ముఖచిత్రం (ఏడీవో) 2019కు తాజా అనుబంధంలో ఏడీబీ ఈ అంచనాల్ని వెలిబుచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020-21)గాను ద్రవ్యోల్బణం అంచనాను 4.4 శాతంగా పేర్కొన్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సైతం 2019-20 ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబర్) రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను 3.4-3.7 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 3.5-3.8 శాతంగా ఉండేది. ఆర్బీఐ వచ్చే నెల ఆరంభంలో ద్వైమాసిక ద్రవ్యవిధాన పరపతి సమీక్షను చేపట్టనున్నది. ద్రవ్యోల్బణం గణాంకాల ఆధారంగానే కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ సవరిస్తున్న సంగతి విదితమే. దీంతో ద్రవ్యోల్బణం మరింత అదుపులోకి వస్తే రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను తగ్గించేందుకు అవకాశముంటుంది. కాగా, ఈ ఏడీవోలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను దేశ జీడీపీ అంచనాను 7 శాతంగా ఏడీబీ పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ అనుబంధంలో 7.2 శాతంగా అంచనా వేయగా, ఇప్పుడు 0.2 శాతం మేర తగ్గించింది.



### ‘ప్రీమియం మొబైళ్లపై కస్టమ్స్ సుంకాన్ని పెంచండి’

**న్యూఢిల్లీ, జూలై 21:** పన్ను ఎగవేతలను నియంత్రించడానికి, చట్టానికి వ్యతిరేకంగా ప్రీమియం మొబైళ్లను విక్రయిస్తున్నవారిపై ఉక్కుపాదం మోపడానికి కేంద్ర ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని మొబైల్ ఇండస్ట్రీ బాడీ ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్ అసోసియేషన్(ఐసీఈఏ) సూచించింది. దొంగచాటున విదేశాల నుంచి దిగుమతి చేసుకొని ప్రీమియం మొబైళ్లను విక్రయిస్తున్న వారితో ప్రతియేటా రూ.2,500 కోట్ల మేర నష్టపోవాల్సి వస్తున్నదని, వీటిని నియంత్రించాలంటే రూ.20 వేల కంటే అధిక ధర కలిగిన ప్రతి మొబైల్ దిగుమతిపై రూ.4 వేల కస్టమ్స్ సుంకాన్ని విధించాలని కేంద్రానికి ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మోహింద్రో సూచించారు. ప్రస్తుతం దిగుమతి అవుతున్న ప్రీమియం మొబైళ్లపై 20 శాతం సుంకం విధిస్తున్నారని, వీటికితోడు మరో రూ.4 వేలు విధించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన సూచించారు.

# ఎగుమతుల వృద్ధి కోసం..!

## 31 ఉత్పత్తులను సిఫారసు చేసిన సీఐఐ.. మహిళల దుస్తులు, ఔషధాలకు తొలి ప్రాధాన్యత



**న్యూఢిల్లీ, జూలై 21:** పడిపోయిన దేశీయ ఎగుమతులను తిరిగి నిలబెట్టేందుకు పారిశ్రామిక సంఘం సీఐఐ.. 31 ఉత్పత్తులను గుర్తించింది. గత నెల భారతీయ ఎగుమతులు గతేడాదితో పోల్చితే 9.71 శాతం క్షీణించి, ఎనిమిది నెలల కనిష్ఠాన్ని చేరిన విషయం తెలిసిందే. జూన్‌లో 25.01 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో మహిళల దుస్తులు, ఔషధాలు, సైక్లిక్ హైడ్రోకార్బన్లు తదితర 31 ఉత్పత్తుల ఎగుమతిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సీఐఐ అభిప్రాయపడింది. ఫర్నీచర్, టెలిఫోన్ సెట్లు, ఎలక్ట్రికల్ ఉపకరణాలు, మోటర్ కార్లు, వాహనాల ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ఎగుమతులను మరింత పెంచగలవని ఆదివారం సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అతిపెద్ద ఎగుమతిదారుగా దేశాన్ని నిలబెట్టగలవని తెలిపారు. ‘భారతీయ ఎగుమతులు: తదుపరి పథం-ఉత్పత్తులు-దేశాలు’ అన్న రిసెర్చ్ పేపర్‌ను సీఐఐ విడుదల చేసింది. ఇందులో దేశీయ ఎగుమతుల విస్తరణ కోసం రెండంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. భారతీయ ఎగుమతులకు పట్టున్న దేశాలే లక్ష్యంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చింది.

### పన్ను మినహాయింపులు కావాలి

పడకేసిన విదేశీ వాణిజ్యాన్ని పరుగులు పెట్టించాలంటే పన్నుల నుంచి మినహాయింపు అవసరమని ఈ సందర్భంగా చంద్రజిత్ బెనర్జీ స్పష్టం చేశారు. ఎంపిక చేసిన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన మార్కెటింగ్‌ను కల్పించడానికి ఆయా దేశాలకు పన్నుల భారాన్ని తప్పించాలని అన్నారు. ఏయే ఉత్పత్తికి ఏయే దేశాల్లో డిమాండ్ ఉందో తెలుసుకుని ఆయా దేశాలకు ఎగుమతులు పెంచుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఇందులో భాగంగానే సదరు దేశాల ప్రభుత్వాలతో చర్చించి భారతీయ ఎగుమతులపై దిగుమతి సుంకాలను ఎత్తివేసేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనివల్ల ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతుందన్న ఆయన ఇలాంటి ప్రోత్సాహకాలనే ఆ దేశాల ఉత్పత్తులకూ అందిస్తే గొప్ప వ్యాపారావకాశాలుంటాయని, నూతన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు తెరతీయాలని కోరారు.

### విదేశాల్లో ప్రోత్సాహక కేంద్రాలు

స్వదేశీ బ్రాండ్‌ను ప్రోత్సహించడానికి విదేశాల్లో సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఆయా భారతీయ ఉత్పత్తుల వినియోగానికి వీలుగా అక్కడి నుంచి ప్రచారం చేయాలని సలహా ఇచ్చారు. మార్కెట్‌లోని ప్రత్యర్థి బ్రాండ్లకు, స్థానిక బ్రాండ్లకు గట్టి పోటీనిచ్చేలా వ్యూహాలు సిద్ధం చేస్తే విదేశీ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల హవా కొనసాగుతుందన్నారు. ఇక దేశీయంగానూ తయారీ రంగానికి ఊతమివ్వాలని, పారిశ్రామిక వాడలను బలోపేతం చేయాలని, రోడ్డు, రైలు, పోర్టు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. మెరుగైన రవాణా సౌకర్యాలతోపాటు విద్యుత్, భూకేటాయింపులు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రయోజనాలను కల్పిస్తే.. ఎగుమతులు మళ్లీ గాడిలో పడుతాయన్న విశ్వాసాన్ని చంద్రజిత్ బెనర్జీ వ్యక్తం చేశారు.

# ఒడిదుడుకుల్లో సూచీలు!

## డెరివేటివ్, రూపాయి, ఇంధన ధరలు కీలకం ▪ కార్పొరేట్ల ఫలితాలు కూడా..

**న్యూఢిల్లీ, జూలై 21:** గతవారంలో భారీ నష్టాలను చవిచూసిన స్టాక్ మార్కెట్లు ఈవారంలోనూ మరింత నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్పొరేట్ దిగ్గజాలైన హెచ్‌యూఎల్, మారుతి సుజుకీ, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు విడుదల చేయనున్న ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని, వీటికితోడు డెరివేటివ్ కాంట్రాక్టు గడువు కూడా ఈ వారంలోనే ముగియనుండటం మార్కెట్లు దిద్దుబాటుకు గురయ్యే అవకాశాలున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. గతవారంలో కార్పొరేట్ నిరుత్సాహక ఫలితాలు, పన్నులకు సంబంధించిన సమస్యలు, వినిమయం మందకొడి పరిస్థితులు ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో గత శుక్రవారం ఒకేరోజు 560 పాయింట్లు పడిపోయి ప్రస్తుత సంవత్సరంలో రెండో అతిపెద్ద పతనం చెందింది. పన్నులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఊరట లభించకపోవడంతో విదేశీ పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళన మొత్తం మార్కెట్లపై ప్రభావం పడింది. దీంతో గతవారంలో ఏకంగా రూ.7 వేల కోట్లకు పైగా పెట్టుబడులు తరలించుకుపోవడం దేశీయ మదుపరుల్లో ఆందోళనను పెంచింది. గతవారం చివర్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలకుమించి నమోదు చేసుకోవడం సోమవారం ట్రేడింగ్ సరళిని డిసైడ్ చేయనున్నదని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. వీటితోపాటు దేశీయ, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కూడా మార్కెట్లకు ప్రభావితం చేసే అంశాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రిలయన్స్ ఇండస్ట్రీస్ నికర లాభం 6.8 శాతం ఎగబాకి రూ.10,104 కోట్లుగా నమోదైంది. చమురు మార్జిన్లు తగ్గుముఖం పట్టినప్పటికీ, రిటైల్, టెలికం రంగాలు ఇచ్చిన దన్నుతో విశ్లేషకుల అంచనాలకుమించి ఫలితాలను నమోదు చేసుకున్నది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం కూడా 18.04 శాతం అధికమై రూ.5,676.06 కోట్లకు చేరుకున్నది. ఈక్విటీ మార్కెట్లు మరికొన్ని రోజులు దిద్దుబాటుకు గురయ్యే అవకాశాలున్నాయని, జూలై 30-31న అమెరికా ఫెడరల్ రిజర్వు సమావేశం, ఇప్పుడిప్పుడే వర్షాలు ఆశించిన స్థాయిలో కురుస్తుండటం, ఆటో, బ్యాంకింగ్ రంగ సంస్థలు తమ తొలి త్రైమాసిక ఫలితాలను ప్రకటించనుండటం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని యాక్సిస్ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవో అరుణ్ తుక్రల్ తెలిపారు. ఈవారంలో డీహెచ్ఎఫ్ఎల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటా మోటర్స్, బజాజ్ ఆటో, మారుతిలు ఫలితాలను ప్రకటించబోతున్నాయి. కార్పొరేట్లు ఆశించిన స్థాయిలో ఫలితాలు ప్రకటిస్తే మార్కెట్లు దూసుకుపోనున్నాయని, లేకపోతే పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. గతవారంలో సెన్సెక్స్ 399.22 పాయింట్లు పతనం చెంది 38,337.01 వద్ద ముగిసింది. శుక్రవారం ఒక్కరోజే 560.45 పాయింట్లు దిగజారింది. వీటితోపాటు చమురు ధరల శ్రేణి, రూపాయి కదలికలు, పెట్టుబడుల సరళి కూడా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు.




### బ్లూ-చిప్ సంస్థలకు నిరాశే..

గతవారం బ్లూ-చిప్ సంస్థలకు నిరాశే మిగిల్చింది. టాప్-10 సంస్థల్లో ఆరింటి మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.62,147.70 కోట్లు కోల్పోయాయి. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్‌లు అత్యధికంగా నష్టపోయాయి. వీటితోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు నష్టపోగా, కేవలం హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్, ఇన్ఫోసిస్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు మాత్రం తమ మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను పెంచుకున్నాయి. గత వారంలో ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ.20,031 కోట్లు తగ్గి రూ.7,91,750.71 కోట్లకు జారుకోగా, టీసీఎస్ ఎం-క్యాప్ రూ.11,632.40 కోట్లు తగ్గి రూ.7,79,351.54 కోట్లకు పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంక్ రూ.10,928 కోట్లు కోల్పోగా, ఐటీసీ రూ.8,035.26 కోట్లు, ఎస్బీఐ రూ.6,738.08 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.4,782.42 కోట్లు తగ్గాయి. కానీ ఇన్ఫోసిస్ అత్యధికంగా రూ.25,125.99 కోట్లు పెరిగి రూ.3,37,418.53 కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ రూ.8,152.05 కోట్లు పెరుగగా, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.2,990.49 కోట్లు, హెచ్‌యూఎల్ రూ.2,489.52 కోట్లు చొప్పున బలపడ్డాయి.

## ఎఫ్‌పీఐల పెట్టుబడులకు బ్రేక్

### జూలైలో ఈక్విటీల నుంచి రూ.7,712 కోట్లు వెనక్కి




ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్ విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళనను మరింత పెంచింది. వరుసగా ఐదు నెలలపాటు దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) ..ప్రస్తుత నెలలో భారీగా తరలించుకుపోయారు. సంపన్న వర్గాలపై అధిక పన్ను విధించడం, విదేశీ పెట్టుబడులకు ఎలాంటి రాయితీలు ఇచ్చే అవకాశాలు లేవని మంత్రి స్పష్టం చేయడంతో ఎఫ్‌పీఐల్లో ఆందోళన మరింత పెరిగింది. దీంతో ప్రస్తుత నెల 1 నుంచి 19 వరకు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.7,712.12 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. ఇదే సమయంలో డెబిట్ మార్కెట్లలో రూ.9,371.12 కోట్లు ఇన్వెస్ట్ చేయడం విశేషం. నికరంగా ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు రూ.1,659 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు అయింది. బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై పన్ను ప్రతిపాదన విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళన పెంచిందని, దీంతో వారు పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి మొగ్గుచూపారని మార్నింగ్‌స్టార్ సీనియర్ విశ్లేషకులు హిమాన్షు శ్రీవాస్తవ తెలిపారు. వీటికితోడు కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, దేశ జీడీపీ మందగించడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఏడీబీ వృద్ధి అంచనాల్లో కోత విధించడం తదితర అంశాలు కూడా పెట్టుబడులు ఉపసంహరించుకోవడానికి కారణాలని ఆయన విశ్లేషించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే దేశీయ ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడానికి ఎఫ్‌పీఐలు పెద్దగా చొరవ చూపించినట్లు అనిపించడం లేదని చెప్పారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా తమవంతు పాత్ర పోషించాయి.

## ఏపీకి బిలియన్ డాలర్ల సాయం

ఆర్థికసాయంపై ప్రపంచ బ్యాంకు స్పష్టత

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ఆర్థికసాయంపై ప్రపంచ బ్యాంకు స్పష్టతనిచ్చింది. ఏపీ ప్రభుత్వానికి ఒక బిలియన్ (రూ.6,886 కోట్లు) డాలర్ల మేర ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించింది. ఈ నెల 15న ఏపీ రాజధానికి ఆర్థికసాయంపై ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకొన్నదని ప్రపంచ బ్యాంకు తెలిపింది. కేంద్రం ఉపసంహరణతోనే తమ డైరెక్టర్ల బోర్డు ఆ నిర్ణయం తీసుకొన్నదని వెల్లడించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వం కారణంగానే ఏపీకి ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయం వెనక్కు తీసుకొన్నదని ఇటీవల ప్రతిపక్ష టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో వరల్డ్ బ్యాంక్ స్పష్టతనిచ్చింది.

## ఇలాంటి నగరాన్ని ఇష్టపడనివారు ఎవరుంటారు?




యూఎస్ కాన్సూల్ జనరల్ క్యాథరిన్ హడ్డా ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నెమళ్లు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కనిపిస్తుండటం సాధారణమే. నగరానికి వచ్చిపోయేవారికి ఇవి స్వాగతం పలుకుతుంటాయి. ఇక్కడున్న జీవవైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. ఇదే విషయాన్ని యూఎస్ కాన్సుల్ జనరల్ క్యాథరిన్ హడ్డా ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. నెమళ్ల రక్షణ అందరి బాధ్యతని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని ఐఎస్బీ వద్ద 'పికాక్ క్రాసింగ్.. ప్లీజ్ డ్రైవ్ స్లోలీ' అని రాసి ఉన్న సైన్‌బోర్డును ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు కృషిచేసేలా ఇలాంటి బోర్డులున్న నగరాన్ని ఇష్టపడనివారు ఎవరుంటారు? అని అందులో పేర్కొన్నారు.

**'స్పేస్ అండ్ సైన్స్' వర్క్‌షాప్**

అపోలో-11 చంద్రుడిపై దిగి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా యూఎస్ కాన్సులేట్, యూఎస్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించాయి. స్పేస్ అండ్ సైన్స్ పేరుతో శని, ఆదివారాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ అధికార ప్రతినిధి ఆకాశ్‌సూరి మాట్లాడుతూ.. సైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

ముంబై-విశాఖపట్నం

## విమానంలో సాంకేతిక లోపం

■ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ గుర్తించి అత్యవసర ల్యాండింగ్

**శంషాబాద్:** ముంబై-విశాఖపట్నం విమానం సాంకేతికలోపంతో ముంబైలో ఆదివారం అత్యవసరంగా ల్యాండయింది. స్పైస్‌జెట్ ఎస్జీ-421 విమానం ఉదయం ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా విశాఖపట్నం వెళ్లాల్సి ఉన్నది. ముంబైలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతికలోపాన్ని గుర్తించిన పైలట్.. వెంటనే విమానాశ్రయ అధికారులను సంప్రదించి అత్యవసరంగా దించివేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 7.45 గంటలకు బయల్దేరాల్సిన ఈ విమానం ఆలస్యం కావడంతో బోర్డింగ్ పాయింట్ వద్ద ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు.





• **యాదాద్రికి పోటెత్తిన భక్తజనం**

యాదాద్రి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రద్దీ కారణంగా లక్ష్మీనారసింహుడిని దర్శించుకునేందుకు గంటలకొద్దీ సమయం పట్టింది. శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రత పూజల్లోనూ భక్తులు పాల్గొన్నారు. స్వామివారి ఖజానాకు రూ.15,33,397 ఆదాయం సమకూరింది. **- యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ**

# ఎన్నారై సంబంధమా.. జాగ్రత్త!

- అమ్మాయిల తల్లిదండ్రులకు పోలీసుల సూచన
- పెరుగుతున్న ఎన్నారై అల్లుళ్ల వేధింపుల కేసులు
- ఐదేండ్లలో 217 కేసుల్లో లుక్‌అవుట్ నోటీసులు
- కేసుల చేధనకు ప్రత్యేక ఎన్నారై సెల్ ఏర్పాటు
- విదేశీ కాన్సులేట్ ఆఫీసులతో సంప్రదింపులు
- 'నమస్తే తెలంగాణ'తో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జి, ఐజీ స్వాతిలక్రా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'అమెరికా సంబంధం.. అమ్మాయి భవిష్యత్తు బాగుంటుంది.. బిడ్డ విదేశాల్లో ఉంటుందంటే మా గౌరవమూ పెరుగుతుంది..' అనే ఆలోచనలు ఒకప్పుడు బాగానే ఉండేవి. కానీ ఇదే ఆలోచన ఇప్పుడు ఎంతోమంది అమ్మాయిల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నది. ఎన్నో కలలతో కన్నబిడ్డ పెండ్లిచేసి పంపిన తల్లిదండ్రులకు కన్నీళ్లు పెట్టిస్తున్నది. అందరు ఎన్నారైలు ఇలాంటివారు కాకపోయినా ఇటీవల ఎన్నారై అల్లుళ్ల వేధింపుల కేసులు పెరుగటం ఆందోళన కలిగిస్తున్నది. ఐదేండ్లలో 217 కేసుల్లో లుక్‌అవుట్ నోటీసులు జారీకావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. స్వదేశంలో మోసం చేసి, విదేశాల్లో దర్జాగా బతికేస్తున్న ఎన్నారై అల్లుళ్ల భరతం పట్టేందుకు తెలంగాణశాఖ నడుం బిగించింది. ఎన్నారై వివాహ కేసుల దర్యాప్తు వేగవంతం చేసేలా ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో ప్రత్యేక ఎన్నారై సెల్‌ను ఇటీవలే ఏర్పాటుచేశారు. కేసుల దర్యాప్తుపై సీరియస్‌గా దృష్టిపెడుతున్నారు. ఎన్నారై కేసుల దర్యాప్తులో అధికారులకు అవసరమైన సహకారం, బాధితులకు సాయం అందించడం సెల్ లక్ష్యమని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జి, ఐజీ స్వాతి లక్రా 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఎన్నారై సంబంధం వచ్చిందని పూర్తి వివరాలు తెలుసుకోకుండా తొందరపడి గుట్టుచప్పుడుకాకుండా వివాహాలు చేయవద్దని సూచించారు. అవతలి వ్యక్తులు తొందరపెట్టినా పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ముందుకెళ్లాలని, పెండ్లిని తప్పక రిజిస్టర్ చేయించాలని చెప్పారు.

**పాస్‌పోర్టుల రద్దుతో కొంతవరకు దారిలోకి**

ఎన్నారై అల్లుళ్ల కేసుల్లో విదేశాలకు వెళ్లి తిరిగి రాకుండా అక్కడే ఉంటున్న వారికి పోలీసులు లుక్‌అవుట్‌నోటీసులు జారీ చేస్తున్నారు. తర్వాత కోర్టు ద్వారా నాన్‌బెయిలబుల్ వారంట్లు జారీ చేస్తున్నారు. ఈ సమాచారాన్ని విదేశాంగశాఖకు పంపుతున్నారు. అక్కడ పూర్తి వివరాలు చూసిన తర్వాత వారి పాస్‌పోర్టులు రద్దు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నారై వేధింపుల కేసుల్లో పాస్‌పోర్టు రద్దుకు సంబంధించి 2018లో 118 కేసులు, 2019లో జూన్ వరకు 77 కేసులు వచ్చినట్టు రీజినల్ పాస్‌పోర్టు అధికారులు తెలిపారు. పాస్‌పోర్టు రద్దుతో చాలా కేసుల్లో ఎన్నారై నిందితులు దారిలోకి వస్తున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఎన్నారైల వివాహ రిజిస్ట్రేషన్ బిల్లు-2019 చట్టమైతే అది ఎన్నారై అల్లుళ్ల పాలిట బ్రహ్మాస్త్రంగా మారనున్నది. భారత మహిళలను వివాహం చేసుకున్న 30 రోజుల్లో పెండ్లిని రిజిస్టర్ చేయకపోతే వారి పాస్‌పోర్టు జప్తు అయ్యేలా చట్టంలో పొందుపరుస్తున్నారు.

**ఎన్నారై కేసుల్లో పోలీసులిచ్చిన ఎల్వోసీలు**

| ఏడాది | ఎల్వోసీల సంఖ్య |
|---|---|
| 2014 | 07 |
| 2015 | 21 |
| 2016 | 27 |
| 2017 | 76 |
| 2018 | 86 |

**కేసుల్లో ప్రధాన కారణాలివే..**

- ఎన్నారై భర్తలు పెండ్లయిన నాలుగు నుంచి పది రోజులకే భార్యలను ఇక్కడే వదిలి విదేశాలకు వెళ్లి, తిరిగి రానివారు ఎక్కువగా ఉంటున్నారు.
- విదేశాల్లో స్థిరపడి అక్కడి యువతిని పెండ్లి చేసుకున్నవారు సైతం తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకోలేక, వారికోసం ఇక్కడ మరో పెండ్లి చేసుకుంటున్నారు. తర్వాత భార్య నచ్చలేదంటూ సాకులు చెప్తూ వదిలేస్తున్నారు.
- కొందరు పెండ్లి తర్వాత అదనపు కట్నం, ఆస్తుల కోసం వేధిస్తున్నారు. ఇంకొందరు పాశ్చాత్య సంస్కృతులకు అలవాటుపడి భార్యలను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు. కొన్ని ఘటనల్లో భార్యలను ఇండ్లలో తాళం వేసి బయటికి వెళ్తున్న శాడిస్టులూ ఉంటున్నారు.
- భార్యలను దేశంకాని దేశంలో ఎయిర్‌పోర్టుల్లో ఒంటరిగా వదిలేసి వెళ్తున్న హృదయ విదారక ఘటనలు ఉంటున్నాయి.
- విదేశీ చట్టాలను ఉపయోగించుకుని ఎక్స్‌పార్టీ డివోర్స్ (భార్య అనుమతి లేకుండానే విడాకులిస్తారు) ఇస్తున్నారు. మన దేశంలో వరకట్నం వేధింపులపై 498 (ఏ) కింద కేసులు పెడుతున్నారు. అమెరికా వంటి దేశాల్లో ఈ చట్టం లేకపోవడంతో అక్కడి ఎన్నారై అల్లుళ్లు దర్జాగా బతికేస్తున్నారు.



### సత్వర న్యాయానికే ప్రత్యేక సెల్

చాలావరకు ఎన్నారై భర్తల వేధింపు కేసుల దర్యాప్తు ఎక్కడో ఒకదశలో ఆగిపోతున్నది. వీటి వేగవంతానికి ఎన్నారై సెల్ ఏర్పాటుచేశాం. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న ఎన్నారై మ్యారేజ్ కేసులు, వాటి పురోగతిపై డీఎస్పీ ర్యాంకు అధికారి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఉదాహరణకు కేసు నమోదైన నిందితుడు అమెరికాలో ఉంటున్నాడంటే, అతడి వివరాల సేకరణలో ఎన్నారై సెల్.. ఆ దేశ కాన్సులేట్ అధికారులతో, ఎన్జీవోలతో సంప్రదించి వివరాలు తెలుసుకుంటుంది. పాస్‌పోర్టు రద్దుకు విదేశాంగశాఖ అధికారులతో సంప్రదింపులు, ఇతర న్యాయ సలహాలు అందిస్తుంది. బాధితులు వస్తే వారికి ఏ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టాలి? ఎలా ముందుకు వెళ్లాలి? అన్నదానిపై ఈ సెల్ ద్వారా సహకారం అందిస్తాం. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులకు అవగాహన కల్పిస్తాం. యువతుల తల్లిదండ్రులకు కరపత్రాలు, పోస్టర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

**-స్వాతి లక్రా, ఐజీ, ఇంచార్జి, ఉమెన్ సేఫ్టీ వింగ్**

### ఇవి తప్పక పరిశీలించండి

**యువకుని వివాహస్థితి:** అతడు బ్రహ్మచారినా, వివాహమై విడాకులు తీసుకున్న వ్యక్తా, విదేశాల్లో ఎవరితోనైనా వివాహ సంబంధంలో ఉన్నాడా? తెలుసుకోవాలి.

**వృత్తిపరమైన అంశాలు:** విద్యార్హతలు, ఏ వృత్తిలో ఉన్నాడు, జీతం ఎంత, ఏ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు, అడ్రస్ సరైందేనా సరిచూసుకోవాలి.

**విదేశీ నివాస అర్హతలు:** ఏ విధంగా విదేశీ నివాసం పొందాడు?, వీసా వివరాలు, వివాహమైన తర్వాత భార్యని తీసుకెళ్లడానికి అర్హత ఉన్నదా?..

**ఈ అంశాలు తప్పక పరిశీలించుకోవాలి:** భారత దేశంలో అతడి నివాసం, చిరునామా, కుటుంబం,ఆస్తి వివరాలు, పాస్‌పోర్టు నంబర్ గడువు, వీసా గడువు నంబర్, ఆధార్‌కార్డు నంబర్, విదేశీ రిజిస్ట్రేషన్ కార్డు, సోషల్ సెక్యూరిటీ నంబర్ తెలుసుకోవాలి.

● మ్యారేజ్ బ్యూరోలు, ఏజెంట్లను, మధ్యవర్తులను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి:**

● పెండ్లి చేసుకోబోయేవారి స్నేహితులు, విదేశంలో స్థిరపడ్డ బంధువు ఫోన్‌నంబర్లు, ఈ-మెయిల్ వివరాలు తెలుసుకోవాలి.

● ఆ యువతి ఏ దేశం వెళ్తుందో, ఆ దేశపు, మన దేశపు చట్టాలపై అవగాహన ఉండితీరాలి. భర్త కార్యాలయం ఫోన్ నంబర్లు తీసుకోవాలి.

● తన పాస్‌పోర్టు, వీసా, బ్యాంక్ అకౌంట్ వివరాలు, వివాహ సర్టిఫికెట్, ఇతర వివరాలను స్కాన్ చేయించి తన వద్ద, తల్లిదండ్రుల దగ్గర ఉంచాలి. భర్త పాస్‌పోర్టు, వీసా, డ్రైవింగ్ లైసెన్స్ నంబర్,సోషల్ సెక్యూరిటీ నంబర్, ఓటర్ కార్డు ఫొటో కాపీ తన దగ్గర పెట్టుకోవాలి.

● సంబంధం కుదిర్చిన మధ్యవర్తులు, ఏజెంట్లు, ఏజెన్సీలు మోసగించి తప్పుడు సమాచారం ఇస్తే..మోసపోయిన మహిళ ఏజెంట్లు, మధ్యవర్తులపైనా ఐపీసీ సెక్షన్ 494 కింద కేసు పెట్టవచ్చు.



## సింగపూర్‌లో ఘనంగా బోనాలు

టీసీఎస్ఎస్ ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది వేడుకలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగపూర్‌లోని తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ (టీసీఎస్ఎస్) ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా జరిగింది. సింగపూర్‌లోని సుంగే కేడుట్‌లోని శ్రీఅరసకేసరి శివన్ ఆలయంలో కన్నుల పండువగా జరుపుకొన్నారు. తెలంగాణ మహిళలు భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి బోనాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో పోతరాజులు, పులివేషాలు, తొట్టెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో 700 మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా తీన్మార్ స్టెప్పులతో అదరగొట్టారు. పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రెండేండ్లుగా బోనాల జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్టు టీసీఎస్ఎస్ అధ్యక్షుడు నీలం మహేందర్ తెలిపారు. వేడుకల్లో పాల్గొన్నవారికి, దాతలకు సొసైటీ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. బోనాల ఉత్సవాల్లో టీసీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బసిక ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గడప రమేశ్, గర్రేపల్లి శ్రీనివాస్, కోశాధికారి నల్ల భాస్కర్‌గుప్త, కార్యనిర్వాహక సభ్యులు ప్రవీణ్‌కుమార్ చెన్నోజ్వాల తదితరులు పాల్గొన్నారు.

### అక్క చావుకు కారణమయ్యాడనే హత్య

నల్లగొండ జిల్లా నాంపల్లి హత్యకేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

**నాంపల్లి:** తమ అక్క చావుకు కారణమయ్యాడనే కక్షతోనే నల్లగొండ జిల్లా నాంపల్లిలో శనివారం ఓయువకుడిని ఇద్దరు నరికి చంపారని ఆదివారం నల్లగొండ ఇంచార్జి ఎస్పీ ఆర్ వెంకటేశ్వర్లు తెలిపారు. నాంపల్లికి చెందిన మహ్మద్ గౌస్, మారేపల్లికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌ల పెద్దమ్మ కూతురైన మారేపల్లి గ్రామానికి చెందిన షేక్ రజియాకు పదిహేనేండ్ల క్రితం నల్లగొండకు చెందిన మొయినొద్దీన్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. 2016లో భర్త చనిపోగా తన పిల్లలతో తల్లిగారింటికి వచ్చి గ్రామంలోనే ఉంటున్నది. ఈ సమయంలో ఆమెకు బంధువైన నాంపల్లి మండలం నేరళ్లపల్లికి చెందిన కారు డ్రైవర్ షేక్ సద్దాంహుస్సేన్ హైదరాబాద్‌లో పని ఇప్పిస్తానని రజియాను తన వెంట తీసుకెళ్లాడు. ఇద్దరు హైదరాబాద్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో 2017 సెప్టెంబర్‌లో రజియా సద్దాం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తమ అక్క చావుకు కారణమవడంతో పాటు ఆమె పిల్లలను పట్టించుకోవడం లేదని మహ్మద్ గౌస్, మహ్మద్ ఇర్ఫాన్‌లు సద్దాంపై ద్వేషం పెంచుకున్నారు. శనివారం సాయంత్రం నాంపల్లిలో ఓ టీస్టాల్ వద్ద మహ్మద్ గౌస్, ఇర్ఫాన్‌లకు తారసపడ్డాడు. దీంతో వారు సద్దాంను కొబ్బరికాయల కత్తితో తల మొండెం వేరు చేసి తలను పట్టుకొని బైక్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు లొంగిపోయారు.

## కవులను ఆలోచింపజేస్తున్న నానీలు

'నానీ నేత్రాలు' ఆవిష్కరణ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ గోపి

**భువనగిరి టౌన్:** ఆధునిక తెలుగు కవిత్వంలో రెండు దశాబ్దాల కిందట వేళ్లూనుకున్న నానీల ప్రక్రియ నేడు విస్తృతమై వందలమంది కవులను ఆకర్షించిందని నానీల సృష్టికర్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎన్ గోపి పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో ఆదివారం జరిగిన మధుర కవి, అభినవ పోతన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య నానీల సంపుటి 'నానీ నేత్రాలు' ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నానీల ప్రక్రియ ప్రత్యేకతను సంతరించుకున్నదని చెప్పారు. అనంతరం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ విఠలాచార్యను, ఉమ్మడి నల్లగొండ జిల్లా నానీల కవులను సత్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు డాక్టర్ ఎస్ రఘు, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, కూరెళ్ల శ్రీనివాస్, దాసోజు జ్ఞానేశ్వర్, డాక్టర్ దాసోజు పద్మావతి, శివకోటి రాఘవాచారి, ఈపూరి విశ్వప్రసాద్ పాల్గొన్నారు.



యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య 'నానీ నేత్రాలు' సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎన్ గోపి తదితరులు

## రైతుకు 'అదృష్టం పండింది'!

కర్నూలు పొలంలో విలువైన వజ్రం!



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో ఓ రైతుకు పొలంలో 'అదృష్టం పండింది'. విలువైన వజ్రం లభించింది. దాదాపు రూ.60లక్షల విలువైన ఆ వజ్రాన్ని రైతు అందులో నాలుగో వంతుకే అమ్మేసుకున్నాడు. కర్నూలు జిల్లా గొల్లవానిపల్లెకు చెందిన ఓ రైతుకు తన పొలంలో వజ్రం కనిపించింది. దానిని స్థానికంగా ఓ వ్యాపారికి చూపించగా ఆయన రూ.13.5 లక్షల నగదు, ఐదు తులాల బంగారం ఇచ్చి తీసుకున్నాడు. జిల్లావ్యాప్తంగా ఈ విషయం ప్రచారం కాగా.. పోలీసులు తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఆ వజ్రం రంగు, పరిమాణం వివరాలేమీ వెల్లడికాలేదు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వానకాలంలో జిల్లాలో వజ్రం లభించడం ఇది రెండోసారి. జూన్ 12న జొన్నగిరిలో పశువుల కాపరికి ఎనిమిది క్యారెట్ల వజ్రం దొరికింది. దానిని ఆయన రూ.20 లక్షలకు అమ్మేశాడు. వాస్తవానికి దాని విలువ రూ.50 లక్షలుంటుందని అంచనా. ఉపనదులతోసహా కృష్ణా బేసిన్‌లో వజ్రాలు లభిస్తాయని ప్రతీతి.

## జిరాక్స్ దుబాయ్ నోట్లతో మోసం

వెస్టర్న్ యూనియన్‌లో సినీఫక్కీలో నకిలీనోట్ల మార్పిడి

అసలు నోట్లు తీసుకుని ఉడాయించిన దుండగులు

**నవీపేట:** నిజామాబాద్ జిల్లా నవీపేటలోని శ్రీహన్మాన్ ఏజెన్సీ వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రంలో శనివారం రాత్రి ఇద్దరు దుండగులు సినీఫక్కీలో మోసానికి పాల్పడ్డారు. దుబాయ్ జిరాక్స్ నకిలీనోట్లు (రియాల్) ఇచ్చి 89 వేల అసలు రూపాయలతో ఉడాయించారు. బాధితుడు, వెస్టర్న్ యూనియన్ యజమాని చంద్రమోహన్ వివరాల ప్రకారం.. ఇద్దరు పల్సర్ బైక్‌పై నవీపేటలోని వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రానికి వచ్చారు. తన వద్ద ఉన్న దుబాయ్ నోట్లను చూపి ఎన్ని రూపాయలు వస్తాయని అడగగా.. రూ.89 వేలు వస్తాయని నిర్వాహకుడు చెప్పాడు. వెస్టర్న్ యూనియన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న రేఖకు దుబాయ్ అసలు నోట్లకు బదులు జిరాక్స్ నోట్లున్న పాకెట్ ఇచ్చి రూ.89 వేలతో బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో నిందితుడితో కలిసి పారిపోయారు. పాకెట్ తెరిచి చూసేలోగా నిందితులు పారిపోయారని శనివారం రాత్రి నవీపేట పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు చంద్రమోహన్ ఫిర్యాదు చేశాడు. నిందితులు ఎలా మోసానికి పాల్పడిందీ సీసీకెమెరాలో నిక్షిప్తమైంది. శనివారం ఇదే తరహాలో నిందితులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సౌమ్య ట్రావెల్స్‌తోపాటు మరో ట్రావెల్స్‌లో మోసానికి పాల్పడినట్లు తెలిసింది. సీసీకెమెరాల పుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకుంటామని నవీపేట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



నిజామాబాద్ జిల్లా నవీపేటలో వెస్టర్న్ యూనియన్‌లో నిందితుడు ఇచ్చిన జిరాక్స్ విదేశీనోట్లు (రియాల్)

### మోడల్ స్కూల్ విద్యార్థిని కిడ్నాప్

జనగామలో వదిలివెళ్లిన దుండగులు

**చేర్యాల, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థిని(12) శనివారం సాయంత్రం కిడ్నాప్‌నకు గురైంది. కాగా జనగామ జిల్లాకేంద్రంలోని బస్టాండ్ పార్కింగ్ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులతోపాటు అపస్మారక స్థితిలో ఉన్న బాలిక కనిపించడంతో స్థానికులు నిలదీశారు. దీంతో దుండగులు బాలికను వదిలిపెట్టి పారిపోయారు. విద్యార్థిని తండ్రి యశ్వంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 4.30 గంటలకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలలో ఆరా తీయగా ఆమె వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కాగా రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకోవడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. జనగామ జిల్లా కేంద్రం బస్టాండ్ పార్కింగ్ ప్రదేశంలో స్కూల్ బ్యాగుతో అపస్మారక స్థితిలో తనను కొందరు గుర్తించి ముఖంపై నీళ్లు చల్లడంతో తేరుకున్నానని బాలిక తెలిపింది. అనంతరం స్థానికులు చేర్యాల వైపు వచ్చే బస్సుఎక్కించి ఇంటికి పంపించారని చెప్పింది.

## ఆర్థికాభివృద్ధిలో భారత్ ముందంజ

- వైద్యసేవలను గ్రామాలకు విస్తరించేందుకు ప్రైవేటు రంగం చొరువతీసుకోవాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత ఆర్థిక వ్యవస్థ అత్యంతవేగంగా అభివృద్ధి చెందతుతున్నదని, దేశంలో సంస్కరణలు వేగం పుంజుకున్నాయని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో భారత సంతతి వైద్యుల అంతర్జాతీయ ఆరోగ్య సదస్సును ప్రారంభించారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఇండియా, అసోసియేషన్ ఆఫ్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకయ్యానాయుడు మాట్లాడుతూ.. త్వరలో భారత్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మూడవదిగా ఆవిర్భవిస్తుందని, ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)తోపాటు మూడీస్ లాంటి ప్రఖ్యాత రేటింగ్ సంస్థలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయని అన్నారు. మన దేశంలో మానవవనరులకు కొదవలేదని, దేశ జనాభాలో సగంమంది 25 ఏండ్లలోపువారే ఉన్నారని తెలిపారు. దేశంలో అపారమైన జ్ఞానసంపద ఉన్నప్పటికీ దీన్ని సరిగ్గా వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ వైద్యరంగంలో భారతీయ మూలాలున్న వైద్యులు ముఖ్య భూమిక పోషిస్తున్నారని, హైదరాబాద్‌లో ఉత్తమ దవాఖానలు ఉన్నాయని చెప్పారు. భారత వైద్య వ్యవస్థపై ప్రపంచవ్యాప్తంగా నమ్మకం పెరుగుతున్నదని, వైద్య సేవలకోసం ఇతర దేశాల నుంచి ఎంతో మంది భారత్‌కు వస్తున్నారని అన్నారు. వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు కేవలం ప్రభుత్వం కృషిచేస్తే సరిపోదని, ఈ విషయంలో ప్రైవేటు రంగం కూడా చొరువతీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధిలో ఆరోగ్యభద్రత ఎంతో కీలకమని, అందుకే కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకం ద్వారా ఇప్పటికే దాదాపు 10 లక్షల మంది లబ్ధిపొందారని వెంకయ్యానాయుడు వివరించారు. భారతీయుల్లో రోగనిరోధక వ్యవస్థ క్షీణించడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, ఈ సమస్యను అధిగమించేందుకు ప్రవాస భారత వైద్యులతో కలిసి కృషిచేయాలని కోరారు. విదేశాల్లో ఉన్నా మాతృదేశ ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను విస్మరించవద్దని సూచించారు. సదస్సు సావనీర్‌తోపాటు భారత పునరుజ్జీవన మండలి రూపొందించిన కాంప్రహెన్సివ్ కార్డియాక్ లైవ్ సపోర్ట్ (సీసీఎల్ఎస్) మాన్యువల్‌ను వెంకయ్యానాయుడు ఆవిష్కరించారు. సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, అపోలో గ్రూప్ సంస్థల చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి, ప్రముఖ వైద్యులు కాకర్ల సుబ్బారావు, నోరి దత్తాత్రేయుడు, అమెరికాలోని పలువురు భారత సంతతి వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కాంప్రహెన్సివ్ కార్డియాక్ లైవ్ సపోర్ట్ మాన్యువల్‌ను ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

## శిలాయుగం సంస్కృతికి చిరునామా రాకాసిపట్నం

దట్టమైన అడవిలో వెలుగులోకి రాకాసిగూళ్లు ■ తెలంగాణ జాగృతి చరిత్ర బృందం అన్వేషణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బృహత్ శిలాయుగ సంస్కృతికి చిరునామాగా రాకాసిపట్నం సమాధులున్నట్టు తెలంగాణ జాగృతి చరిత్ర బృందం సభ్యులు, చారిత్రక అన్వేషకులు కొండవీటి గోపి, నాగులపల్లి జగన్మోహన్‌రావు, సింహాద్రి నారాయణ అన్వేషణలో వెలుగుచూసిందని తెలంగాణ జాగృతి చరిత్ర బృందం ప్రతినిధి శ్రీరామోజు హరగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పినపాక మండల సమీప అమరారం అడవుల్లో నైరుతివైపు 10 కిలోమీటర్ల దూరంలోని గుట్టలమీద వందలసంఖ్యలో రాకాసి గూళ్లున్నాయని, ఈ ప్రాంతాన్నే రాకాసిపట్నంగా పిలుస్తారని తెలిపారు. నాటి మానవ సమూహాల సాంస్కృతిక స్మృతిచిహ్నాలుగా రూపొందించిన ఈ రాకాసిగూళ్లను పురావస్తు పరిభాషలో డోల్మ నాయిడ్స్ అంటారని, గుంత సమాధులు, గూడు, గది, గుహ, కుప్ప, పెట్టె వంటి 16 రూపాల్లో సమాధులుంటాయని, రాకాసిపట్నంలో కనింపిచేవి రాతి గూడు సమాధులని తెలిపారు. 10 టన్నులను మించిన బరువైన కప్పురాయి, చుట్టూ పొందికగా అమర్చిన 4 రాతిగోడలు, లోపలికి ద్వారం, దానికి మూత రాయి, లోపల రాతితొట్లు కనిపిస్తాయి. ప్రతి సమాధి చుట్టు గుండ్రంగా రాళ్లతో కట్టిన వేదిక ఉంటుంది. ఇవి 5/5 అడుగుల నుంచి 8/8 అడుగుల పరిమాణం వరకు ఉండటం విశేషమన్నారు. ఈ ప్రాంతంలో వృక్ష శిలాజాలు కూడా కనిపిస్తున్నాయని, ఇంకా అన్వేషిస్తే రాతి చిత్రాలు లభిస్తాయని హరగోపాల్ వివరించారు.







నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 22 జూలై 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

## వినియోగదారుల సేవల్లో రాణిస్తున్న

# సింధు జోసెఫ్

సక్సెస్ మంత్ర



**డబ్బులున్న ప్రతివారు వ్యాపారం చేయాలనుకుంటారు. వ్యాపారం చేయడం పెద్ద కష్టమేమీ కాదు. చేస్తున్న వ్యాపారం లాభాలు సాధించి సక్సెస్ అయినప్పుడే విజయం సాధించినట్లు. ఆ విజయం రావాలంటే సాధించాలనే పట్టుదల, దానికి తగిన కృషి చేయాలి. అన్నిటికంటే ముందు మనం చేసే సేవల పట్ల వినియోగదారులు సంతోషంగా ఉంటేనే ఎలాంటి వ్యాపారం అయినా ముందుకు సాగుతుంది. అభివృద్ధి చెందుతుంది. కేవలం సేవలు అందించడమే కాదు మనం అందిస్తున్న సేవల్లో ఎలాంటి లోపమున్నా, సమస్యలు ఉత్పన్నమైనా వెంటనే స్పందించగలగాలి. కంపెనీలు రెస్పాండ్ అయ్యే తీరును బట్టే ఆ కంపెనీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అదే కస్టమర్ సర్వీసులకు కాస్త టెక్నాలజీని జోడిస్తే.. కేవలం కంప్లయింట్ తీసుకోవడంతోనే వదిలేయకుండా కాల్ చేసిన కస్టమర్‌కు పర్ఫెక్ట్ రెస్పాన్స్ అందించగలిగితే అనే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే కాగ్నికోర్ టెక్నాలజీస్ దాని కో ఫౌండర్, సీఈవో సింధు జోసెఫ్ సక్సెస్‌మంత్ర.**

**కేరళకు** చెందిన సింధు జోసెఫ్ కాగ్నికోర్ టెక్నాలజీస్ కోఫౌండర్, సీఈవో. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద పిహెచ్‌డీ చేస్తున్న సమయంలో సింధుకు వచ్చిన ఆలోచన.. మహావృక్షమైంది. స్పెయిన్, ఇండియా, అమెరికాలలో బ్రాంచీలు ఏర్పాటు చేసుకోగలిగే స్థాయికి కంపెనీ వెళ్లింది. తన వ్యాపార ప్రయాణం మొదలైన తీరు చూస్తే ఎంతో ఆసక్తిదాయకంగా ఉంటుంది.

### కేరళలో చదివి..

కేరళలోని వాయనాడుకు చెందిన సింధు.. అక్కడే పదోతరగతి వరకూ చదువుకున్నారు. చిన్నతనం నుంచి జీవితమంటే ఏంటో తల్లిదండ్రులు నేర్పిన పాఠాలు ఆమెకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. పై చదువుల కోసం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆమెకు భాషా సమస్య రావడంతో ఇంగ్లీష్ నేర్చుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత చెన్నయ్‌లోని స్టెల్లామేరీ కాలేజీలో గ్రాడ్యుయేషన్, కొచ్చిన్ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు.

### బార్సిలోనావెళ్లి..

2000లో బెంగళూరులోని హనీవెల్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. అక్కడ పనిచేస్తున్న సమయంలో సింధుకు రోష్ చెరియన్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వృత్తిరీత్యా బార్సిలోనాలో సెటిల్ అవ్వాల్సి వచ్చింది. అక్కడే స్థానిక యూనివర్సిటీలో పీహెచ్ డీ చేశారు. రీజనింగ్‌పై ఎక్కువగా ఆసక్తి కనబర్చిన ఆమెకు .. మ్యాథ్స్ సబ్జెక్ట్ అంటే ఇష్టం ఏర్పడింది. దాని ప్రభావంతోనే సమస్యలను అధిగమించేతత్వం తనకు అలవాటైంది అంటారు సింధు. అలాగే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై అమితంగా ఆసక్తి ఉండేది. అందుకే.. అదే సబ్జెక్ట్స్‌పై పీహెచ్‌డీ కూడా చేశారు. ఆ తర్వాత ఏదైనా చాలెంజింగ్ టాస్క్ తీసుకోవాలని భావించి.. స్టార్టప్‌పై దృష్టి పెట్టారు.

### తొలి అడుగు..

సింధు, తన భర్తతో కలిసి బార్సిలోనా కేంద్రంగా 2012లో కాగ్నికోర్ కంపెనీని స్థాపించారు. వెంచురా నుంచి రూ. 55 లక్షల గ్రాంట్ తీసుకున్న తర్వాత కొన్ని కార్పొరేట్ కంపెనీలు, ఏంజల్ ఇన్వెస్టర్ల ద్వారా 2013లో ఆరున్నర కోట్ల రూపాయల ఫండింగ్ దక్కించుకుంది కంపెనీ. ఈ ఫండింగ్‌తో కొన్ని యురోపియన్ టెలికామ్ కంపెనీలు క్లయింట్లుగా వచ్చాయి. తర్వాత మెల్లగా కేరళలో కంపెనీ స్థాపించి ఇండియాలో సేవలను ప్రారంభించారు. 'మోస్ట్ ఇన్నోవేటివ్ వెబ్ స్టార్టప్ ఇన్ యూరోప్'-తో సహా పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను కాగ్నికోర్ ఇప్పటికే సొంతం చేసుకుంది. ఆ తర్వాత అమెరికాకు షిఫ్ట్ అయిన సింధు.. వ్యాపారాన్ని విస్తరించడంతో పాటు ఇన్వెస్ట్‌మెంట్ పెట్టే సంస్థల కోసం అన్వేషించారు. అలా పలు సంస్థలు కలిసి పనిచేయడానికి ముందుకు వచ్చాయి.



### కాగ్నికోర్ ఏం చేస్తుందంటే..

బ్యాంకులోన్ తీసుకోవడం దగ్గర్నుంచి.. కారు ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయడం, టిక్కెట్ బుక్ చేయడం ఇలా.. ప్రతీ సర్వీసులోనూ ఎక్స్‌పర్ట్ అసిస్టెన్స్ అన్నది చాలా కీలక అంశంగా మారిపోయింది. 2012లో బార్సిలోనా కేంద్రంగా మొదలైన కాగ్నికోర్ సరిగ్గా ఇదే పనిచేస్తుంది. కస్టమర్ల అవసరాలకు తగినట్లు వారి ప్రశ్నలకు త్వరితగతిన రెస్పాండ్ అవడంతో పాటు పర్సనలైజ్డ్ కస్టమర్ అసిస్టెన్స్‌ను అందిస్తున్నది. కంపెనీ సీఈవో సింధు చెబుతున్నదాని ప్రకారం.. ప్రతీఏటా 27 వేల కోట్ల కస్టమర్ కాల్స్‌లో 60 శాతం వరకూ.. అంటే దాదాపు 16,200 కోట్ల కాల్స్‌కు ఎలాంటి పరిష్కారం దొరకడంలేదు. 'ప్రతీ సక్సెస్‌ఫుల్ బిజినెస్ కూడా..కస్టమర్ కాల్స్‌కు పరిష్కారం చూపడానికే ఎక్కువగా ఫోకస్ పెడుతుంటాయి' అంటారు సింధు ప్రస్తుతం ఉన్న పోటీలో సమస్యకు సమాధానం కాదు.. పరిష్కారం ఇవ్వాలి. సరిగ్గా ఇదే విషయంలో చాలా కంపెనీలు ఫెయిల్ అవుతున్నాయి. కస్టమర్‌గా ఇలాంటి సమస్యను ఫేస్ చేసిన సింధు.. అందుకు కేవలం టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు లేకపోవడమేనన్న విషయాన్ని గుర్తించారు. మధ్యతరహా, పెద్ద వ్యాపారాలకు ఇది మరింత అవసరమంటారు సింధు.

### మార్కెట్ పై ప్రభావం..

'2022 నాటికి ఇంటెలిజెంట్ వర్చువల్ ఏజెంట్ మార్కెట్ రూ. 33,930 కోట్లకు చేరుకుంటుంది. ఐబీఎంలాంటి అత్యుత్తమ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై గతంలో ఎన్నడూ లేనంతగా ఫోకస్ పెడుతున్నాయి. ఈ పరిణామం తమలాంటి మరెన్నో కంపెనీలకు బూస్ట్ ఇస్తుందంటారు సింధు. 'మానవజాతిని తుడిచిపెట్టడానికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడతారన్న అపోహ.. దానిలోని పాజిటివ్ కోణాలను చూడనీయకుండా చేస్తున్నది అంటారు సింధు. ఇదే టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించవచ్చని, నిత్యజీవితంలో అది ఎంతగానో ఉపయోగపడుతుందని, కొన్ని కోట్ల మందికి తమ పనులను సులువుగా చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుందని' అంటున్నారు.

### నేను ఫైటర్‌ని..



టెక్నాలజీ అనేది ఒక్కటే మనల్ని బతికించగలదు అని నేను నమ్మను. అందుకే.. ఎక్కువమంది మహిళలు టెక్నాలజీ వైపు రావాలని నేను భావించడంలేదు. కాకపోతే.. అది మహిళ అయినా మగవాళ్లయినా.. ఇంట్రస్ట్ ఉంటే మాత్రం దేనికీ వెనుకాడకుండా అనుకున్నది సాధించి తీరాలి. మహిళలనే వివక్ష కూడా స్వయంగా ఎదుర్కొన్నారు సింధు. కానీ.. నేను ఫైటర్‌ని. నా చేతలతోనే సమాధానం చెప్తాను అని ధీమాగా సమాధానం ఇచ్చారామె.

### కార్పొరేట్ల సాయం లేదు..

సమస్యల పరిష్కారంలో టెక్నాలజీది ఎప్పుడైనా కీలక పాత్ర అంటారు సింధు. అలాంటి సమస్యల పరిష్కారానికి తాను కృషిచేస్తుంటే.. తన భర్త కంపెనీ కోఫౌండర్ రోష్ చెరియన్ దానితో ఒక అత్యుత్తమ ప్రొడక్ట్ ఎలా డెవలప్ చేయాలా అని నిత్యం ఆలోచిస్తుంటారు అని చెబుతున్నారు. చాలామంది మహిళలు పైస్థాయికి రావడానికి ఎంతో కష్టపడుతున్నారని, అందుకు కార్పొరేట్ల నుంచి ఆశించినంత సాయం మాత్రం అందడం లేదు అంటారు ఆమె. కష్టపడి పనిచేయడానికి ఆసక్తి ఉన్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు ముందుకు రాకపోవడం వల్ల మహిళలు ఆసక్తి చూపడం లేదంటారు సింధు.

---

### అందమైన చర్మం కోసం..



- ద్రాక్ష రసం కూడా మొటిమలు రాకుండా చేస్తుంది. ద్రాక్ష రసంలో కాస్తంత గులాబీ నీరు చేర్చి ముఖంపై రుద్దితే చర్మంపై పడిన ముడతలు తొలగిపోతాయి.
- బొప్పాయిలో ఫైబర్, విటమిన్ సి, కాల్షియం ఉంటాయి. ఈ పండులో యాంటీ యాక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ప్రకాశవంతమైన చర్మాన్ని ఇవ్వగలవు.
- కమలా పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి మేలు చేస్తుంది. ఈ పండు తొక్క, రసాన్ని ఏజింగ్ క్రీమ్స్‌లో బాగా వాడతారు. వీటికి చర్మాన్ని టైట్ చేసే శక్తి ఉంటుంది.
- అరటి పండ్లలో ఉండే ఐరన్, మెగ్నీషియం, పొటాషియం విటమిన్ ఏ, బీ, చర్మాన్ని మృదువుగా చేస్తాయి.

# రిపేర్ చేస్తే బుల్లెట్ దిగాల్సిందే!

**యుద్ధరంగంలో తుపాకీ పట్టిన మహిళల్ని చూసే ఉంటారు. కానీ.. ఆ తుపాకీలకు మరమ్మతులు చేసే మహిళల్ని ఎక్కడైనా చూశారా? రిపేర్ చేయడంలో ఆరితేరిన ఈ నలుగురు మహిళల గురించి తెలుసుకోండి.**

**మగవారి** పనిగా భావించే గన్స్ రిపేర్ వృత్తిని చేపట్టడం అంత సులువేం కాదంటున్నారు నేపాల్‌కు చెందిన లీలా కాప్లే, హిమా పోఖ్రాల్, అస్మితా ఆచార్య, కుస్ కుమారి థాపా అనే నలుగురు మహిళలు. నేపాల్ సైన్యంలో తుపాకులకు మరమ్మతులు చేసేది ఈ నలుగురు మహిళలే. నేపాల్ ఆర్మీలో గన్స్ రిపేర్ చేసే వారిలో మొదటి మహిళ అయినందుకు లీలా కాప్లే చాలా గర్వపడుతున్నది. 'ఈ పని ఆర్మీలో తప్ప మరెక్కడా నేర్చుకోలేనిది. ఇందులో నిబద్ధత చాలా అవసరం. ఎందుకంటే తుపాకీ పేల్చినపుడు కచ్చితంగా గురి పెట్టిన చోటే తగలాలి. రిపేర్‌లో చిన్న పొరపాటు జరిగినా పక్కవారి ప్రాణాలు తీస్తుంది. పురుషులు యుద్ధభూమిలో పోరాడుతున్నప్పుడు మహిళలు తుపాకులను ఎందుకు రిపేర్ చేయకూడదని అనిపించింది' లీలా కాప్లేకు. పురుషులతో సమానంగా పనిచేయాలన్న భావనతో ఈ వృత్తిని ఎంచుకున్నది. ఆర్మీ శిక్షణ ప్రారంభంలో తుపాకీలు ఎక్కువగా వాడడంతో వాటి తయారీపై సందేహాలతోపాటు ఆసక్తి మొదలైంది. ఆ ఉత్సాహంతోనే గన్స్ మెయింటెనెన్స్ విభాగాన్ని ఉద్యోగంగా ఎంచుకున్నది. ఈ వృత్తిలో విదేశీ మహిళలను ఆదర్శంగా తీసుకున్నది. ఆర్మీలో పనిచేయడానికి మహిళలు చాలామందే ఉన్నారు. కానీ తుపాకీలు తయారు చేసేవారు, బాగు చేసేవారు కేవలం నలుగురే ఉన్నారంటున్నది లీలా కాప్లే. వీరి సంఖ్య మరింత పెరిగితే ఈ రంగంలో కూడా మంచి అవకాశాలు ఉంటాయంటున్నది.





# చొరవ చూపి... చేరదీసి..!

**మహారాష్ట్రలోని జలగావ్ పట్టణంలో సమతా నగర్ ఓ స్లమ్ ఏరియా. అక్కడ కొంతమంది చెత్త ఏరుతూ జీవనం గడుపుతుంటారు. ఆరేండ్ల పిల్లల నుంచి 70 ఏండ్ల వ్యక్తుల వరకూ ఇదే పని. అద్వైత్, ప్రణాలి దంపతుల రాకతో వారి జీవన విధానంలో మార్పులొచ్చాయి.**

**అద్వైత్,** ప్రణాలి ఇద్దరూ వేర్వేరు ప్రాంతానికి చెందిన వ్యక్తులు. ముంబై నగరంలో కార్పొరేట్ ఉద్యోగాలు చేశారు. అద్వైత్ చదువుకుంటున్న సమయంలోనే ప్రణాలి పరిచయమైంది. పెండ్లి కూడా చేసుకున్నారు. ఇద్దరూ ప్రాజెక్ట్ పనిలో భాగంగా రూరల్ ఏరియాల్లో తిరుగాల్సి వచ్చేది. ఈ క్రమంలోనే సమతానగర్ స్లమ్ ఏరియా పరిస్థితులు వీళ్లను కలిచి వేశాయి. మురుగు నీరు, వ్యాధులు, చదువుకు దూరమైన పిల్లలు, పౌష్టికాహార లోపం, గుట్కా, తంబాకుకు అలవాటైన పిల్లల పరిస్థితి అంతా వీళ్లను బాధించింది. 2013లో అద్వైత్ ఉద్యోగాన్ని వదిలేసి ఇక్కడే స్థిరపడి వీళ్లలో మార్పులు తేవాలని ఆశించారు. వర్ధిష్ణు అనే నాన్‌ప్రాఫిట్ ఆర్గనైజేషన్ స్థాపించారు. మొదట చెత్త ఏరుకొనే వారితో మాట్లాడి, వారి పిల్లలను స్థానిక పాఠశాలలకు పంపేందుకు కృషి చేశారు. సుదీర్ఘ కాలం తర్వాత వంద మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. తర్వాత వారికి ఆశ్రయం కల్పించడానికి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసి బొమ్మలు, పుస్తకాలు అందుబాటులో ఉంచారు. టీచర్లతో కలిసి ప్రచారం చేశారు. విపరీతంగా గుట్కాలు, తంబాకులకు బానిసలైన పిల్లలకు, చెత్త ఏరుకుంటున్న యువకులకు ఉపాధి కల్పించడానికి కృషి చేశారు. ఇలా స్థానికుల్లో అవగాహన కల్పిస్తూ, వలంటరీలుగా చేర్పించుకొని మురికివాడల అభివృద్ధికి, చెత్త ఏరుకొనే వారికి ఉపాధి కల్పించడంలో ఈ దంపతులు సక్సెస్ అవుతున్నారు.



# కండరాలు ఎందుకు పట్టేస్తున్నాయి?

**నా వయసు 45 ఏండ్లు. ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తాను. పనిలో భాగంగా ఎక్కువగా ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. కొద్దిరోజులుగా నడుస్తుంటే పాదాల్లో, పిక్కల్లో బాగా నొప్పి వస్తున్నది. కండరాలు పట్టేస్తున్నట్లుగా అనిపిస్తున్నది. ఏదో మామూలు నొప్పి అయుండొచ్చు.. తగ్గుతుందిలే అనుకున్నాను. ఆర్నెళ్ల నుంచి ఈ నొప్పి మరింత తీవ్రమైంది. అసలు నా సమస్య ఏంటి? ఎలా తగ్గుతుందో దయచేసి తెలుపగలరు.**

**- సరోజ్, హైదరాబాద్**

అడుగండి చెబుతా



మీరు తెలిపిన వివరాలను పరిశీలిస్తే కాలి రక్తనాళాలలో పూడిక ఉన్నట్లు తెలుస్తున్నది. పూడిక ఏర్పడటం వల్ల వచ్చే ఈ నొప్పిని ఫెరిఫెరల్ వాస్క్యులర్ డిసీజ్ (పీవీడీ) అంటారు. గతంలో ఈ సమస్య ఎప్పుడన్నా వచ్చిందా? ఇప్పుడే వచ్చిందా తెలిస్తే పీవీడీ పట్ల కొంత స్పష్టత వస్తుంది. ఎక్కువగా ప్రయాణాలు చేస్తారని చెప్పారు కాబట్టి మీ సమస్యకు అది కూడా కారణమే. దాంతో పాటు పొగతాగే అలవాటు ఉంటే కూడా ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. మధుమేహంతో బాధపడుతున్న వారు, అధిక బరువున్నవారు, ఆరోగ్యకరమైన అలవాట్లు లేనివారి ఎక్కువగా ఈ సమస్యకు గురవుతుంటారు. సాధారణంగా కాళ్లకు రక్త సరఫరా తగ్గడం వల్ల పీవీడీ సమస్య వస్తుంటుంది. రక్తనాళాల్లోని పూడికలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. రక్త ప్రవాహం తెలుసుకోవడం ద్వారా కూడా పీవీడీని అంచనా వేయొచ్చు. దీనిని బట్టే చికిత్స చేస్తారు. చికిత్సతోపాటు మీరు జీవనశైలిని మార్చుకోవడం వల్ల ఈ సమస్య తగ్గుతుంది. తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతిరోజు తప్పనిసరిగా వాకింగ్ చేయాలి. మీది నిత్యం ప్రయాణాలతో కూడుకున్న డ్యూటీ కాబట్టి ప్రయాణానికి ముందు లెగ్ ఎక్సర్‌సైజ్ చేయాలి. సిగరెట్, పాన్, గుట్కా వంటివి తినే అలవాటు ఉంటే వెంటనే మానేయాలి. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రతరం అవుతుంది.



డాక్టర్ ప్రకాశ్ గౌర
సీనియర్ వాస్క్యులర్ సర్జన్
యశోద హాస్పిటల్స్
మలక్‌పేట్

### ఈగల్ని, దోమల్ని తరిమేయండిలా.



- వర్షాకాలంలో దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటిని ఇంటి నుంచి తరిమి కొట్టేందుకు చిన్న రిబ్బన్‌కు లావెండర్ నూనెను పూస్తే.. అవి పారిపోతాయి.
- మాంస పదార్థాలపై రోజ్‌మేరీ చల్లితే ఫలితం ఉంటుంది. ఆహారం రుచి కూడా పెరుగుతుంది. ఈగలు వాలవు.
- వేప నూనె వాసనకు దోమలు పరారవుతాయి. ఈ నూనె ఒంటికి రాసుకుంటే దోమలు దగ్గరికి కూడా రావు.
- వాటర్ స్టోరేజీ ఉన్న స్థలాల్లో కాఫీ పొడి చల్లితే దోమలు వెళ్లిపోతాయి.
- నిమ్మగడ్డి నుంచి తీసిన రసంతో తయారు చేసిన కొవ్వొత్తులను ఇంట్లో ఉంచుకుంటే మంచిది. ఆ వాసనకు ఈగలు, దోమలు పారిపోతాయి.

II.

నమస్తే తెలంగాణ

నిపుణ

[ కరీంనగర్ ]

సోమవారం 22 జూలై 2019



# ఘన వారసత్వానికి గుర్తింపు

**యునెస్కో వారసత్వ కట్టడాలు, ప్రదేశాలపై పోటీ పరీక్షల్లో తరచూ ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో నిపుణ పాఠకుల కోసం యునెస్కో నూతనంగా గుర్తించిన ప్రదేశాల వివరాలు అందిస్తున్నాం.**

- ఐక్యరాజ్యసమితి ప్రత్యేక విభాగమైన విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో)ప్రపంచ వారసత్వ కమిటీ ప్రపంచ వారసత్వ జాబితాలో మరో 29 చారిత్రక, సహజసిద్ధమైన ప్రదేశాలు, కట్టడాలు, మానవ నిర్మితాలను చేర్చింది. అజర్‌బైజాన్ రాజధాని బాకులో జూన్ 30 నుంచి జూలై 10 వరకు జరిగిన యునెస్కో 43వ సదస్సులో ఆయా దేశాల నుంచి వచ్చిన నామినేషన్లను పరిశీలించింది. ఇందులో మనదేశం నుంచి పింక్ సిటీగా గుర్తింపు తెచ్చుకున్న రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్ చోటు సంపాదించుకుంది.



- భారతదేశంలో వారసత్వ గుర్తింపు పొందిన ప్రాంతాలు 36 ఉండగా జైపూర్ 37వ ప్రాంతంగా చేరింది. ఇప్పటివరకు యునెస్కో 167 దేశాలకు చెందిన 1,121 ప్రాంతాలను వారసత్వ ప్రదేశాలుగా గుర్తించింది. ఈ ఏడాది ఆఫ్రికా నుంచి ఒకటి, అరబ్ దేశాల నుంచి రెండు, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 10, యూరప్, ఉత్తర అమెరికా నుంచి 15, లాటిన్ అమెరికా నుంచి ఒక ప్రాంతాన్ని వారసత్వ జాబితాలో చేర్చారు. అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవం (ప్రపంచ వారసత్వ దినోత్సవం) ప్రతి ఏటా ఏప్రిల్ 18న నిర్వహిస్తారు.

## యునెస్కో నూతన వారసత్వ ప్రదేశాలు

### 1 బుడ్జ్ బిమ్ కల్చరల్ ల్యాండ్‌స్కేప్

- నైరుతివిక్టోరియాలోని ఆస్ట్రేలియన్ అబోరిజినల్ సైట్ 'బుడ్జ్ బిమ్ కల్చరల్ ల్యాండ్ స్కేప్'ను యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చింది. 'బుడ్జ్ బిమ్ కల్చరల్ ల్యాండ్ స్కేప్' ఆస్ట్రేలియాకు నైరుతిలో ఆదివాసులు ఉండే గుండిట్జ్‌మార ప్రాంతంలో ఉన్నది. ఆరువేల సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ ఆదివాసులు జీవనం సాగించారు. ఇది పిరమిడ్లు, అక్రోపోలిస్, స్టోన్‌హెంజ్ కంటే పురాతనమైనది. ఆదివాసుల సంస్కృతి ఇక్కడ విలసిల్లింది. ఆదివాసుల సంస్కృతి ప్రాముఖ్యతకు ప్రపంచ వారసత్వ రక్షణ పొందిన మొదటి ప్రదేశంగా గుర్తింపు తెచ్చుకుంది.



### 2 ఖాన్ ప్యాలెస్



- అజర్‌బైజాన్‌లోని ఖాన్‌ప్యాలెస్ షెకి చారిత్రక కేంద్రం. గ్రేటర్ కాకసస్ పర్వత పాదాల వద్ద ఉన్న ఈ చారిత్రక నగరాన్ని గుర్జన నది వేరుచేస్తుంది. 18వ శతాబ్దంలో మట్టిప్రవాహాలు పాత పట్టణాన్ని నాశనం చేసిన తర్వాత ఈ చారిత్రక కేంద్రాన్ని పునర్నిర్మించారు. ఇక్కడి నిర్మాణాల్లో కప్పులతో కూడిన ఇళ్లు అక్కడి సంప్రదాయ పద్ధతిలో నిర్మాణం చేపట్టారు. ముఖ్యమైన చారిత్రాత్మక వాణిజ్య మార్గాల్లో ఉన్న నగర నిర్మాణం సఫావిడ్, కద్జార్, రష్యన్ భవన సంప్రదాయాలతో ప్రభావితమైంది. నగరానికి ఈశాన్యంలో ఖాన్ ప్యాలెస్‌లో అనేక వర్తక గృహాలు ఉన్నాయి. 18వ శతాబ్దం చివరి నుంచి 19వ శతాబ్దం వరకు పట్టు, కొబ్బరికాయల వ్యాపారం ఎక్కువగా సాగింది.

### 3 దిల్మన్ బరియల్ మౌండ్స్

- బహ్రెయిన్-దిల్మన్ అతి ప్రాచీన నాగరికత. సముద్రవాణిజ్య మార్గంలో బహ్రెయిన్ ఉండటంతో నాగరికత ఏర్పడింది. దిల్మన్ బరియల్ మౌండ్స్‌ను ఒక డానిష్ బృందం కనుగొన్నది. ఈ ద్వీపం పశ్చిమ భాగంలో మట్టిదిబ్బల (శ్మశాన వాటికలు) సమాధులను క్రీ.పూ 2050-క్రీ.పూ 1750 మధ్య నిర్మించారు. ఈ సమాధులు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్నాయి. 11,774 సమాధులు ఇక్కడ ఉన్నాయి. ప్రతి సమాధిలో ఒక కేంద్ర రాతిగది, దాని చుట్టూ భూమితో తక్కువగోడ, దానిపై కంకరతో చేసిన కప్పు ఉంటుంది. ఈజిప్టు సమాధులవలే భారీ సంపద ఇక్కడ పేర్చలేదు. ఇందులో రాతి, ఖనిజాలు, రాతితో చేసిన జాడి, దంతపు వస్తువులు, రాగి ఆయుధాలు ఉన్నాయి. వాటి సంఖ్య, స్థాయి పరంగానే కాకుండా శ్మశానగదులు వాటి వివరాలు పూర్తిగా ఉన్నాయి. ఇందులో 21 పురావస్తు ప్రదేశాలు ఉన్నాయి. ఇది దిల్మన్ నాగరికతకు సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. దిల్మన్ బరియల్ మట్టిదిబ్బల సమూహంతో బహ్రెయిన్ మూడో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా స్థానాన్ని దక్కించుకుంది.





### 6 ప్యారటీ ఇలా గ్రాండీ

- ఇది బ్రెజిల్‌లోని బ్రెజిల్-సెర్రాడా బోసినా పర్వత శ్రేణి, అట్లాంటిక్ మహాసముద్రం మధ్య ఉన్నది. తీరప్రాంత పట్టణ చారిత్రక కేంద్రాల్లో ఇది ఒకటి. ఇది ప్రపంచంలోని జీవవైవిధ్య ప్రదేశాల్లో ఒకటిగా నిలిచింది. ప్యారటీ అనేది 18వ శతాబ్దపు పాత ఓడరేవు పట్టణం. ఇది ఆఫ్రికన్ బానిసలకు ప్రవేశ కేంద్రంగా ఉండేది. ఈ ప్రాంతం వివిధ జాతుల వైవిధ్యానికి నిలయంగా ఉండటంతో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపునిచ్చింది.

### 4 జైపూర్ సిటీ

- పింక్ సిటీగా పేరు పొందిన రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ నగరంగా గుర్తింపు లభించింది. మధ్యయుగపు రాజరిక సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన జైపూర్ పర్యాటక ప్రాంతంగా ప్రపంచ గుర్తింపు పొందింది. రాజస్థాన్ నగర నిర్మాణ శైలి రాజపుత్రుల రాజరిక అభిరుచికి తగిన విధంగా ఉంటుంది. జైపూర్ మహానగరానికి ఉన్న సకల వసతులు కలిగి వాణిజ్యానికి అనుకూలంగా ఉండి ప్రఖ్యాత వ్యాపార కూడలిగా ఉన్నది. ఆధునిక నగరాల నిర్మాణానికి ముందే అభివృద్ధి చెందిన భారతీయ నగరాల్లో జైపూర్ ప్రత్యేకత కలిగి ఉంది. జైపూర్ నగరం 111 అడుగుల (34 మీటర్ల) రహదారులతో ఆరు విభాలుగా విభజించి ఉంటుంది. నగరశివారు ప్రాంతాలు రహదారులతో నగరంతో అనుసంధామై ఉంటాయి. మధ్యలో ఆరో భాగంలో రాజమహల్ నాలుగు వైపులా నాలుగు భాగాలు, ఆరోభాగం తూర్పు దిశగా విస్తరించి ఉంటుంది. ప్యాలెస్ విభాగం రాజసౌధాలను ఆనుకుని ఉంటుంది.

- క్రీ.శ 1727లో అంబర్ మహరాజు రెండో జైసింగ్ ఈ నగర నిర్మాణం చేపట్టాడు. తన రాజధానిని అంబర్ నుంచి జైపూర్‌కు మార్చాడు. 16వ శతాబ్దం నాటి అంబర్‌కోట, గులాబీరంగు ఇసుక రాతికట్టడమైన హవామహల్, ఖగోళ విజ్ఞాన కేంద్రం జంతర్‌మంతర్ వంటివి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తన రాజధాని ఆతిథ్యానికి పెద్ద పీట వేయాలన్న తలంపుతో జైపూర్ మహరాజు నగరంలోని కట్టడాలన్నింటికి గులాబీ రంగు వేయించాడని చరిత్ర చెబుతుంది. అందుకే దీనిని గులాబీ నగరం (పింక్ సిటీ)గా పిలుస్తారు. ప్రణాళికాబద్ధంగా నిర్మించిన జైపూర్ నగరంలో అభివృద్ధి చెందిన ప్రాంతాలు అనేకం ఉన్నాయి. సవాయ్ జైసింగ్ వాస్తుశాస్త్ర నిపుణులతో చక్కటి నిర్మాణ శైలితో జైపూర్ నగరాన్ని నిర్మించాడు. ఒక్కొక్కవీధి తూర్పు-పడమర, ఉత్తర-దక్షిణాలుగా నిర్మింపజేశాడు. తూర్పు ద్వారం పేరు 'సూర్యస్థూపం' పడమటి ద్వారాన్ని' చంద్రస్థూపం' గా పిలుస్తారు. ఉత్తర ద్వారం జొరావర్‌సింగ్ ద్వారం అంటారు. ఉత్తర ద్వారం వైపు పురాతన రాజధాని అయిన అంబర్ ఉన్నది. జైపూర్ నగరాన్ని ఎనిమిది మండలాలుగా విభజించారు. పితాపద అనే తొమ్మిదో భాగం వాణిజ్య అవసరాల కోసం నిర్మించారు. ప్రముఖ పర్యాటక పత్రిక కోస్ట్ ట్రావెలర్ జరిపిన సర్వేలో ఆసియాలోని పర్యాటక ఆకర్షణను కలిగిన నగరాల్లో ఏడో స్థానాన్ని సంపాదించుకుంది. ఈ సర్వేలో 76.5 శాతం ఓట్లు సంపాదించుకుంది. అంతర్జాతీయ పర్యాటకులు పెద్దసంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఈ నగరంలో అసంఖ్యాకంగా ఆలయాలు ఉన్నాయి. ప్రతి వీధిలో ఆలయాన్ని దర్శించవచ్చు. మతపరంగా ఈ నగరాన్ని చిన్నకాశీగా పిలుస్తారు. గోవింద్ జీ ఆలయం, గల్తాజీ ఆలయం, శ్రీకాళి ఆలయం, సంగనవేరి ద్వారం, లక్ష్మీనారాయణ మందిరం (బిర్లామందిర్), ఘర్‌గణేష్ ఆలయం, శీలాదేవి ఆలయం, పంచాయతీ హాల్, రాధాగోవింద్‌జీ ఆలయంతో పాటు 130 సంవత్సరాల ముందు మిర్జా ఇస్మాయిల్ రోడ్డు సమీపంలో ఉన్న ది ఆల్ సెయింట్స్ చర్చి నిర్మాణం అప్పటి నిర్మాణశైలికి తార్కాణంగా నిలిచింది. వీటితో పాటు జైపూర్ నగరం అందమైన పూల తోటలు, ఉద్యానవనాలతో నిండిఉంటుంది. వాటిలో ప్రధానమైన రామ్‌నివాస్ గార్డెన్, సిసోలియా క్వీన్ గార్డెన్, ప్యాలెస్, కనక్ బృందావన్, సెంట్రల్ పార్క్, మాన్ సరోవర్ సమీపంలో ఉన్న టెక్నాలజీ పార్క్, గోనర్ వద్ద ఉన్న విద్యాధర్ కా బాగ్ ముఖ్యంగా చెప్పుకోవచ్చు. దీంతో పాటుగా జైపూర్ నగరం సంప్రదాయక, ఎన్నో అధునాతన పరిశ్రమలకు ముఖ్యకేంద్రంగా ఉంది. ఆసియాలో అత్యధికంగా స్వర్ణాభరణాలు, వజ్రాలు, రత్నాభరణాలను చేసే నగరాల్లో జైపూర్ ప్రధానమైనది. నీలి వజ్రాలకు ఇక్కడ మాత్రమే పదునుపెడతారు. ఇన్ని అంశాలతో కూడిన జైపూర్ నగరాన్ని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్‌కు చెందిన 21 దేశాల అధికారుల బృందం 2018లో పరిశీలించి వారసత్వ హోదా ఇవ్వాలని నిర్ణయించింది.



### 5 బగాన్

మయన్మార్‌లో బగాన్ అతి ప్రాచీనమైన నగరం. క్రీ.శ 2వ శతాబ్దంలో ఈ నగరాన్ని నిర్మించారు. మయన్మార్‌లోని ప్రధానమైన పర్యాటక ప్రదేశాల్లో బగాన్ ఒకటి. ప్రపంచ నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ఇక్కడికి యాత్రికులు వస్తుంటారు. బగాన్ క్రీ.శ. 1044 నుంచి క్రీ.శ. 1287 వరకు రాజధాని నగరంగా ఉంది. మయన్మార్‌లో అయ్యర్వాడి నదికి సమీపంలో బగాన్ ఉంది. ఇక్కడ క్రీ.శ 11, 13వ శతాబ్దాల నాటి బౌద్ధుల నిర్మాణాలు ఉన్నాయి. 40 వేల చ.మీ. విస్తీర్ణంలో వేల కట్టడాలు, అందులో హిందూ, బౌద్ధదేవాలయాలు, పగోడాలు, మఠాలు, స్థూపాలు ఉన్నాయి. థేరవాద, మహాయాన, తాంత్రిక బౌద్ధమతంతో పాటు హిందూ మతం (శైవం, వైష్ణం) మత సంప్రదాయాలు ఇక్కడ విలసిల్లాయి. 716 గోపురాలతో కూడిన నిర్మాణాలు ఉన్నాయి. వీటికి బంగారు పూత పూసిన గోపుర శిఖరం ప్రత్యేక ఆకర్షణ.



### 7 బాబిలోన్



- బాబిలోన్ గ్రీక్ అకడియస్ బాబిల్లా అని పిలిచే పురాతన మెసపటోమియా నగర రాజ్యం. ఇది పదివేల సంవత్సరాలకు పూర్వమే ప్రపంచ పట్టణాల్లో ముఖ్యపట్టణం. ప్రపంచంలో ప్రథమంగా ఏర్పడిన మహాసామ్రాజ్యాల్లో ప్రసిద్ధి చెందింది. దీని అవశేషాలను నేటి ఇరాక్‌లోని బాగ్దాద్‌కు 85 కి.మీ. దూరంలోని ఆల్ హిల్లా, బాబిల్ ప్రావిన్స్‌లో కనుగొన్నారు. టైగ్రిస్, యూఫ్రటిస్ నదుల మధ్య ఉన్న సారవంతమైన మెసపటోమియా మైదానంలోని శిథిలమైన మట్టి-ఇటుకల భవనాలు, మట్టిదిబ్బలు, పురాతన ఆవాసాల నుంచి ఏర్పడిన ప్రసిద్ధ నగరం నేటి బాబిలోన్. ఇక్కడ నబోపాలసార్ అనంతరం అతని కుమారుడు నెబుకెడ్ నెజర్ క్రీ.పూ 626-539 పాలన కాలంలో బాబిలోనియా తన ప్రాచీన ఔన్నత్యాన్ని మించిన ఘనత పొందింది.

### 8 లియాంగ్జు నగర అవశేషాలు



- చైనాలోని లియాంగ్జు నగరంలోని పురాతన శిథిలాలు ప్రపంచ వారసత్వ జాబితాలో చేరాయి. ఇవి క్రీ.పూ. 3300-2300 కాలానికి చెందినవి. యాంగ్జీ నది పరీవాహక ప్రాంతంలో ఇవి నిక్షిప్తమై ఉన్నాయి. యాంగ్జీ నది వాయవ్య ప్రాంతంలో 14.3 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి.

### 9 జోడ్రెల్ బ్యాంక్ అబ్జర్వేటరీ



- అనేక దశాబ్దులుగా ఖగోళ పరిశోధనలో సేవలందిస్తున్న బ్రిటన్‌లోని జోడ్రెల్ బ్యాంక్ అబ్జర్వేటరీ యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరింది. ప్రపంచంలోనే రేడియో ఖగోళశాస్త్ర పరిశోధనశాలలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది. ఇది ఉల్కలు, చంద్రుడి గురించి అనేక అధ్యయనాలు చేసింది. 3,200 టన్నుల బరువుతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టీరిబుల్ రేడియో టెలిస్కోప్ అయిన జోడ్రెల్ బ్యాంక్ అబ్జర్వేటరీని 1945లో ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత శక్తిమంతమైన రేడియో టెలిస్కోప్‌లలో ఒకటిగా ఉంది.

### 10 ఒంబిలిన్ కోల్ మైనింగ్



- ఆగ్నేయాసిలోని పురాతన బొగ్గు మైనింగ్ ప్రాంతమైప ఒంబిలిన్ కోల్ మైనింగ్ ప్రాంతం ఇండోనేషియాలో ఉంది. పశ్చిమ సుమత్రాలోని సవహ్లుంటోలో ప్రాంతంలో విస్తరించి ఉన్నది. బోరోబుదూర్, ప్రంబనన్ ఆలయం, సంగిరాస్ సైట్, బాలిలోన్ సుబాక్ వ్యవస్థ తర్వాత ఇండోనేషియాలోని ఒంబిలిన్ కోల్ మైనింగ్ ప్రాంతాన్ని ప్రపంచ సాంస్కృతిక వారసత్వంగా యునెస్కో గుర్తించింది.

నమస్తే తెలంగాణ

# నిపుణ

[ కరీంనగర్ ]

సోమవారం 22 జూలై 2019



# బీటెక్‌లో చేరుతున్నారా?

# గేట్ కూడా మొదలుపెట్టండి!

- GATE-2020 ప్రకటన విడుదలైంది. ఈసారి ఈ పరీక్షను ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తున్నది. GATE-2020 స్కోర్ మూడేండ్లు ఉంటుంది.
- **ఆన్‌లైన్ అప్లికేషన్లు ప్రారంభం:** సెప్టెంబర్ 3
- **చివరితేదీ:** సెప్టెంబర్ 24
- **పరీక్ష తేదీ:** 2020, ఫిబ్రవరి 1, 2, 8, 9

**పరీక్ష సరళి**

| PART-1 | PART-2 |
|---|---|
| General aptitude | ఇంజినీరింగ్ సబ్జెక్ట్స్ |
| ఇందులో 10 ప్రశ్నలు ఉంటాయి | ఇందులో 55 ప్రశ్నలు ఉంటాయి |
| 1 to 5 ప్రశ్నలు 1మార్క్ | 1 to 25 ప్రశ్నలు 1 మార్క్ |
| 6to 10 ప్రశ్నలు 2 మార్క్స్ | 26 to 55 ప్రశ్నలు 2 మార్క్స్ |
| దీనిలో మొత్తం 15 మార్కులకు ఉంటాయి. | ఇందులో ఇంజినీరింగ్ మ్యాథ్స్ సంబంధిత ప్రశ్నలు 10 నుంచి 15 మార్కులకు ఉంటాయి. మొత్తం 85 మార్కులకు ఉంటాయి. |

- **వివరాలకు** http://gate.iitd.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు.
- మొత్తం 65 ప్రశ్నలకు 100 మార్కులు.
- నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. కాబట్టి తెలిసిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు గుర్తించాలి.

1 మార్కు ప్రశ్నల తప్పు సమాధానానికి 1/3 మార్కు కోత విధిస్తారు.

2 మార్కుల ప్రశ్నకు 2/3 మార్క్ నెగెటివ్ అవుతుంది.

- న్యూమరికల్ ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ లేదు.

## పరీక్షించే అంశాలు

- ఇంజినీరింగ్ ప్రాబ్లమ్స్‌ను అవగాహన చేసుకోవడానికి ఇంగ్లిష్‌పై పట్టు ఉండాలి.
- ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోని సమస్యలను సాధించడానికి కచ్చితత్వం, వేగం కలిగిన ఆలోచనలు అవసరం. కాబట్టి జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోని కాన్సెప్ట్స్ అర్థం చేసుకుని, సాధించడానికి మ్యాథమెటిక్స్ (higher) చాలా అవసరం.
- ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాన్సెప్ట్స్ అండ్ సొల్యూషన్స్ ను అప్లయ్ చేయగలగాలి. అభ్యర్థిని అప్లికేషన్ ఓరియంటేషన్‌లో పరీక్షిస్తారు.
- ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సడెన్ ప్రాబ్లమ్స్‌ను రికగ్నైజ్ చేసి రెక్టిఫై చేసే స్కిల్స్ ఉండాలి.
- ఇంజినీరింగ్ ఫీల్డ్‌లో టైమ్ మేనేజ్‌మెంట్ కీలకం. కాబట్టి నెగెటివ్ మార్కింగ్‌తో 65 ప్రశ్నలు ఆన్సర్స్ చేయడానికి 3 గంటల సమయం ఇచ్చి పరీక్షిస్తారు.

## మంచి ర్యాంకు రావాలంటే

- గేట్ జాతీయ స్థాయి పరీక్ష. దీనికి పోటీ ఎక్కువగా ఉంటుంది. అంతమాత్రాన మనం దాన్ని సాధించలేమని కాదు కదా! కష్టమనే భావనను పక్కనపెట్టి, ప్రణాళికాబద్ధంగా, కాన్సెప్టువల్ లెర్నింగ్, ప్రాక్టీస్, సరైన మార్గదర్శకత్వంలో చదివితే మంచి స్కోర్ సాధించవచ్చు.
- ప్రిపరేషన్ కోసం స్టడీ మెటీరియల్ (పాఠ్య పుస్తకాలు, ఎక్స్‌పర్ట్ నోట్స్, గేట్, ఈఎస్‌ఈ క్వశ్చన్ బ్యాంక్, మోడల్ క్వశ్చన్ పేపర్లు) సేకరించుకోవాలి.
- గేట్ సిలబస్‌లో ఉన్న సబ్జెక్టుల ప్రిపరేషన్‌ను ప్రణాళిక ప్రకారం ప్రారంభించాలి.
- జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌కు సంబంధించి ప్రతిరోజు ఒక గంట ప్రిపేరవుతూ ప్రాక్టీస్ చేయాలి. గేట్ ప్రిపరేషన్ నిరంతరంగా ఎగ్జామ్ వరకు సాగడానికి మనసు, శరీరం సంసిద్ధంగా ఉండాలి.
- ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్‌కు సంబంధించిన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లు ఎప్పుడు అడిగినా చెప్పేట్లు ప్రిపేర్ కావాలి.
- సంబంధిత ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో కామన్ అంశాలైన నెట్‌వర్క్స్, సిగ్నల్ సిస్టమ్స్, ఈఎంఎఫ్, కంట్రోల్ సిస్టమ్స్, ఈడీసీ, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్‌లోని కాన్సెప్ట్‌లను అర్థం చేసుకుని ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. పరీక్షలో వీటిపై వచ్చే ప్రశ్నలు లాజికల్‌గా ఉంటాయి. అందువల్ల షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవడం వల్ల టైమ్ మేనేజ్‌మెంట్ చేయవచ్చు.
- ప్రతి సబ్జెక్టు నుంచి 7-10 మార్కులు వస్తాయి. కాబట్టి అన్ని అంశాలను క్షుణ్ణంగా ప్రిపేర్ కావాలి. దీనికోసం గేట్ ప్రిపరేషన్‌ను తొందరగా ప్రారంభించాలి. వచ్చే ఏడాది జనవరి లోపు కనీసం రెండుసార్లు ప్రిపరేషన్ పూర్తిచేయాలి.
- ఒక సబ్జెక్టును చదివేటప్పుడు సినాప్టిక్ నోట్స్, ముఖ్యమైన ఫార్ములాలు, ఈక్వేషన్లు తయారు చేసుకుని పరీక్ష వరకు గుర్తుంచుకునే పద్ధతిని అలవర్చుకోవాలి.
- సబ్జెక్టు ప్రిపరేషన్‌లో మొదటగా కాన్సెప్టులు నేర్చుకోవాలి. తర్వాత గత గేట్ ఈఎస్‌ఈ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. ప్రామాణిక పాఠ్యపుస్తకంలోని ఎక్సర్‌సైజ్ ప్రశ్నలు చేయాలి. వాటికి సంబంధించి పరీక్షలు (ఆఫ్‌లైన్, ఆన్‌లైన్) రాయాలి. ప్రిపరేషన్ సమయంలో వచ్చే అనుమానాలను వెంటనే నివృత్తి చేసుకోవాలి.
- ఇంజినీరింగ్ కోర్ సబ్జెక్టులను అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా, సబ్జెక్టులను సమ్మిళితం చేసి ప్రిపేరవ్వాలి.
- ఉదాహరణకు ట్రిపుల్ ఈ (ఈఈఈ) వారికి పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మెషిన్స్‌లోని అంశాలను కలిపి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.
- ఈసీఈ వారికి సిగ్నల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్‌ను కలిపి ప్రశ్నలు వస్తాయి.
- ప్రిపరేషన్ సమయంలో అన్నికంటే విలువైనది కాలం అని గ్రహించాలి. పరీక్షకు ఆరు నెలల సమయం మాత్రమే ఉండటంతో కోచింగ్ తీసుకుంటే ఉపయోగంగా ఉంటుంది. కోచింగ్ సెంటర్‌ను ఎంపికచేసుకునేటప్పుడు...
- క్లాస్‌తోపాటు అనుమానాలను నివృతి చేసేవారు
- క్లాస్‌లో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారు
- అధ్యాపకుల అనుభవం, పిరియాడికల్‌గా మోటివ్ చేయడం వంటివి గమనించాలి.
- హైదరాబాద్ కోఠిలోని స్పేస్ ఇంజినీరింగ్ అకాడమీ బాగా చదివే పేద విద్యార్థులకు గేట్-2020 కోసం ఉచితంగా కోచింగ్, హాస్టల్ వసతి కల్పిస్తున్నది. 25 ఏండ్ల అనుభవం కలిగిన డైరెక్టర్ జేసీ రుద్రపతి ఆధ్వర్యంలో గేట్-2020 కోచింగ్ ఇస్తున్నారు. అవసరం ఉన్నవారు 9848485698 నంబర్‌లో సంప్రదించవచ్చు.
- Free coaching for GATE-2020 and GOVT. Jobs at SPACE engg Academy
- Eligibility: BTech/BE (completed), GATE-19 Qualifying card, 75% and above in BTech.
- Selection: Written exam + Interview
- Final selection: 30 Students
- Top 10 students: Stipend Rs. 1000/month

## ఇలా చేయండి

- బీటెక్ లేదా బీఈ చదువుతున్న విద్యార్థులు గేట్ ప్రిపరేషన్‌ను బీటెక్ రెండో ఏడాదిలోని ప్రారంభించాలి.
- అకడమిక్ ప్రోగ్రామ్, గేట్ ప్రిపరేషన్ సింక్ అయ్యేలా చూసుకోవాలి.
- గేట్ స్కోర్ వల్ల కలిగే లాభాలను అవగాహన చేసుకోవాలి.



జేసీ రుద్రపతి
సీఎండీ స్పేస్ ఇంజినీరింగ్ అకాడమీ
కోఠి, హైదరాబాద్
9848485698

## రిఫరెన్స్ బుక్స్

- **నెట్‌వర్క్ థియరీ-** నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్-డీ రాయ్ చౌదరి,ఇంజినీరింగ్ సర్క్యూట్ అనాలసిస్- విలియం హెచ్ హయట్
- **కంట్రోల్ సిస్టమ్స్-** కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీరింగ్- ఐజే నాగ్‌రాథ్, ఎం గోపాల్,అటామిక్ కంట్రోల్ సిస్టమ్- BC Kuo,లీనియర్ కంట్రోల్ సిస్టమ్- బీఎస్ మాంక్
- **ఎలక్ట్రో మ్యాగ్నటిక్ థియరీ-** ఎలిమెంట్స్ ఆఫ్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్స్- సాదిక్, ఇంజినీరింగ్ ఆఫ్ ఎలక్ట్రోమ్యాగ్నెటిక్స్- డబ్ల్యూహెచ్ హయట్, యాంటెన్నా అండ్ వేవ్ ప్రాపగేషన్- కేడీ ప్రసాద్, ఎలిమెంట్స్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్స్- ఎన్ఎన్ రావ్
- **డిజిటల్ ఎలక్ట్రానిక్స్-** డిజిటల్ డిజైన్- ఎం మోరిస్ మను, డిజిటల్ సిస్టమ్స్- టోకి అండ్ విడ్‌మర్, మోటర్న్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్- ఆర్‌పీ జైన్
- **సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్-** సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్- అలెన్ వీ ఓపెన్‌హైమ్, అలెన్ ఎస్
- **అనలాగ్ సర్క్యూట్స్-** ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్- కెన్నెడీ, డెవిస్, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్స్- జాకబ్ మిల్‌మన్,Ap Amp & Linear integrated circuit- రమాకాంత్ ఏ గైక్వాడ్,సెమీ కండక్టర్ డివైజెస్- SM Sze
- **ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్-** ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్- ఓపెన్‌హైమ్ అండ్ విల్‌స్కీ
- **ఎలక్ట్రిక్ మెషిన్స్ అండ్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్-** ఎలక్ట్రికల్ మెషిన్స్ అండ్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్- పీఎస్ భింబ్రా, ఎలక్ట్రికల్ మెషిన్స్ అండ్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్- Nagratb & Kotbari
- **ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్-** మెజర్‌మెంట్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్- AK Sawhney, మెజర్‌మెంట్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్- కూపర్
- **పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్-** పవర్ ఎలక్ట్రానిక్స్- పీఎస్ భింబ్రా
- **పవర్ సిస్టమ్స్-** పవర్ సిస్టమ్స్- నాగ్‌రాథ్ & కొఠారీ, పవర్ సిస్టమ్స్- సీఎల్ వాధ్వా, పవర్ సిస్టమ్స్- ఏ హుస్సైన్
- **కమ్యూనికేషన్ సిస్టమ్స్-** కమ్యూనికేషన్ సిస్టమ్స్- విల్‌స్కీ, ఎస్. హమీద్ నవాబ్,యాన్ ఇంట్రడక్షన్ టూ అనలాగ్ అండ్ డిజిటల్ కమ్యూనికేషన్స్- సైమన్ హైకిన్స్, కమ్యూనికేసన్ అనలాగ్ అండ్ డిజిటల్- సైమన్ హైకిన్స్, మోడర్న్ డిజిటల్ అండ్ అనలాగ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్- సింగ్ అండ్ సప్రే, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ సిస్టమ్స్- బీపీ లథి
- **మైక్రో ప్రాసెపర్స్-** మైక్రోప్రాసెసర్స్ ఫర్ ప్రోగ్రామింగ్ ఎగ్జాంపుల్స్- బీ రామ్

IIవ పేజీ తరువాయి

## 11 హిర్కానియన్ అడవులు

- ఇరాన్‌లోని హిర్కానియన్ అడవులు ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ అడవులు కాస్పియన్ సముద్రం దక్షిణ తీరం వెంట 850 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. కాస్పియన్ సముద్రం దక్షిణ సరిహద్దులోని తూర్పు నుంచి పడమర వరకు విస్తరించి ఉత్తర ఖోరాసన్, గోలెస్తాన్, మజందరస్, గిలాస్, అర్బాబిల్ సరిహద్దులుగా కలిగి ఉన్నాయి. పర్షియన్ చిరుతపులి, 180 రకాల పక్షులు, 60కిపైగా క్షీరద జాతులకు ఈ అడవులు నిలయంగా ఉన్నాయి. ఇవి అతిపురాతనమైన అడవులు. 25 నుంచి 50 మిలియన్ సంవత్సరాల నాటివి. 44 శాతం వాస్కులర్ మొక్కలు ఈ అడవుల్లోనే కనిపిస్తాయి.



- యునెస్కో ఇటీవల గుర్తించిన వారసత్వ ప్రదేశాల జాబితాల్లో ఈ కిందివి కూడా ఉన్నాయి.
- రిస్కో కైడో అండ్ సాక్రెడ్ మౌంటెన్స్ ఆఫ్ కల్చర్ ల్యాండ్‌స్కేప్- స్పెయిన్
- బ్రాగాలోని బోమ్ జీసస్ డో మోంటే అభయారణ్యం- పోర్చుగల్
- పురాతన ఫెర్రస్ మెటలర్జి సైట్స్- బుర్కినో ఫాసో
- అయిసినాయిపీ రైటింగ్ ఆన్ స్టోన్- కెనడా
- పసుపు సముద్రం బోహై గల్ఫ్ ఆఫ్ చైనా- చైనా
- ఎర్జిబిర్జియా మైనింగ్ రీజియన్- జర్మనీ
- ఫ్రెంచ్ ఆస్ట్రల్ ల్యాండ్స్ అండ్ సీస్- ఫ్రాన్స్
- క్లాడ్రుబి నాడ్ లాబెం దగ్గర ఉత్సవ గుర్రాల గ్యారేజ్- చెక్ రిపబ్లిక్
- ఆగ్స్‌బర్గ్ వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్- జర్మనీ
- లే కొల్సినె డెల్ ప్రొసెకో డి కోనెగ్లియానో ఎ వాల్డోబియాడెనే- ఇటలీ
- ఫ్రాంక్ లాయిడ్ రైట్ (20వశతాబ్దపు అర్కిటెక్చర్)- యునైటెడ్ స్టేట్స్
- జియాంగ్ కువాంగ్ మెగాలిథిక్ జార్ సైట్స్- లావోస్
- క్రిమియోంకీ ఫ్లింట్ మైనింగ్ రీజియన్- పోలెండ్
- కాలాడ్రుబి నాడ్ లాబమ్- జెకియా



## 12 చర్చెస్ ఆఫ్ స్కోవ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్

- స్కోవ్ రష్యా అతిపురాతన నగరం. వాయవ్య రష్యన్ నగరమైన స్కోవ్‌లో పదిహేడు ప్రత్యేక భవనాలు ఉన్నాయి. మధ్య యుగంలో ఈ నగరం అతి సంపన్న నగరంగా వెలుగొందింది. 12వ శతాబ్దంలో వీటిని నిర్మించారు. స్కోవ్ నగరంలోని ఈ చారిత్రక కట్టడాలను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చింది. వీటి నిర్మాణంలో స్కోవ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లక్షణాలు ఉన్నాయి.



## 13 వత్నాజోకుల్ నేషనల్ పార్క్

- వత్నాజోకుల్ నేషనల్ పార్క్ ఐస్‌లాండ్ ఉపరితల వైశాల్యంలో 14,701 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. దాదాపు ఐస్‌లాండ్ వైశాల్యంలో 14శాతం ఆక్రమించి ఉన్నది. ఇక్కడ ఎక్కువ ప్రాంతం మంచుతో కప్పి ఉంటుంది. ఐరోపాలో అతిపెద్ద హిమానీనదానికి నిలయంగా ఉంది. 2004లో థింగ్వెలిర్ నేషనల్ పార్క్ తర్వాత యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరిన మూడో ఐస్‌లాండ్ ప్రదేశం వత్నాజోకుల్ నేషనల్ పార్క్. 10 అగ్నిపర్వత కేంద్రాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ 2109.6 మీటర్ల ఎత్తుగల ఐస్‌లాండ్‌లోనే ఎత్తయిన హవన్నాడాల్స్నకుర్ శిఖరం హిమానీ నదం దక్షిణ భాగంలో ఉన్నది. మంచు, అగ్నిపర్వతాలతో కూడుకున్న ఈ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు నిత్యకృత్యం. 2016లో వారసత్వ హోదా కోసం ఐస్‌లాండ్ ప్రభుత్వం యునెస్కోకు నామినేషన్ పంపినప్పటికీ 2018లో పరిశీలించి ఇప్పుడు ప్రకటించింది.

## 14 మౌండెడ్ టూంబ్స్

- జపాన్‌లోని పురాతన సమాధులైన ఇవి మొజు-పురుచి కోఫున్ గ్రూప్‌నకు చెందినవి. జపాన్ పశ్చిమ ప్రాంతంలోని ఒసాకాలోని పురాతన శ్మశానవాటికల సముహమే మౌండెడ్ టూంబ్స్. ఇందులో 49 వరకు మట్టిదిబ్బలు ఉన్నాయి. వీటిని నాలుగో శతాబ్దం నుంచి ఐదో శతాబ్దం వరకు నిర్మించారు. సకాయ్, హబికినో, ఫుజిడెరా నగరాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ సమాధుల్లో 486 మీటర్ల పొడవుతో కీ హోల్ ఆకారంలో ఉన్న సమాధి ప్రపంచంలోనే అతిపెద్దదిగా చెప్పవచ్చు. ఇది జపాన్ 16వ చక్రవర్తి నింటోకు చెందిన సమాధిగా భావిస్తారు. ఈ మౌండెడ్ టూంబ్స్‌ను ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడంతో జపాన్‌లో వారసత్వ ప్రదేశాల సంఖ్య 23కు చేరింది.



- ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్న ప్రదేశాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యతను తెలియజేసేలా యునెస్కో వివిధ కార్యక్రమాలను చేపడుతుంది. ప్రపంచస్థాయి గుర్తింపు పొందడం అంటే ప్రపంచపర్యాటక మ్యాపులో శాశ్వతస్థానాన్ని సంపాదించడమే. అక్కడి ప్రాంతాల ప్రజలకు హెరిటేజ్ గుర్తింపు ఒక గర్వకారణంగా చెప్పవచ్చు. ఒకసారి హెరిటేజ్ కమిటీ గుర్తింపు లభిస్తే ఎనలేని ప్రచారం జరుగుతుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా వారసత్వంగా గుర్తించి వాటిని పరిరక్షిస్తూ.. ఇతర తరాలకు అందిస్తుంది. ఈ గుర్తింపు ద్వారా మానవ సంస్కృతి, వికాసానికి నిదర్శనంగా నిలిచిన ఈ ప్రాంతాల పరిరక్షణ బాధ్యతలను యునెస్కో చేపడుతుంది. మనుషులు, జంతువులు ఈ చారిత్రక ప్రదేశాల్లోకి అక్రమంగా ప్రవేశించకుండా, ధ్వంసం కాకుండా, స్థానిక పరిపాలన యంత్రాంగం నిర్లక్ష్యానికి గురికాకుండా కాపాడుతుంది. ఇందుకు అవసరమైన నిధులను ప్రపంచ వారసత్వ నిధి సమకూరుస్తుంది.

... సూదగాని సత్యం గౌడ్



## 15 సియోవాన్

- కొరియాలోని జోసియన్ శకానికి చెందిన తొమ్మిది కన్ఫ్యూషియస్ అకాడమీలు (సియోవాన్) ప్రపంచ వారసత్వ జాబితాలో చోటుసంపాదించాయి. క్రీ.శ. 1392-1910 కాలానికి చెందిన జోసియన్ రాజవంశం వీటిని నిర్మించింది. సియోవాన్ కన్ఫూషియస్ అకాడమీలు కన్ఫ్యూషియనిజం అభివృద్ధికి సూచికగా నిలిచాయి. ముఖ్యంగా ఈ తొమ్మిది అకాడమీల్లో యోయోంగ్జులోని సోసు సియోస్ కన్ఫూషియస్ అకాడమీ మొదటిది. దీనికి జూ సేబూంగ్ (1495-1554) బేగుండోంగ్ సియోవాన్ అని పేరు పెట్టారు. తర్వాత నామ్‌గైసోవాస్‌ను హమ్యాంగ్, ఒక్సాన్సీవోస్‌ను జియోంగ్జు, డోసాన్సీవోస్‌ను అండోంగ్, పిరామ్‌సీవోస్‌ను జాంగ్‌సింగ్, డోడోంగ్సివోస్‌ను డాల్సియాంగ్, బయోంగ్సాన్సీవోస్‌ను అండోంగ్, డోనామ్‌సీవోస్‌ను నాన్సాస్, మ్యూజియోంగ్సీవోస్‌ను జియోంగప్ నిర్మించారు. 1573లో నిర్మించిన ఒక్సాన్సీవోస్ ప్రత్యేకమైన భవననిర్మాణానికి ప్రసిద్ధి చెందింది. మొత్తం కట్టడం కన్ఫ్యూషియస్ రేఖాగణిత శైలిలో ఉంటుంది. ఇవన్నీ కొరియన్లు ఇష్టపడే పశ్చిమ దిశలో నిర్మాణం జరిగాయి.

## సుడోకు

**డైలీ సుడోకు 98 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 5 | 4 | 3 | 6 | 9 | 1 | 2 | 8 |
| 6 | 1 | 2 | 5 | 7 | 8 | 4 | 3 | 9 |
| 8 | 3 | 9 | 2 | 1 | 4 | 6 | 7 | 5 |
| 5 | 9 | 7 | 1 | 4 | 6 | 2 | 8 | 3 |
| 3 | 8 | 1 | 7 | 5 | 2 | 9 | 4 | 6 |
| 4 | 2 | 6 | 9 | 8 | 3 | 7 | 5 | 1 |
| 1 | 6 | 8 | 4 | 3 | 7 | 5 | 9 | 2 |
| 2 | 7 | 3 | 6 | 9 | 5 | 8 | 1 | 4 |
| 9 | 4 | 5 | 8 | 2 | 1 | 3 | 6 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -99**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | | 8 | | | | | | |
| | 4 | | | | 9 | | | 1 |
| | | 3 | | 7 | 6 | 4 | 5 | |
| | | | 1 | | | | 9 | |
| 4 | 8 | | | | | | 2 | 3 |
| | 7 | | | | 4 | | | |
| | 5 | 1 | 7 | 9 | | 2 | | |
| 8 | | | 4 | | | | 1 | |
| | | | | | | 8 | | 9 |


శ్రియ

# 'సైమా'కు ముస్తాబు

'సైమా' ఎనిమిదవ ఎడిషన్ అవార్డుల వేడుకలు ఆగస్ట్ 15-16వ తేదీల్లో ఖతార్‌లో జరుగనున్నాయి. ఈ వేడుకల్లో తెలుగు చిత్రసీమ నుంచి ప్రముఖ దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన 'రంగస్థలం' చిత్రం 12 నామినేషన్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో మహానటి (తొమ్మిది నామినేషన్స్), గీతగోవిందం(ఎనిమిది నామినేషన్స్), అరవింద సమేత (6నామినేషన్స్) నిలిచాయి. 'సైమా' వేడుకలకు సంబంధించి శనివారం హైదరాబాద్‌లో నిర్వాహకులు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు ఇందూరి మాట్లాడుతూ 'గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సైమా అవార్డులు మరింత కన్నుల పండువగా జరుగనున్నాయి. సినిమాలతో పాటు లఘు చిత్రాల రూపకర్తల్లోని ప్రతిభను వెలికితీయడానికి షార్ట్ ఫిల్మ్ అవార్డులను ప్రవేశపెట్టాం' అని తెలిపారు. ఈ సమావేశంలో కథానాయికలు శ్రియ, నిధి అగర్వాల్, రుహాని శర్మ, శాన్వి శ్రీ వాస్తవ, అస్మిత నర్వాల్ తమ అందాలతో ఆకట్టుకున్నారు.


సుప్రియ, అన్యాసింగ్, సందీప్‌కిషన్, తమన్, దయా పన్నెం

# ఆమె మాటలు కన్నీళ్లు తెప్పించాయి!

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన 'నిను వీడని నీడను నేనే' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. కార్తీక్‌రాజు దర్శకుడు. అన్యాసింగ్ కథానాయిక. దయా పన్నెం, సందీప్‌కిషన్, వీజీ సుబ్రహ్మణ్యన్ నిర్మాతలు. శనివారం హైదరాబాద్‌లో థాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'విడుదలైన రోజున మూడుగంటల వరకు సినిమా ఫలితం ఏమిటో అర్థంకాలేదు. ఆ తర్వాత అందరూ ఫోన్ చేసి అభినందించడం మొదలుపెట్టారు. ఇండస్ట్రీలోని పెద్దవాళ్లు కొందరు క్యాబ్‌లో షో వేయించుకొని చూసి మెచ్చుకున్నారు. రోడ్డుమీద నిలబడితే జనాలు పరుగెత్తుకొచ్చి..సినిమా చూశాం, చాలా బాగుంది అంటూ సీన్స్ గురించి చర్చిస్తున్నారు. మదర్‌సెంటిమెంట్ బాగుందని చెబుతున్నారు. అదే నిజమైన విజయమని భావిస్తున్నా. ఈ సినిమా విషయంలో అమ్మనాన్న బంధం తాలూకు భావోద్వేగాల్ని బాగా విశ్వసించాను. ఆ నమ్మకంతోనే ముందుకెళ్లాను. ఇప్పుడు అదే ఈ విజయాన్ని అందించిందనుకుంటున్నాను. విశాఖపట్నం నుంచి ఒకపెద్దావిడ ఫోన్ చేసి 'మా అబ్బాయి మూడునెలల క్రితం ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సినిమా అంతకు ముందే వచ్చిఉంటే ప్రాణాలు తీసుకునే ముందు మా గురించి ఆలోచించేవాడేమో' అని చెప్పినప్పుడు నా కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. కథను నమ్మి నిజాయితీతో చేసిన ప్రయత్నం ఫలించడం ఆనందంగా ఉంది' అన్నారు. దేవుడు సందీప్‌కిషన్ కష్టాన్ని గుర్తించి అపూర్వ విజయాన్ని అందించాడని సంగీత దర్శకుడు తమన్ చెప్పారు. నిర్మాతగా తమ తొలి చిత్రం చక్కటి ప్రేక్షకాదరణకు నోచుకోవడం ఆనందంగా ఉందని దయా పన్నెం తెలిపారు. ఈ సినిమా ద్వారా తనకు తెలుగు పరిశ్రమలో ఘనస్వాగతం లభించిందని కథానాయిక అన్యాసింగ్ చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# నభా నయా కెమిస్ట్రీ

'ఇస్మార్ట్ శంకర్' సినిమాలో వరంగల్ అమ్మాయిగా మాస్ పాత్రలో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది నభా నటేష్. తొలి సినిమాలో సున్నిత మనస్కురాలైన అల్లరి అమ్మాయిగా కనిపించిన నభా నటేష్ ఈ చిత్రంలో అందుకు పూర్తి భిన్నంగా చాందిని అనే ధైర్యవంతురాలైన యువతిగా మాస్ యాటిట్యూడ్‌తో కూడిన పాత్రలో కనిపించింది. ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ముఖ్యంగా రామ్, నభా నటేష్ మధ్య టిపికల్ రొమాన్స్, కెమిస్ట్రీ ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తున్నది. దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రత్యేక శ్రద్ధతో ఈ సన్నివేశాల్ని రాసుకున్నారు. చిత్రీకరణ సందర్భంగా రామ్, నభా కెమిస్ట్రీ యూనిట్ అందరికి నచ్చడంతో అనుకున్న వాటి కంటే ఎక్కువ సన్నివేశాల్ని పూరి జగన్నాథ్ రాసినట్లు తెలిసింది. రొమాన్స్‌తో పాటు వీరి కామెడీ టైమింగ్ ఆహ్లాదాన్ని పంచుతున్నది. రామ్, నభానటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. ఈ పాత్రలు కొన్నాళ్లపాటు గుర్తుండిపోతాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సినిమాతో తెలుగు చిత్రసీమలో రెండో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది నభానటేష్.


నభా నటేష్

# సుకుమార్‌కు అంకితం!


శ్రీపవార్, కృతిగార్గ్

శ్రీపవార్ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం '2అవర్స్ లవ్'. శ్రీనిక క్రియేటివ్ వర్క్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. కృతిగార్గ్ కథానాయిక. ఈ సినిమా ట్రైలర్‌ను శనివారం హైదరాబాద్‌లో నిర్మాత రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'రెండుగంటల పాటు ప్రేక్షకుల్ని ప్రేమలోకంలో విహరింపజేసే సినిమా ఇది. కథానాయకుడిగా, దర్శకుడిగా శ్రీపవార్ ప్రతిభను చాటాడు. ప్రస్తుతం మంచి కథలతో రూపొందుతున్న సినిమాల్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు' అని తెలిపారు. శ్రీపవార్ మాట్లాడుతూ 'సుకుమార్ స్ఫూర్తితో దర్శకుడినయ్యాను. ఆయనకు ఈ సినిమాను అంకితం ఇస్తున్నాను. ప్రేమ, రొమాన్స్ హంగుల కలబోతగా సాగే సినిమా ఇది. ఓ ప్రేమ జంట జీవితంలో రెండు గంటల్లో చోటుచేసుకునే పరిణామాలు ఆసక్తిని పంచుతాయి. త్వరలో విడుదలతేదీని వెల్లడిస్తాం' అని చెప్పారు. తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తుండటం ఆనందంగా ఉందని కృతిగార్గ్ చెప్పింది.

# బాలీవుడ్‌లో అరంగేట్రం


కీర్తి సురేష్

దక్షిణాదిలో పేరు సంపాదించుకున్న కథానాయికలు ఆ తర్వాత హిందీ చిత్రసీమలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తపిస్తుంటారు. దక్షిణాది నుంచి వెళ్లిన ఎంతోమంది నాయికలు బాలీవుడ్‌లో తమదైన ముద్రను వేశారు. జాతీయస్థాయిలో లభించే ఆదరణతో ఇప్పుడు దక్షిణాది అగ్రనాయికల అడుగులు బాలీవుడ్ వైపు పడుతున్నాయి. అదే కోవలో తమిళ సోయగం కీర్తి సురేష్ బాలీవుడ్ అరంగేట్రానికి రంగం సిద్ధమైనట్లుగా తెలిసింది. వివరాల్లోకి వెళితే..అనతికాలంలోనే తెలుగు, తమిళ భాషల్లో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును తెచ్చుకుంది కీర్తిసురేష్. ముఖ్యంగా 'మహానటి' ఈ సుందరి కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. వరుస విజయాల స్ఫూర్తితో ఈ అమ్మడు హిందీ చిత్రసీమలో ఎంట్రీ ఇవ్వబోతున్నది. కీర్తి సురేష్ కథానాయికగా ప్రముఖ నిర్మాత బోనీకపూర్ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాను ఓ అగ్ర దర్శకుడు డైరెక్ట్ చేయబోతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్ కారణంగా కీర్తిసురేష్ తమిళంలో పలు భారీ అవకాశాల్ని తిరస్కరించిందని చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె మలయాళంలో 'మరక్కార్' అనే చిత్రంలో నటిస్తున్నది. తెలుగులో రెండు సినిమాలు చిత్రీకరణలో ఉన్నాయి.

# 'సిరివెన్నెల' గీతాలు


'సిరివెన్నెల' గీతావిష్కరణ దృశ్యం

ప్రియమణి ప్రధా పాత్రలో నటిస్తున్న చిత్రం 'సిరివెన్నెల'. ప్రకాష్ పులిజాల దర్శకుడు. కమల్ బోరా, ఏ.ఎన్.భాషా, రామసీత నిర్మాతలు. శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతావిష్కరణ జరిగింది. ప్రియమణి మాట్లాడుతూ 'ఈ కథ బాగా నచ్చింది. ఈ సినిమాతో నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలైనట్లే. టీజర్, ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉన్నాయి' అన్నారు. ''మహానటి' చిత్రంలో నటించిన చిన్నారి సాయితేజస్విని సిరివెన్నెల పాత్రను పోషించింది. సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ చిత్రమిది. పాప చుట్టూ కథ నడుస్తుంది. తెలుగు ప్రేక్షకులకు నవ్యానుభూతిని అందించే చిత్రమిది' అని దర్శకుడు చెప్పారు. తన మనవరాలు సాయితేజస్విని సినిమాలో మంచి పాత్రను పోషించడం ఆనందంగా ఉందని సీనియర్ హీరో రాజేంద్రప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వైవిధ్యమైన సినిమాగా నిలిచిపోతుందని నిర్మాత కమల్ బోరా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, వైవీయస్ చౌదరి, ఆర్.పి.పట్నాయక్, ఎం.ఎం.కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠపాళి ఆటలో


మేరీ

సాయికేతన్, మేరీ జంటగా నటిస్తున్న చిత్రం 'వైకుంఠపాళి'. అజ్గర్ అలీ దర్శకుడు. కాండ్రేగుల ఆదినారాయణ నిర్మిస్తున్నారు. ప్రమోద్ సంగీతాన్ని అందించిన ఈ చిత్ర గీతాలు శనివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను నిర్మాత కె.ఎస్.రామారావు ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్నమైన పాయింట్‌తో తెరకెక్కిన హారర్ చిత్రమిది. జీవితమనే పరమపద సోపానపు ఆటలో ఓ పోలీస్ ఎలా గెలుపొందాడు? ప్రతీకారేచ్ఛతో ఉన్న ఓ ఆత్మతో అతడికి ఉన్న సంబంధమేమిటన్నది ఆకట్టుకుంటుంది' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'సాయికేతన్ అండర్‌కవర్ పోలీస్‌గా కనిపిస్తాడు. కథను నమ్మి ఈ సినిమాను రూపొందించాం. ఈ నెల 23న విడుదల చేస్తున్నాం. మా బ్యానర్‌లో 'మిస్టర్ లోన్లీ'(వీడి చుట్టూ అమ్మాయిలే) పేరుతో మరో సినిమా చేయబోతున్నాం' అని తెలిపారు. టీజర్, ట్రైలర్‌ను ఆసక్తిని పంచుతున్నాయని, కొత్తదనానికి పట్టం కడుతున్న ప్రస్తుత తరుణంలో ఈ చిత్రం ప్రతి ఒక్కరిని మెప్పిస్తుందనే నమ్మకం ఉందని కె.ఎస్.రామారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీర శంకర్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అసూయాద్వేషాలతో


సాక్షి, అభిషేక్

అభిషేక్‌రెడ్డి, సాక్షి నిదియా జంటగా నటిస్తున్న చిత్రం 'వైఫ్ ఐ'. 'నైఫ్ బెటర్ దెన్ వైఫ్' ఉపశీర్షిక. జి. ఎస్.ఎస్.పి కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. జి.చరితారెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు మాట్లాడుతూ 'సమకాలీన సమాజంలో జరుగుతున్న ఓ మంచి పాయింట్‌కు వినోదాన్ని మేళవించి ఈ సినిమాను రూపొందిస్తున్నాం. త్వరలో నిర్మాణానంతర కార్యక్రమాల్ని ప్రారంభిస్తాం' అని తెలిపారు. నేటి సమాజంలో భార్యభర్తల మధ్య ప్రేమ స్థానంలో అసూయద్వేషాలు పెరిగిపోవడానికి కారణమేమిటనే సందేశంతో రూపొందిస్తున్న చిత్రమిదని, తాము చేసిన తప్పులను ఓ జంట ఎలా సరిదిద్దుకున్నది అనేది ఆసక్తిని పంచుతుందని నిర్మాత పేర్కొన్నారు.




